ఉత్తరాలు



జూలై 18న మదరాసులో మరణించిన ప్రఖ్యాత రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు కీ.శే. ఏ.జి. ఊమెన్.

ముఖచిత్రం

పసిమి చాయ వన్నెలు
పసిడి వన్నె చిన్నెలు
చిందించిన జయప్రద జిలుగులు
తిలకించిన వారి కన్నుల వెలుగులు
ఆ మేని చక్కదనం
అందానికి నిర్వచనం
ప్రతి సంచిక ముఖచిత్రం
ప్రీతి పాత్రం బహు చిత్రం

(3-8-84 సంచిక జయప్రద ముఖ చిత్ర ప్రేరణతో)

ఆవుల రమణారెడ్డి జమ్మలమడుగు

రేవతి ముఖ చిత్రం అమాయకముగా చాలా బాగుంది సినీ తారల ముఖ చిత్రాలు తప్ప దేశ నాయకుల ముఖ చిత్రాలు ప్రచురించరా లేక నేటి నటులే రేపటి నాయకులని తలచి స్వాతంత్ర్యోద్యమ కార్య శూరులను మరచిపోతున్నారా? అల్లూరి సీతా రామరాజు ఫోటొ ముఖ చిత్రముగా వేయమని కోరుచున్నాను

మళ్ళ పద్మా మల్లేశ్వరరావు హరిపాలెం

గుత్తికొండ బిలము

శ్రీ కెప్టెన్ షేక్ మౌలాలిగారు తపోభూమి గుత్తికొండ బిలము విశేషాలతో కూడిన వ్యాసములో ఎంతో మందికి తెలియని కొత్త విషయాలు తెలిపినందులకు చాలా సంతోషము ఈ వ్యాసకర్త యింతకుముందు వ్రాసిన బడి పిల్లలతో హిమాలయ పర్వత ప్రాంత యాత్ర కూడా ఎంతో సాహసముతో కూడి విజ్ఞానదాయకముగా నున్నది జన్మతః ముస్లిమ్ అయినా అతని పురాణ విషయ పరిజ్ఞానం మాకు అచ్చెరు వొందింది విషయ పరిజ్ఞానము తెలుసుకొనుటకు మతము అడ్డు కారాదు

చల్లా వెంకట నాయుడు సికింద్రాబాదు

కవిత

నీవూ రైతువే! కవిత మమ్మల్ని ఎంతో ఆకర్షించింది ముఖ్యంగా చివరి పదాలు ఎంతో బావున్నాయి

కె వల్లి శ్రీనివాస్ హైదరాబాద్

వర్షించని మేఘం

వర్షించని మేఘం కథ మా యింటి అందరికి నచ్చింది కే శాంతిగార్కి మా అబినందనలు

ఎ హెచ్ ఉమా మహేశ్వరావు కురుపాం

శ్రద్ధాంజలి

ప్రముఖ కారూనిస్టు ఊమెన్ మరణించడం విచారదాయకం ఆంధ్రపత్రికలో లోకం పోకడ ఇకముందునుంచి వుండదని తెలిసి బాద పడుతున్నాను కీ శే ఊమెన్ మంచి రాజకీయ వ్యంగ్య కార్టూనిస్టు ఆయన మరణం పత్రికాలోకానికి తీరని లోటు అబిమానులకు అశనిపాతం శ్రీ ఊమెన్‌కు నా శ్రద్ధాంజలి

శ్రీకాకుళపు రామకృష్ణ విజయవాడ

కదలు

3 8 84 తేది సంచికలోని యం ఉమా మహేశ్వర రావుగారి వేరు కాపురం కద చాలా బాగుంది ప్రస్తుత నాగరిక సమాజంలోని ఎన్నో కుటుంబాలలో జరుగుతున్న నిర్దయాత్మక చర్యను కదా వస్తువుగా తీసుకున్న రచయిత అబినందనీయులు

డాంశ్రీ బట్టిప్రోలు

అభినందనములు

దరలు ఆకాశాన్నంటే ఈ రోజులలో బౌతికంగా ఎదో బాముకుందామనే దురాశలేక మానవుడే దేవుడని నమ్మి మానవత్వమే మానదండంగా చికిత్స చేసే నారాయణ స్వరూపులు కాంతి వైద్యులు కల్లూరి సీతా రామస్వామిగారు ఆద్యాత్మిక భౌతిక సమ్మేళనమైన కాస్మిక్ రేస్ దెరీప – విశ్వ కిరణ చికిత్స ద్వారా ఆరోగ్య మహా బాగ్యమును మానవాళికి అందజేస్తున్నందుకు నా హృదయపూర్వక దన్యవాదములు అటువంటి మహామనీషిని ఉత్తమ ఆదర్శ వైద్యుడుని హైదరాబాదు నోట్‌బుక్కు ద్వారా సమస్త ప్రజానీకానికి పరిచయము చేసిన ఆంధ్ర సచిత్ర వార పత్రికకు నా అబినందనములు


డూండి గుంతకల్

ఇదిగో, వాడడానికి సులభమైన హేర్-డై. ఎంతో తక్కువ ధరకు.

గోద్రెజ్ పౌడర్ హేర్ డై కాంసెంట్రేట్ మీ కోసమే ప్రత్యేకంగా రూపొందించబడినది.

ఇది భారతదేశపు ఏకైక తనంతటతానే వ్యాపించే పౌడర్ హేర్ డై కాంసెంట్రేట్. అందుకే, మీరు దీనిని ఎంతో తక్కువ పరిమాణంలో వాడుకోవచ్చు!

అన్నిటికంటే ముఖ్యం, ఇది మీకు నమ్మశక్యం కానంత తక్కువ ధరకు లభిస్తుంది!



కలపడం సులభం:
కొద్దిపాటి నీటిలో పౌడర్‌ను కలపండి. అంతే, అది వాడడానికి తయారు!



వాడడం సులభం:
జుత్తుకు కాస్త పట్టించి నెమ్మదిగా లోపలికి రాయండి. అది తనంతటతానే మెత్తగా, అంతటా సమానంగా వ్యాపించి మీ జుత్తును యౌవ్వనవంతంగా చేస్తుంది!





భారతదేశపు ఏకైక తనంతటతానే వ్యాపించే పౌడర్ హేర్ డై.

Godrej

పౌడర్ హేర్ డై కాంసెంట్రేట్

మీరు కోరే నాణ్యత. మీరు ఇష్టపడే ధర.

CLARION/GS/11/244 TEL

ఉత్తరాలు

అద్భుత వ్యక్తులు

29 6 84 ఆంధ్ర సచిత్ర వార పత్రిక సంచికలో – కలలు కల్లలు కావని నిరూపించిన మార్క్ ట్వెయిన్ గురించి బి వి పట్టాభిరామ్‌గారు మార్క్ ట్వెయిన్ జీవితంలో గడిచిన ముఖ్యమయిన సంఘటనలన్నీ వివరించి అతి ముఖ్యమయినది మాత్రం చెప్పటం మరిచారు అది మార్క్ ట్వెయిన్ మరణానికి – హేలీ కామెట్‌కి మధ్య నున్న చిత్రమైన సంబందం అనుబంధం మార్క్ ట్వెయిన్ నవంబరు 30 1835న పుట్టారు అప్పుడు ఆకాశంలో కన్పించింది ఒక వింత తోక చుక్క అదే హేలీ కామెట్

మార్క్ ట్వెయిన్ తన చివరి రోజుల్లో మళ్ళీ ఆ హేలీ కామెట్ వచ్చే తనని యిక్కడ్నుంచి తీసుకు వెళుతుందని జోస్యం చెప్పారు సరిగ్గా ఆయన ఊహించ్చి నట్టే 1910 ఏప్రిల్ 12 న ఆ హేలీ కామెట్ ఆకాశంలో ప్రత్యక్షమయిన సమయంలోనే ఆయనా ఈ భూ ప్రపంచంనించి నిష్క్రమించారు

సైంటిస్టుల లెక్క ప్రకారం మళ్ళీ ఈ హేలీ కామెట్ ఫిబ్రవరి 9 1986 మధ్యాహ్నం 3 30–4 30ల మధ్య కన్పడుతుందని

కలిదిండి జయ మదరాసు

* * *

నా అబిమాన నటి జయప్రద గారి ముఖ చిత్రం చాలా బాగుంది కళా జ్యోతి జయప్రదగారిని ముఖ చిత్రంగా వేసినందులకు నా హృదయ పూర్వక అబినందనములు

వి ఎస్ ఎస్ ఎన్ మూర్తి గునుపూడి

ధర్మచక్రం

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పేరుతో నేను రాసిన వ్యాసంలో ఒక పొరపాటు దొర్లినది విశ్వ విద్యాలయ సంకేతంలో శంఖ మున్నట్టు పేర్కొనడం జరిగింది అది తప్పు ధర్మ చక్రంగా దానిని గుర్తించాలి అంతేకాదు సంకేతానికి ఇచ్చిన వివరణ నాకు తోచినదే కాని అధికార పూర్వకమైనది కాదు ఇలా ఇవ్వడం తప్పిదం కాదనే నా అబిప్రాయం పాఠకులు గ్రహించాలి

డాక్టర్ గుమ్మనూరు రమేశ్ బాబు తిరుపతి

(66వ పేజీ చూడండి)

గమనిక

సకాలానికి అందని కారణంగా ఈ వారం విదేశంలో దుబాషీ శీర్షిక ప్రచురించ లేక పోతున్నాము

–సం

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు

దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం 1908

శివలెంక శంభు ప్రసాద్

సంపాదకుడు

(1938 1972)

శుక్రవారం 31-8 84

శ్రీ రక్తాక్షినామ సం భాద్రపద శు పంచమి

సంపుటము 76 సంచిక 51

సంపాదకుడు

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు	1-80
ఆరు మాసాల చందా	రు	46-80
పోస్టులో ఏడాది చందా	రు	101-40

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం విజయవాడ 520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం

మహాసంగ్రామం లో

జయసుధ

కథలు


ప్రియత	16
కూలిన ఆశలు	29
బంద్	49
ఈ సమాజం బాగుపడదు	61

సీరియల్ నవలలు

దాగుడు మూతలు	8
శ్రావణి	24
ఒక అమ్మ కథ (ప్రారంభం)	34
జీవితం మైనస్ సెంటిమెంట్	52

వ్యాసాలు, శీర్షికలు

ఉత్తరాలు-4 ప్రశ్నావళి 15 ఇ వేమన పద్యాలు 21 అద్భుత వ్యక్తులు 22 ధర్మపదం-33 సినిమా-40 వ్యక్తిగతం వారఫలం-46 పిల్లల దేవుడు మల్లేశ్వరస్వామి-47 డాక్టర్ సలహాలు-50 ఫాలాక్షుని డైరీ 51 నిజాంకు హైదరాబాదు కమ్యూనిస్టుల వంత పాట-59 హైదరాబాద్ నోట్‌బుక్-65


"అబ్బాయిది పదకొండేళ్ల
ప్రాయం నేడిక ఫుట్‌బాల్
ఆటలో ప్రపంచంలో
సాటిలేని మేటి ఫార్వర్డ్
ఆడగాడవులాడట"
Bournvita
బోర్న్‌విటాతో పెరిగే ప్రాయం యిది యిక
వాళ్ళు మిమ్మల్ని మెచ్చుకునే రోజొకటి వస్తుందిక!
1 కి||గ్రా ప్యాక్‌లో
కూడా దొరుకుతుంది
దీని లోపల ఉంది ఉచితంగా
లభించే
మగ్
పెరిగే వయస్సులోని పిల్లలు మరే మాల్టెడ్
ఆహార పానీయమూ కాకుండా బోర్న్‌విటాయే
ఎందుకు కావాలంటారు? రెండు తరాల్లోని
తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలకి యిక మరేదీ
కుదరదని ఎందుకు పట్టుబడతారు?
కేవలం ఝామ్ అనిపించే రుచి మాత్రమే
కాదు మరి కేవలం బోర్న్‌విటా పేరు చూసీ
కాదు ఉంది అందులో మరేదో ఉంది యింకా
మరెంతో అదే మరి బోర్న్‌విటా, పెరిగేందుకు
తోడ్పడే ఆహార పానీయం
క్యాడ్‌బరీస్
బోర్న్‌విటా
పిల్లలు సరిగ్గా పెరగడం,
అందుకే మరి బోర్న్‌విటా యివ్వడం
Bournvita
Bournvita
SAVE Rs.1.50
The Tastier Food Drink

సీరియల్

దాగుడుమూతలు

కప్పగంతుల మల్లికార్జునరావు

(గత పంచిక తరువాయి)

"సాయిరాగదమ్మా జానకీ" నాదస్వరం మీద అంపకాల పాట వినిపిస్తున్నది శాస్త్రోక్తంగా పాలలో అద్దిన తన చేతుల్ని తలిదండ్రులు గోపీచంద్ చేతిలో పెడుతున్నప్పుడు సులోచనకు ఏడుపు రాలేదు పైగా ఏదో ఆనందం బరువు దిగిపోయిన తృప్తి

ఆమె మొహంలో ఆ మెరుపు వుండగానే రామారావు ఫొటో తీసేసేడు

"లోచన్ నీ పెళ్లికి నా ప్రెజెంటేషన్ నేను స్పెషల్‌గా తీసిన, ఫొటో ఆల్బమ్ నువ్వు కారు ఎక్కేలోగా తయారుచేసి తీసికొస్తాను"

అప్పుడు కంట నీరు పెట్టుకొంటున్న తండ్రిని చూచిందామె

జనార్దనంగారు అల్లుడిని పక్కకు తీసికెళ్లేడు

'నాయనా నువ్వు దేముడిలా వచ్చావు రసాభాస కావల్సిన మా కుటుంబ చరిత్రను, లోచన జీవితాన్ని, రసవత్తరం చేసేవు కానీ బాబూ నాదొక్క చిన్న కోరిక జరిగిందంతా మనసులో పెట్టుకోకు అమ్మాయి దాన్ని మర్చిపోయేలా చూడు లోచనను గారాబంగా పెంచేము దాని జీవితాన్ని గురించి ఎన్నెన్నో కలలుగన్నాను కానీ భగవంతుడు దాన్ని చల్లగా చూడలేదు షాక్‌లమీద షాక్‌లు తిన్నది చివరికి నీ అండ చేరుతున్నది' గొంతు గద్గదమవుతున్నా' అలా చెప్పుకుపోతూనే వున్నాడు జనార్దనం

'లోచన విషయం మీరేం దిగులు పడకండి మామగారూ కోరి పెళ్లి చేసుకొన్నది, తనను సుఖపెట్టి నేను సుఖిద్దామనే గదా? నా శక్తి వున్నంతలో ఆమెకు ఏ కష్టం కలగనివ్వనని మాటిస్తున్నాను మీరు నిశ్చింతగా వుండండి' గోపీచంద్ అభయమిస్తున్నట్లు అన్నాడు

'నాకు తెల్సు నాయనా నువ్వు ఉత్తముడివి నేనే నీకేమీ చేయలేకపోతున్నాను డబ్బంతా వాళ్లకి ముందే యిచ్చాను నా పిల్ల, నేను వాళ్లకు అక్కర్లేకపోయాము కాని, నేనిచ్చిన డబ్బు, చీరె సారెలు అన్నీ కావల్సివచ్చాయి అన్నీ పట్టుకెళ్లేరు కాస్త చెయ్యి తెముల్చుకొని,

> **జరిగిన కథ — 3.** జనార్దనంగారు తమ కుమార్తె పెళ్లి వైభవంగా చేయ సంకల్పించారు పెళ్లికొడుకు రమేష్ స్నేహితులు కోరే కోరికలకు హద్దూ, పద్దూ లేకుండాపోయింది జనార్దనంగారు కూతురు సులోచన మొహంలో పెళ్లికూతురు మొహంలో వుండాల్సిన మెరుపు లేకపోవడం గుర్తిస్తారు డాక్టరు సుధాకర్ పెళ్లికూతురుని తదేకంగా చూడటం, పరధ్యానంగా ఉండటం రమేశ్ స్నేహితులు గమనిస్తారు రమేశ్‌కు ఈ విషయం చెపుతారు వారందరిలో ఈ విషయం ఆలోచనలు రేకెత్తిస్తుంది జరగాల్సిన పెళ్లి ఆగిపోయింది అదే ముహూర్తానికి గోపీచంద్ సులోచనను పెళ్లి చేసుకోడానికి సిద్ధపడతాడు

'నేను మిమ్మల్ని కట్న కానుకలను అడిగేనా మామగారూ? లోచనే, నేను మీనుంచి స్వీకరించిన కట్నం నాకు చాలు మీతో బంధుత్వమే నాకు కొండంత బలం'

అల్లుడు ఎంత వూరడించినా జనార్దనం దుఃఖం ఆగితేనా? ఏదో ఏదో యింకా ఏదో చెప్పాలన్న తాపత్రయం ఆరాటం

'నాన్నా' తండ్రి మనస్థితిని చూచి దుఃఖం ఆపుకోలేక బావురుమంది సులోచన

'అంపకాల దృశ్యం యిప్పుడు సహజంగా వుంది సినిమా కెమేరా పట్టుకొచ్చినా బాగుండేది నాలుగు షాట్స్ తీసుకొంటే ఏ సినిమాలో నయినా వుపయోగపడేవి"

రామారావు జోక్‌కి కొందరు నవ్వేరు

క్రమంగా వియోగభావనా భారం తగ్గసాగింది

'పాపం ఆ మేళగాళ్లు వాయించిన పాటనే ఎంతసేపు వాయిస్తారు? కారు డ్రైవరు తొందరపడుతున్నాడు ఆలస్యం చేసుకోటం ఎందుకు అనవసరంగా అమ్మాయిని బయలుదేరదియ్యండి'-సోమసుందరం మగపెళ్లి తరపు వాడిలా పెద్దరికం నెత్తిన వేసుకొని అన్నాడు

'నాయనా, అమ్మాయితో మా వాళ్ళెవరైనా' జనార్దనం అన్నాడు అలా ఆయన అనటం యిది పన్నెండోసారి

గోపీచంద్ నవ్వేడు

'మీ యిష్టం అండీ పంపితే పంపండి కానీ నా బాధ చెప్పేనుగదా? నేను యిక్కడ పెళ్లి చేసుకొంటున్నట్లు కూడా మా వాళ్లకు తెలియదు యిక్కడ రసాభాస జరగకూడదని వాళ్లెవరూ లేకుండానే పెళ్లిచేసుకొన్నాను భార్యనొక్కతెను వెంటపెట్టుకొని యీ వేషంతో వెళ్తేనే వారు నివ్వెరపోతారు మరి నా భార్య తరపు చుట్టాలను కూడా తీసుకెళ్తే వాళ్లకు వూపిరాడుతుందా? అక్కడ అసహజ దృశ్యాలే జరగకూడదు కదా? మా వాళ్లకు జరిగింది చెప్పి నచ్చచెప్పేక మిమ్మల్ని నేను స్వయంగా వచ్చి ఆహ్వానించి తీసుకెళ్తాగా?'

కూతురు మీద అనురాగంతో జనార్దనం చూపే చాదస్తానికి, అల్లుడయి వుండీ అంత తీరిగ్గా, ఓపిగ్గా గోపీచంద్ జవాబిస్తున్నందుకు అంతా అతడిని మనసులో మెచ్చుకొన్నారు

సులోచన అదృష్టవంతురాలనుకొన్నారు

సులోచన కారు వద్దకు నడవబోతుండగా నారాయణాచార్యులు హడావుడిగా వచ్చాడు

'అమ్మా, బాబూ, వెళ్తూ వెళ్తూ ఒక్కక్షణం దేవాలయంలోకి వచ్చి స్వామి ప్రసాదం తీసుకుపోదూ? మీకుభయులకూ మేలు జరుగుతుంది యిది నా కోరిక'

సులోచన వైపు చూచాడు గోపీచంద్ ఆమె భావనను అర్థం చేసుకొన్నాడు

'సరేనండీ దైవదర్శనం కన్నా మించిన భాగ్యమేముంది?'

కారు దేవాలయం ముందు ఆగింది దైవదర్శనమయ్యాక

నారాయణాచార్యులు, ఆయన భార్య, నూతన దంపతులిద్దరికీ స్వామి ప్రసాదం అంటూ నూతన వస్త్రాలిచ్చారు

'బాబూ, లోచన మా కూతురు లాంటిది ఆమె సుఖాన్ని కాంక్షిస్తూ నేను ఎప్పుడూ భగవంతుడిని ప్రార్థించేవాడిని భగవంతుడు నీ రూపంలో వచ్చి ఆమెనివాళ రక్షించాడు లేకపోతే పెళ్లి తప్పిపోవట మేమిటి ? తిరిగి ఆ ముహూర్తానికే మరెవరితోనో జరగటమేమిటి ? అంతా దైవలీల కాదూ ? హనుమత్సమేత శ్రీ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న పరివేష్టిత శ్రీరామచంద్రస్వామి వారు మీ దంపతులకెప్పుడూ మేలు చేయుగాక !'

నూతన దంపతులిద్దరూ వృద్ధ పూజారి దంపతులకు ప్రణామం చేసేరు వారు ఆశీర్వదించారు మళ్లీ

'యింటికి వెళ్లాక స్వామివారి మలిన వస్త్రాలు ధరించి పూజ చేసుకోండి నాయనా శుభం జరుగుతుంది'

కారు ఎక్కబోతుండగా పరుగు పరుగున వో వ్యక్తి రావటం గమనించారిద్దరూ దగ్గరికొచ్చాక గుర్తించారు అతను వెంకన్నబాబు

దగ్గరికొస్తూనే వెంకన్నబాబు గోపీచంద్ కాళ్లకు చుట్టుకు పోయాడు !

4

'డ్రైవర్ యిదే యిల్లు ఆపు'

కారు యింటిముందు ఆగింది

సులోచన గుండెలో ఏదో భయంగా వుంది

అత్తగారిల్లు ! ప్రవేశించబోతోంది వారి మొహం తనకి, తన మొహం వారికి తెలియదు వారు తనను ఎలా ఆహ్వానిస్తారో ?

ఆమె వస్తూ ఆ వీధిలో వాతావరణాన్ని పరిశీలించింది

ఇరుకు సందు పాత యిళ్లు

ముందుగా గోపీచంద్ కారు దిగేడు అతడిని చూడగానే గోలీలు ఆడుకొంటున్న పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చి చుట్టుముట్టేరు

'అన్నయ్యా, అన్నయ్యా పెళ్లిచేసుకొన్నావటగా? వొదినమ్మను సూపించవూ ?'

మురికి బట్టలు వేసుకొని అసహ్యంగా వున్న ఆ పిల్లలను అతను దగ్గరికి తీసుకొన్నాడు

వాళ్ల మాటలు విన్న సులోచన గుండె గుబేలుమంది అంటే— తనను పెళ్లిచేసుకొన్న వార్త అప్పుడే యిక్కడికి చేరిందా ? అయితే ఎవరూ తనని ఆహ్వానించటానికి రారేం ?

'చూపిస్తాను కానీ వొదినను చూచేది యీ వేషంతోనేనా ? మీమీ యిళ్లకెళ్లి శుభ్రంగా స్నానంచేసి మంచిబట్టలేసుకొని రావాలి ఆ— అన్నట్లు వొరేయి రావ్ పెళ్లి 'సేసు'కొన్నావనవచ్చునా ? అలాంటి సందర్భంలో 'స' బదులు 'చ' ఉపయోగించాలని చెప్పలేదూ ? మనిషి శరీరం, మాట, శుభ్రంగా, శుద్ధంగావుంటే మనసు, ఆలోచనలు శుద్ధమవుతాని చెప్పలేదూ ?'

'సారీ అన్నయ్యా' తల వంచుకొన్నారు పిల్లలు

'అన్నయ్యా కారులో ఆ అబ్బాయెవరు ?'

గోపీచంద్ వెంకన్నబాబుని చేయిపట్టుకొని కారు దింపేడు

'మీకు మాట వుంది కానీ శుభ్రత లేదు యీతనికీ ? భగవంతుడు అసలు మాటే యివ్వలేదు లేక యిచ్చి పోగొట్టేడో తెలియదు అయితేనేం ? మంచి మనసు వుంది—'

'అలాగా ! పాపం ! మూగవాడన్నమాట ! ఎంత ముద్దొస్తున్నాడో ? యిక్కడే వుంటాడా అన్నయ్యా'

వెంకన్నబాబు ఆశగా గోపీచంద్ వైపు చూచాడు

'ఉంటాడు మీరు అతడిని స్నేహితుడిలా, మీ సోదరుడిలా చూచుకోవాలి చూచుకొంటారుగా ?'

దిన్ని మేం చూచాంగా ? చాలా బాగుంది మా వదిన మంచి వదిన' అనుకొంటూ పిల్లలు తూనీగల్లా పరుగెత్తిపోయారు

లోచన వింటోంది చూస్తోంది ఆలోచిస్తున్నది

ఆమెకు తానో కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లనిపిస్తోంది ఒకవైపు ఆనందం — మరోవైపు భయం !


గోపీచంద్ చెయ్యి ఆమె చెయ్యిని పట్టుకొంది

ధైర్యం ఇన్‌జక్ట్ చేసినట్లయింది 'యీ మంచి వ్యక్తి చేయి తనకు అండగా, ఆధారంగా వుండగా తనకేమిటి భయం ?' అనుకొంది.

'లోచనా యిదే మన యిల్లు మావాళ్లకి అప్పుడే మన పెళ్లి విషయం తెలిసినట్లుంది మౌన ప్రదర్శనలు జరుగుతున్నాయి వెళ్దాం రా'

అతని చెయ్యి ఆధారంగా ఆమె దిగింది

'డ్రైవర్ థేంక్స్ వెళ్లిరండి'



కారు వెళ్లిపోయింది

లోచన చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకెళ్తున్నాడు గోపీచంద్ వాళ్ల వెనుకే మెల్లగా భయం భయంగా నడుస్తున్నాడు వెంకన్నబాబు


ఒకే కాంపౌండ్‌లో వున్న అనేక భాగాల సముదాయం ఆ యిల్లు పౌల్ట్రీ ఫారంలో కోడిగూడుల్లా వున్నాయి యిళ్లు

ఒక యింటిముందు ఎండుమిరపకాయలతోపాటు చాటలో రొయ్య చేపలూ ఎండబెట్టేరు చేపలు తెల్లగా మెరుస్తున్నాయి

మరో యింటిముందు ఎవరో వో ముసలాడు కూర్చొని కోడి యీకల్ని పలుస్తున్నాడు

సులోచనకు ఆ వాతావరణం చూచేసరికి కడుపులో తిప్పినట్లయింది తను యిందులో యిమిడిపోగలదా ?

గోపీచంద్ కులాన్ని గురించి ఆ స్థితిలో ఎవరూ ఆలోచించలేదు



దాగుడు మూతలు

అతనే తనవద్ద కులంలో తనకన్నా తక్కువన్నాడు తక్కువంటే ఏదో అనుకొంది కానీ యింత తక్కువస్థాయి కులమా? యిక్కడ వీళ్ల మాట, వేషం, ఆచారాలు అన్నీ తను పుట్టి పెరిగిన వాతావరణానికి విరుద్ధంగా వున్నాయే?

'భయమేస్తున్నదా లోచనా మావాళ్ల బ్రతుకుస్థాయి యిదే కానీ భయపడకు – నేను ప్యూర్ వెజిటేరియన్‌ను ఇదిగో యిదే మన గూడు'

వాళ్ల గూడు మిగతా గూడు లన్నింటికన్నా పెద్దదే పైగా శుభ్రంగా కూడా వుంది

సులోచన చెయ్యి పట్టుకొని గుమ్మంముందు నిలబడిపోయాడు గోపీచంద్ గుమ్మానికి అవతల, యింట్లో అతని తల్లి తండ్రి మూతులు ముడుచుకొని మొహాలు అవతలకి తిప్పుకొని కూర్చొని వున్నారు వాళ్లకు అల్లంత దూరంలో అతని తమ్ముడు చెల్లెలు గోడనానుకొని నిల్చొనివున్నారు

''అమ్మా–కోడల్ని తీసుకొనివచ్చి గుమ్మం ముందు నిలబడ్డానమ్మా మీరు చెప్పకుండా, మీరు లేకుండా నేను పెళ్లి చేసుకోటం నా తప్పే కానీ ఆలాంటి పరిస్థితి వచ్చింది కారణం లేకుండా నేనలాంటి పని చేస్తానమ్మా? చెప్పాడు మాటలు విన్న నాన్నకు కోపం వచ్చి వుంటుంది మా నాన్న కోపం తాటాకు మంట లాంటిది తల్లివి– నువ్వు కొపగిస్తే ఎలాగమ్మా? కోడలును ఎంతసేపని గుమ్మం బయట నిలబెడ్తావు? మీ అనుమతి లేనిదే ఆమె లోపలికి రాదమ్మా''

తల్లి తండ్రి వైపు చూచింది తండ్రి మొహం ముడిచాడు

'ఊ వోరి అన్మతీసుకొని అదు ఆ పిల్లను యింతవరకు తెచ్చేడో సెప్పమనవే ముందు? యీ బుఁబుచ్చే మాటలకేంలే?'

'మీ అనుమతి తీసుకోకుండా ఆ పిల్లను చేసుకోటం తప్పే నాన్నా కానీ ''

'ఓర్నానాయనా గోపాళం' నువ్వు మాతో చెప్పకుండా పెళ్లి సేసుకొని వచ్చావని కాదురా మీ అయ్య కోపం ఆళ్లెవరో కాదన్నా పిల్లను నువ్వు సేసుకొచ్చావని! యీ సయమంతా నీ స్నేయితుడు ఆ రమేశం బాబే వచ్చి సాయంగా సెప్పేదులే ఆళ్ళు ఎంత గొప్పోళ్లు అయితే మాత్తరం సీసీ కుక్క ముట్టిన యిత్తరాకు కోసం ఎగబడాల్సిన కర్మ నీకేంటిరా గోపాళం?'

సులోచన గుండె గుభేలుమంది!

గతం మర్చిపోదామనుకొంటే మరవనివ్వరు చుట్టుపక్కల వాళ్ళు! ఆ సంఘటన తనని క్షణక్షణం ముల్లులా గుచ్చవలసిందేనా?

తను పుట్టి పెరిగిన వాతావరణానికి, వీరుండే వాతావరణానికి ఎంతో వ్యత్యాసం వుంది– సామాజికంగా, సాంస్కృతికంగా, అయినా స్త్రీ పాటించవల్సిన విలువ దగ్గరికొచ్చేసరికి తన స్థాయిలాగే వీళ్ళూ ఆలోచిస్తున్నారే! భిన్నత్వంలో ఏకత్వం!?

సులోచన యిలా ఆలోచిస్తోంది

'రామ్మా లోపలికి రా' వులిక్కిపడింది సులోచన

తను ఆలోచనలో వున్నప్పుడు ఏం చెప్పేడో ఏమో అత్తగారు చెయ్యి పట్టుకొని పిలుస్తోంది మరదలు హారతి నీళ్లు పట్టుకున్నది

'వదినోయ్ అన్నయ్య పేరు చెప్పి మరీ లోపలికి రావాలమ్మోవ్'

క్షణంలో నైరాశ్యం అంతలోనే ఆశ, ఆనందం!

వదినామరదళ్ల పరిహాసాలు అయ్యాయి పెళ్లికూతురు తరపున చెల్లెలితో గోపీచందే పరిహాసాలు చేసేడు చెల్లెల్ని

'నా భార్య పేరు సులోచన నేను లోచన అని పిలుస్తాను నువ్వు మాత్రం సులోచన వదినగారూ అని పిలవ్వాలి తెల్సిందా?'

పేర్లు చెప్పుకోటం అయ్యాక అత్తగారింట కాలుపెట్టింది సులోచన ఆమె వెనుక వెంకన్నబాబు కూడా కాలుబెట్టేడు

రెండు రోజుల్లో ఆ యింటిని పూర్తిగా ఆకళింపు చేసుకొన్నది సులోచన కొంత కథ గోపీచంద్ స్వయంగా చెప్పేడు

గోపీచంద్ తండ్రి పేరు వెంకటస్వామి ముఠాకూలీగా పని చేసేవాడు అలా కష్టపడి పని చేస్తూనే గోపీచంద్‌ను చదివించేడు గోపీచంద్ చదువులోనేకాక అనేక రంగాలలో చాలా చురుగ్గా వుండేవాడు వెంకటస్వామికి కొడుకును బాగా చదివించి చాలా గొప్పవాడిని చేయాలన్న కోరికను గోపీచంద్ చాలా చిన్నిక్లాసుల్లో వుండగానే అతని మేష్టర్లు కలిగించారు

'వెంకటస్వామీ! నీ కొడుకు మంచి తెలివిగలవాడయ్యా నీ కడుపున తప్పబుట్టేడు వేడినీళ్లకు చన్నీళ్లుగా ఏదో యింత సంపాదించి పెడ్తాడన్న ఆశకుపోయి అతడి చదువు మాన్పించేవు? ఆ పొరపాటు మాత్రం చెయ్యకు చదివిస్తే నీ కొడుకు కలెక్టరవుతాడు'

గోపీచంద్ చదువు పెరిగేకొద్దీ వెంకటస్వామిలో కొడుకుమీద ఆశకూడా పెరిగింది స్కూల్లో, కాలేజీలో మేష్టర్లు ఆ ఆశను పెంచుతూనే వున్నారు

దానికితోడు గోపీచంద్ యస్సెల్సీ చదువుతుండగానే కథ రాసేడు దాన్ని ప్రకటించిన పత్రికవాళ్లు పారితోషికంగా కొంత డబ్బు పంపేరు

ఏనుగెక్కినట్లు సంతోషించాడు వెంకటస్వామి ముఠాకూలీ లందరితో తన కొడుకు గొప్పతనాన్ని గురించి చెప్పుకొన్నాడు

ఆతను ఏదో నాటకంలో వేషం వేసేడు ఐశ్వర్యవంతుడైన వో యువకుడి వేషం ఎవరో మిత్రులనుంచి అరువుతెచ్చి వేసుకున్న మంచిబట్టల్లో కొడుకును చూచి పొంగిపోయాడు

నాటకం అయ్యాక కొడుక్కేదో బహుమతి యిచ్చి అంతా అతడిని పొగుడుతుంటే కొండెక్కినంత సంబరపడ్డాడు

కాలేజీలో చేరేక గోపీచంద్ అటు చదువులో యిటు రచయితగా, వటుడుగా వృద్ధిచెందేడు రమేష్, సుధాకర్, భీమ్‌సేన్, సుబ్బారావు యిత్యాది మిత్రులంతా అతని గ్రూప్‌లో ముఖ్యులే పేకాట పిచ్చోళ్ళు

ఆ గ్రూప్‌లో, చదువులో, మిగతా విషయాల్లో, ఫస్టు గోపీచంద్ డబ్బు విషయాల్లో లేస్టు చదువులో యితను సహాయం చేసేవాడు డబ్బు విషయంలో వాళ్ళు సహాయం చేయబోతే తిరస్కరించేవాడు మొదటినుంచీ అతనికి కొన్ని ప్రిన్సిపుల్స్ వున్నాయి ఆ ప్రిన్సిపుల్స్ అతని కథల్లో ప్రతిఫలించేవి మాటల్లో విన్పించేవి అభిమానం, ఆత్మవిశ్వాసం, ఆలోచన, ఆచరణ అతనికి నాలుగు చేతులు

చక్కెర బస్తాలని లారీలోనుంచి కొట్లోకి మోస్తుండగా వో రోజు వెంకటస్వామి నడుము కలుక్కుమంది చక్కెర బస్తా బరువును మోయలేకపోయాడు నడుము విరిగినవాడిలా బోర్లాపడ్డాడు ఆ పడటంలో అతని కర్మ బాగుండక పక్కనున్న కాలువలో పడ్డాడు చెయ్యి విరిగింది బస్తా చినిగింది తెల్లటి తీపి చక్కెర మురికినీటి పాలయింది

ఆ దెబ్బనుంచి వెంకటస్వామి కోలుకోటానికి చాలాకాలం పట్టింది హాస్పిటల్‌లో మగతగా వున్నప్పుడు కూడా కొడుకును గురించిన కలవరింతలే

'అయ్యో గోపాళం నేను సత్తేనేం? బతికితేనేం! నువ్వు సదువుకోవాల్రానాయనా గొప్పోడివి కావాలి'

కానీ గోపీచంద్ ఎలా చదవగలడు?

సంపాదించే నడుం పడిపోయింది ఆ నడుం కోలుకొంటుందన్న నమ్మకం లేదు మరి తన తర్వాత యిద్దరు పిల్లలున్నారు తను పెద్దవాడు తన స్వార్థం చూసుకొంటే సరిపోతుందా? కుటుంబ సభ్యులందరి సమిష్టి సుఖాన్ని చూడవద్దూ? కష్టమో సుఖమో నలుగురూ కల్సి అనుభవించవద్దూ?

అతను వుద్యోగ ప్రయత్నాలు ఆరంభించాడు

ఇంటర్ పరీక్ష చిన్నగా పాసయిందనిపించాడు

అదృష్టవశాత్తూ అతనికి ఆ పరీక్ష పాసవుతూండగానే గుమాస్తా వుద్యోగం వచ్చింది చేరిపోయాడు

'యిదేంట్రా గోపయ్యా యిట్లా చేసేవ్? సదువెందు కాపేవురా? నువ్వు గొప్పోడివి కావాలిరా గొప్పోడివి కావాలంటే బాగా సదవ్వాలె మీ మేట్టర్లంతా సెప్పిందదేరా'

నిజమేనయ్యా మనిషి గొప్పోడు కావాలంటే గొప్పగా చదవ్వాలె కానీ ఆ చదువు కాలేజీలోనే చదవ్వాలని లేదయ్యా వోపిక వుత్సాహం వుంటే ఎక్కడైనా ఎప్పుడైనా చదవ్వొచ్చు'

'కానీ విద్యోగం'

'ఉద్యోగం తోటి, సంపాదనతోటి, హోదాలతోటి గొప్పతనం రాదయ్యా గొప్పతనం గొప్ప ఆలోచనలు వుంటే వుంటుంది ఆ గొప్ప ఆలోచనల్ని ఆచరణలో పెట్టినప్పుడు పెరుగుతుంటుంది అట్లా నేను గొప్పవాడినవుతానులే అయ్యా నువ్వు కంగారు పడకు'

గుమాస్తా వుద్యోగం చేస్తూ కూడా అతను మనిషిగా ఎదిగేడు ఉద్యోగ ధర్మ నిర్వహణలో అతను అమిత నిక్కచ్చి అవినీతి పనులు చేయనన్న పేరుంది అంచేత ఆ రాంటి పనులు చేసేవారందరికీ అతనంటే అమిత గౌరవం

అతను రచయితగా కూడా, మంచి విలువైన, ప్రయోజనాత్మకమైన రచనలు చేసేవాడుగా పేరు పొందేడు అతను పాపులర్ రచయిత కాదు మంచి రచనలు చేస్తాడన్న పేరున్న రచయిత

యీలోగా అతని మిత్రబృందంలో వాళ్ళు గొప్ప వుద్యోగులయ్యారు వ్యసనాలు అధికారాలతో, హోదాలతో పెరిగేయి

దాగుడుమూతలు

ఎంతో గొప్పవాడు కావాల్సిన తన కొడుకు తన నడుం విరగటం వల్ల సాధారణ వుద్యోగి అయ్యాడని వెంకటస్వామి ఎప్పుడూ విచారిస్తుంటాడు కొడుకు ఏదో విధంగా గొప్పవాడు కావాలని అతని ఆరాటం

వెంకటస్వామికి నీడలాంటిది అతని భార్య మహాలక్ష్మి మనిషి మంచితనపు మూట కానీ వెంకటస్వామి ఎలాంటి పని చెప్పినా చేస్తుంది

గోపీచంద్ చెల్లెలు రమాదేవి ఇంటర్ రెండో సంవత్సరంలోకి వచ్చింది తమ్ముడు కృష్ణమూర్తి యస్సెల్సీ చదువుతున్నాడు ఇద్దరూ అన్న అనుయాయులే అయితే రమాదేవి బడబడా మాట్లాడుతుంది కృష్ణమూర్తి పెదవి విప్పితే అబ్బురమే!

ఆ యింట్లో సిరిసంపదలు లేకపోవచ్చు కానీ మంచి తనం వుంది వారు పుట్టిన కులం సామాజికంగా వున్నతమైనది కావచ్చు కానీ సంస్కార పరంగా వారంతా వున్నత కులజులే ప్రేమ, సామరస్యం, ఆ యింటో అందరిని కట్టివేసే సూత్రం

కారు దిగి వాతావరణాన్ని చూచి జడుసుకొన్న సులోచన నాలుగు రోజులు ఆ యింట్లో వుండగానే ఆ వాతావరణానికి అలవాటుపడింది డబ్బు, హోదా, యివ్వలేని సుఖాన్ని తృప్తి యివ్వగలదని గ్రహించింది వారం తిరిగేసరికి ఆ కుటుంబంతో కల్సిపోయింది

ఆమె 'తప్పు కథ' కొంత తెల్సుకొన్న గోపీచంద్ తల్లిదండ్రులు కూడా ఆమెను ఆప్యాయంగా తమలో కల్పుకొన్నారు

5

ఆ రోజు మహాలక్ష్మి భర్తతోసహా చుట్టాలింటికి ఏదో వూరు వెళ్లటంతో వంట ఎవరు చెయ్యాలన్నది సమస్య అయింది

మహాలక్ష్మి వుంటే ఆమె యింటిపనంతా చేసుకుంటుంది

'ఒసేవ్ రమా కోడలుపిల్ల గొప్పింటి బిడ్డ వణ్ణం వొండటం ఆదీ సేతనవుతుందో లేదో! సేతులు కాల్సుకోనియ్యకు యీ నాలుగు రోజులు నువ్వే వణ్ణం వొండు అంట్లూ సొంట్లూ నువ్వే కడుక్కో కోడలికి ఆ పనులన్నీ సేతకావు' రాత్రి అత్తగారు కూతురుకు రహస్యంగా చెప్పటం చాటుగా వుండి వింది సులోచన

ఆమె మనసు ఆనందంతో ఆర్ద్రమయింది

కులం ఏదైతేనేం? మనసు మంచిదవుతే?

ఆమెకు నిజంగానే వంటచెయ్యటం చాతకాదు ఎపుడూ ఆమెకు వంట చెయ్యాల్సిన అవసరం పుట్టింట్లో కలగలేదు

విజయనగరం 'వెలుగు' సాహితీ సాంస్కృతిక సంస్థ ఇటీవల ఏర్పాటు చేసిన సాహితీ సమావేశంలో పాల్గొన్న శ్రీయుతులు డా సి నారాయణరెడ్డి, ఎం పేరిశాస్త్రి, ఎం సుబ్బారాయుడు, యస్ రామినాయుడుగార్లని చిత్రంలో చూడవచ్చు



కానీ అత్తవారింట్లో కూడా కలగదనుకొని వుపేక్షించటం ఎంత పొరపాటు? యిప్పుడైనా నేర్చుకోవాలి

తెల్లవారేక అందరికన్నా ముందు లేచింది సులోచన

కుంపటి రాజేయటానికి ప్రయత్నించింది ఎంతకీ అంటుకోదేం?

'వదినా యిది గేస్‌పొయ్యి కాదమ్మా నిప్పుపుల్ల వెలిగించగానే మండటానికి కుంపటి రాజేయటానికి అనుభవం కావాలి ఆ టెక్నిక్ తెల్సి వుండాలి లేలే నేను చేస్తానుగా'

వదినను బలవంతంగా లేవతీసి కుంపటి వెలిగించబోయింది రమాదేవి

'అమ్మడూ చెల్లెమ్మా నీ పరీక్షలెప్పుడు? పరీక్షలు ముంగు పెట్టుకొని కుంపటితో ప్రయోగాలు చేస్తావా? పాకశాస్త్రంలో వదినగారిని మించిన పండితురాలివి నాకు తెలీదూ? వదిననడిగి ఏమన్నా పాఠాలు చెప్పించుకో యీలోగా 'మీల్స్ రెడీ' అని కేకవేస్తా'

'ఏమిటి? భార్యను నేనుండగా మీరు వంటచేస్తారా?'

'ఏం? చాతకాకపోయినా వంటలు భార్యలే చేయాలన్న రూలుందా? మా అమ్మకు నేను పెద్దకొడుకును కొడుకునైనా కూతురునైనా అప్పటికి నేనేననుకొని నాకు చిన్నప్పుడే వంట నేర్పింది యింటి పనులు నేర్పింది భర్తనయినంత మాత్రాన నాకు చాతనయిన పనులను నేను చేసుకొనే హక్కు నాకు లేదా?'

అలా కాస్సేపు ముగ్గురూ సర్దాగా పోట్లాడుకున్నారు ఆ పోట్లాటను చూస్తూ జోక్యం కలుగచేసుకోనిది కృష్ణమూర్తి మాత్రమే

'హారేయ్ కిట్టిగా, మేం యిలా పోట్లాడుకొంటుంటే నువ్వు మాట్లాడవేమిరా? నువ్వూ పోటీకి రా—మాపైకి చిన్నవాడివి కనుక వంట నేర్చుకొనే హక్కు నీకేవుంది—ప్రథమంగా' రమాదేవి అరిచింది

నవ్వేడేకాని కృష్ణమూర్తి వులకలేదు పలకలేదు

మొత్తంమీద ముగ్గురూ వచ్చి వంట ముగించారు నలుగురూ వొకసారే భోజనానికి కూర్చున్నారు

వంటచేసిన ముగ్గురూ ఎదార్ధంగా నాలుగు కొంటూ తింటున్నారు

'ఏరా? నువ్వేం మాట్లాడవేం? కూరలూ అవీ రుచిగా వున్నాయి గదూ? అమ్మ చేసినదానికన్నా బాగున్నాయి ఏం?'

కృష్ణమూర్తి అక్కయ్య వైపు చూచాడు

'ఎవరు చేసిన వంట వారికి బాగుంటుందక్కయ్యా, రేపటి నుంచి నేనూ వంటపనిలోకి దిగుతాలే'

తమ్ముడి మర్మగర్భితమైన జవాబుకు గోపీచంద్ పగలబడి నవ్వేడు కాస్త ఆలస్యంగా అర్థం చేసుకొన్న మిగతా యిద్దరూ అతనితో శృతికలిపేరు

* * *

ఎవరి దోవన వారు వెళ్లిపోయాక సులోచన భర్త యిచ్చిపోయిన పుస్తకాలను చూచింది ఆమె ఎన్నాళ్ళగానో అడుగుతుంటే యివాళ తన రచనల్ని యిచ్చాడతను ఆమె అంతకు ముందు అతని రచనల్ని కొన్నింటిని చదివింది అయితే ఆమె అభిమానుల లిస్టులో అతను లేడు అందరూ పాపులర్ రచయిత్రులూ రచయితలే

'ఇంద్రియాల్ని వుత్తేజపరిచే రచనల్ని చేయటం నాకు చేతకాదు లోచనా ఆదర్శాల సంపుటులని అందుకే నా రచనల్ని కొందరు కొట్టి పారేస్తుంటారు కొంచెం కష్టమే అయినా రచయితగా నన్ను అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తావు కదూ?' తన రచనలను యిస్తూ భర్త చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చిందామెకు

నవలలు కథలు నాటకాలు వ్యాసాలు

కవిత్వం ఎందుకు వ్రాయడో?

కొన్ని రచనలు పత్రికలలో మాత్రమే ప్రింటయ్యాయి మరికొన్ని

పుస్తక రూపంలో వున్నాయి ఏ పుస్తకంతో గోపీచందు లోపి రచయితను అన్వేషించటం ఆరంభించాలి ?

ఆమె చివరికో నవలను ఎన్నుకొంది తలుపులు జాగ్రత్తగా బిగించి వచ్చి ఆ నవలను చదవసాగింది మొదటి కొన్ని పేజీలు కొంచెం నెమ్మదిగానే సాగేయి ఆ తర్వాత ఆ నవలా పఠనంలో మునిగిపోయిందామె

యింతలో తలుపు తట్టిన చప్పుడయింది

ఎదురుగ్గా ఏడుస్తూ వెంకన్నబాబు !

వెంకన్నబాబుకు గోపీచంద్ వద్దనే వుండిపోవాలని వుంది అందుకే పెళ్లివాళ్లతో తిరిగి వెళ్లకుండా గ్రామంలోనే వుండిపోయాడు వెళ్లే హడావుడిలో పెళ్లివాళ్లుకాని, ఆ తర్వాత జరుగుతున్న హడావుడిలో ఆడ పెళ్లివాళ్లుకాని అతడి అస్తిత్వాన్నే గుర్తించలేదు

గోపీచంద్, సులోచనల పెళ్లి జరుగుతున్నప్పుడు గోపీచంద్ కంట్లో పడాలని ప్రయత్నించాడు లాభం లేకపోయింది తీరా అంప కాలప్పుడు నిద్రపోయాడు ఎవరో అప్పుడు గుర్తించారతడిని ఎవరి తాలూకు మనిషో ఎవరికీ తెలియదు చివరికి రఘురాం అతడిని గుర్తుపట్టేడు ఆరాతీస్తే అతను గోపీచంద్ కోసం నిలిచిపోయినట్టు తెల్సింది

కాళ్లను చుట్టుపోయిన వెంకన్నబాబును గుర్తించాడు గోపీచంద్ ! అతని బాధను, కోరికను కూడా అర్థం చేసుకొన్నాడు తనతో తీసుకెళ్లేడు

తనకి అతను బరువుకాడు కాగా అలాంటి నిర్భాగ్యుడిని నిర్భాగ్యుడిగా వదిలేయరాదు ఆత్మశక్తిని పెంచాలి తన కాళ్లమీద తాను బ్రతకగల నేర్పును ధైర్యాన్ని, విశ్వాసాన్ని యివ్వాలి ఆ పని రమేశ్‌గాని, అతని తలిదండ్రులుగాని చేయటంలేదని తెలుస్తూనేవుంది వాళ్లు అతడి లోపాన్ని ఆధారం చేసుకొని అతడినొక సేవకుడి క్రింద జమకడుతున్నారు అంత చదువుకొన్న రమేశ్‌కూడా

కాని పరబ్రహ్మమూర్తి వదులుతాడా ?

గోపీచంద్ ఆఫీసులో చేరినరోజే అతడిని వెతుక్కొంటూ వచ్చాడు

'భలే మంచిపని చేశావోయ్ నీలాంటివాళ్లు ముందుకు రాకపోతే పాపం అలాంటి ఆడవాళ్లకు పెళ్లిళ్లెలా అవుతాయి చెప్పు ?'

ఆయనమీద జాలివేసింది గోపీచంద్‌కు దోషభావనను కప్పిపుచ్చు కోటానికి ఎంత అవస్థపడుతున్నారు ? అలా ఆమెను, ఆమెను పెళ్లి చేసుకొన్నందుకు తనని హేళన చేయకపోతే ఆయన మనసు శాంతించదు పూర్‌ఫెలో

'అవునుకానీ మా వెంకన్నబాబును నీ యింటికి తీసుకెళ్లేవుట ! అదేంపని ! అక్కడ మేం మర్చిపోతే నువ్వు తీసుకురావటం మంచిపనే ననుకో కానీ కాస్త యింటికి పంపించవచ్చుగా ? యిప్పుడు ఆ చిన్న ప్రాణానికి మళ్లీ ప్రాయశ్చిత్తాలూ శుద్ధులూ ఎంత తతంగం ? సరే తప్పేదేముందిప్పుడు వాడిని మా యింటికి ఎప్పుడు పంపిస్తావు ?'

పరబ్రహ్మమూర్తి అభిప్రాయం అర్థమయింది

కానీ ఆయన కులాన్ని వెలివేస్తున్నట్లా ? తను చేసిన పనిని వెలివేస్తున్నట్లా ?

అయినా ఆయనతో ఆ విషయం మీద చర్చలు, రాద్ధాంతాలు అనవసరమా ?

'వెంకన్నబాబు మీ యింటికే రావాలనుకొంటే ఆ రోజే మీ యింటికి చేర్చేవాడినండీ కానీ అతడు మీ నుంచి తప్పించుకోవాలనే అక్కడ నిల్చిపోయాడు నాతో వుండాలని నన్ను వెతుక్కొంటూ వచ్చి అభ్యర్థించాడు అందుకని మా యింటికి తీసుకెళ్లేను '


'ఏమిటీ ? మేం వుండగా వాడు నీ దగ్గర వుండటమా ? ఏం ? నువ్వు పెళ్లి చేసుకొన్న పిల్లలాగా వాడూ చెడిపోయాడనుకొన్నావా ? లేక దిక్కులేని వాడనుకొన్నావా? అసలు వాడెవడో తెల్సా? నా మేనల్లుడయ్యా వాడి బాగోగు నాకన్నా నీకు బాగా తెల్సా ?'


'మీకూ తెలియదు— నాకూ తెలియదండీ ఎవరి బాగోలు వాళ్లు తెల్సుకొంటారు మూగవాడయినంత మాత్రాన మనిషి కాకపోడుగా ? ఆ కుర్రాడికి తాను మనిషిగా బ్రతకాలన్న కోరికగా వుంది '

'అబ్బాయ్ మా రమేశ్ స్నేహితుడివని యింతవరకూ మర్యాద యిచ్చాను కానీ నీ ధోరణి నాకేం నచ్చలేదు మా వాడికి చేసుకొందా మనుకొన్న పిల్లను మేము కాదనుకొని వదిలేసుకొన్న తర్వాత ఏవో సి ఆశలు మప్పవడి నువ్వు చేసుకొన్నావు అందుకు మా అభ్యంతరం లేదు కానీ నీ భార్య తరుపున వకాల్తా పుచ్చుకొని మమ్మల్ని సాధించడానికి వెంకన్నబాబును నీ యింటిలో పెట్టుకోటం మాత్రం మంచి మార్గం కాదు వొక్క పోలీసు రిపోర్టిస్తే నిన్ను 'దాన్ని' కూడా '

'ఆమె నా భార్య మర్యాద యిచ్చిపుచ్చుకోటం మీ బాధ్యత పెద్దవారని మర్యాద యిచ్చి యింతవరకు వూరుకొన్నాను వెంకన్నబాబు విషయంలో ఆమె ప్రసక్తి అనవసరం మరోసారి '

'పోవయ్యా నీ మర్యాద, నీ మామగారి మర్యాద ఎవరికి తెలియ నది ? ఆ సంబంధం చేసుకొన్నప్పుడే నీ మర్యాద పోయింది కాకపోతే 'దొందూ దొందే'నని నీకూ వాళ్లకూ సరిపోయింది అనవసరపు మాట లెందుక్కాని మర్యాదగా మా వెంకన్నబాబును రేపు తెల్లవారేలోగా మా యింట్లో చేర్చాలి లేకపోతే ఆ తర్వాత జరిగేదాన్ని అనుభవిస్తావ్ ?





మాతృ ప్రేమ

—మేకా సుధాకరరావు

ఎక్కడ కాలు జారి పడి ఏమగునోయని మాతృమూర్తి తా
ప్రక్కనె చేయిబట్టుకొని బాలుని నడ్పుచునున్నవేళ చే
యొక్కెడ త్రోసివైచి చెయినూపుచు నవ్వుచు పర్వువెట్టు ఆ
చిక్కని బాలులీలగని చిత్రమువోలెను నిల్చి చూచెదున్!

చీకటి తోడ లేచి దది చిల్కుచునున్న యశోదమాతకున్
వాకిట వేణువూదిన రవంబు వినంబడి వెన్న ముద్ద తా
చేకొని నోటికందియగ చేరగబోయియు కృష్ణుగానమిన్
వాకిట వెర్రియై నిలచె బాలుడు లేడని గుర్తుకొచ్చియున్

దాగుడు మూతలు

యింతవరకు నా మంచితనాన్నే చూచావు అప్పుడు నా చెడ్డతనమేమిటో కూడా చూస్తావ్ ?'

గోపీచంద్ చాలా ఆలోచించాడు

నోట మాటలేని అమాయకుడి పట్ల వాళ్ళు శ్రద్ధ వహించని మాట వాస్తవమే కావచ్చు తను అతడిని ప్రయోజకుడిని చేయాలని కోరిక పడవచ్చు కానీ అందుకు అవకాశం లేదే ?

చట్టరీత్యా వెంకన్నబాబుకు తను పరాయివాడు పరబ్రహ్మ మూర్తిగారు గార్డియన్‌గా అతను నిర్లక్ష్యం చేసినా చట్టరీత్యా నేరం కాదు అయితే తాను తనవద్దనుంచుకొని మేలు చేసినా చట్టరీత్యా నేరమే అవుతుంది చెవులు తప్ప కళ్ళులేని చట్టాన్ని నమ్మింపచేయటం ఎలా ?

ఎంత విపరీతం ?

ఆదర్శాలు చట్టం ముందు యిందుకే వోడిపోతున్నాయా ? చట్టపరిధిలో అనేక నేరాలు చేసేవారు యిందుకే దండనల్లేకుండా హాయిగా వుంటున్నారా ?

వెంకన్నబాబును అక్కడికి పోవటానికి వొప్పింపచేయటానికి అతను చాలా శ్రమ పడాల్సివచ్చింది వెంకన్నబాబుకి కావల్సింది సానుభూతి మంచితనం వో గుర్తింపు అవి అతనికి అక్కడ లభ్యం కావు

అయినా తప్పేదేముంది ?

వధ్యశిలకు పోతున్నవాడిలా వెళ్ళేడు వెంకన్నబాబు ఆ రోజు

మళ్లీ యివాళ యిప్పుడు యిక్కడ

సులోచన చదువుతున్న పుస్తకాన్ని అవతలపెట్టి లేచి ఆత్రంగా 'ఏమిటి వెంకన్నబాబూ ? ఏమయింది ? ఏడుస్తున్నావేంటి ?' అని విచారిస్తూ అతడిని రెండు చేతుల్లోకి తీసుకొంది అతను ఆమె గుండెల్లో తలపెట్టుకొని ఏడవసాగాడు

ఇంతలో తలుపుమీద చేసిన శబ్దం మెల్లగా విన్పించింది అటు చూస్తే రమేశ్ !

'యింట్లో ఎవరూ లేరా ? అంతఃపురంలో రాజకుమారిలా యీ బిల్డింగ్'లో వొంటరిగా వున్నట్లున్నారే ? నేను గుర్తున్నానా ?'

'ఆయన యింట్లో లేరు '

'అది కన్పిస్తూనే వుందికదా ? నేను అడుగుతున్నది 'ఆయన' సంగతికాదు ఈయన సంగతి నేను గుర్తున్నానా ?'

'ఎందుకుండాలి ? కలలన్నీ గుర్తుంటాయా ? దుస్స్వప్నాలు అసలు గుర్తుంచుకోముగా ?'

'అయితే నేను దుష్ట స్వప్నంలాంటివాడినా ? అలా అనుకొని వూరుకోక ఈ నీచపు పనులు దేనికిట ? ఆ మూగవెధవద్వారా మమ్మల్ని సాధిద్దామనా మీ వూహ ? వాడికి ఏ మందో మాకో పెట్టకపోతే యిలా మీ దగ్గరికి కుక్కలా పరుగెత్తుకొంటూ వస్తాడా ? ఛీఛీ యిక్కడ ఈ మురికిలో ఏముంది ? మీకే వొకపూట తిండివుంటే మరోపూట లేదు వెళ్ళమని నువ్వన్నా చెప్పకపోయావా ?'

సులోచన అభిమానం దెబ్బతిన్నది కోపాన్ని నిగ్రహించుకొంది

'అతిధిగా వచ్చారని, మా ఆయన స్నేహితులని మర్యాద యిస్తున్నాను ఆ మర్యాదను నిలుపుకోవాలంటే 'నువ్వు' కూడా మర్యాదగా మాట్లాడటం అవసరం '

'నువ్వు ! నువ్వు అంటావా నన్ను ? ఎంత ధైర్యం ?'

'ఏం ? నువ్వనలేదూ ? ధైర్యం నీ వొక్కడి సొత్తా ?'

'ఏం చూచుకొని నీకీ మిడిసిపాటు తాళికట్టినట్లవుతే నా కాళ్ల క్రింద పడివుండవల్సినదానివి '

'పశువు చేత తాళి కట్టించుకొనే దుర్గతి తప్పినందుకు నన్ను నేను అభినందించు కొంటున్నాను '

'యూ ' అతను చెయ్యెత్తేడు

'మిస్టర్ యిది నా యిల్లు నా భర్త లేనప్పుడు నువ్వు నా యింట ప్రవేశించావు నలుగురిని పిలిస్తే యిక్కడ చాకిరేవు పెడ్తారు దించు చెయ్యి— వచ్చినదోవన వెళ్ళు '

అతను చెయ్యి దించాడు తనని తాను నిగ్రహించుకొన్నాడు

హఠాత్తుగా వెళ్లి వెంకన్నబాబును పట్టుకొన్నాడు జుట్టు పట్టుకొని తలవంచి వీపుమీద దబా దబా బాదేడు

'యిదంతా నీ వల్లనేరా వెధవా లేకపోతే నాకు యీ మురికి కూపంలోకి వచ్చి చెడిపోయిన ఆడదాని చేత యిన్నిమాటలు అనిపించు కోవాల్సిన అవసరం ఏముంది ? పద వెళ్దాం '

వెంకన్నబాబు గింజుకొన్నాడు చివరికి రమేశ్ చెయ్యి కొరికి అతని పట్టు తప్పించుకొని సులోచన వద్దకు పరుగెత్తుకొంటూ వచ్చి నడుం వాటేసుకొన్నాడు గట్టిగా

రమేశ్ ముందుకు అడుగు వేయబోయాడు

'అక్కడే ఆగండి మిస్టర్ ఆ కుర్రాడు యిక్కడి నుంచి రానంటున్నాడు అతడిని బలవంతంగా తీసుకెళ్ళే హక్కులేదు మీకు అతను నా రక్షణలో వున్నాడిప్పుడు మా వారు యింట్లోలేరు ఆయన వచ్చాక మాట్లాడండి '

రమేశ్ తోకతొక్కిన త్రాచు అయ్యాడు కానీ ఏం చెయ్యటం ?

'వెళ్ళేముందు ఒక్క విషయం విని వెళ్ళండి యిక్కడ మా స్థితిని చులకనగ మాట్లాడటం మీ గొప్పకి నిదర్శనం అనుకొంటున్నట్లుంది మీరు అది మీ అల్పత్వానికి నిదర్శనం మీకు ఎలాంటి భావనలున్నాయో నాకు తెలియదు కానీ భవనాలు, ఆస్తిపాస్తులే ఆడదానికి ముఖ్యమవుతే నేను నా పుట్టింటిని వదిలి రావల్సిన అవసరం లేదు మా నాన్నగారి యిల్లు ఆ సంపద చూచారుగదా ? ఆడది ముఖ్యంగా అత్తారింట్లో వాంఛించేది— ప్రేమ, ఆదరణ, ఆప్యాయత, గౌరవమైన స్థానం యివన్నీ ఏ ఆడదానికీ యివ్వలేని మీ అశక్తతకు నేను జాలిపడుతున్నాను పాపం ? ఏ ఆడది తనగొంతు కోసుకుని మీ కాళ్లకింద పడనున్నదో ? ఆ స్త్రీకి నా సానుభూతి యింకెప్పుడూ ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకొని పిచ్చిగా మాట్లాడకండి వెళ్ళండి '

అతను గడప దాటేదాటగానే తలుపులు బిగించింది సులోచన

(ఇంకా వుంది)

ఎం ఎస్ ఆర్ – కాకినాడ

పెళ్లాం పిల్లలు వున్నతన్ని ప్రేమించానని, నా జీవితం అతని కోసం త్యాగం చేశాననే స్త్రీని ఏమనాలి?

★ పిచ్చిది అనాలి బాధ్యత తెలియదని అనాలి

ఎ ఆర్ ఆర్ – జమ్మలమడుగు

మీ రచనల ద్వారా స్త్రీ జాతి సమస్యలని ఔన్నత్యాన్ని వెలికి తెస్తున్న మీరు అంతటితో టే మీ బాధ్యత నేరవేరి నట్టుగా బావిస్తున్నారా? మీ అవగాహనకు ఆలోచనలకు కార్య రూపం కల్గిస్తే చూడాలని వుంది ఆ విదంగా స్త్రీ అభ్యున్నతికి ఎంతో సేవ చేసిన వారవుతారు విప్లవాత్మకమ్మైన ఒక కార్యక్రమానికి రూపు దిద్దమని మనవి మా ఆశ పలిస్తుందని బావించవచ్చా?

★ ఎలా చెప్పకలనుసోదరా నేను కార్యకర్తను కాను మందిని -కూడగట్టి మహిళాభ్యుదయం కేకలు వేయలేను మహిళల బానిస స్వబావం పోవాలని – తమని తాము మనుషులుగా వ్యక్తులుగా గుర్తించడం నేర్చుకోవాలనీ – చెప్పాలన్న తపన వుంది – నాకు తెలుసు నల్లరాయి మీద పేరులాగా – కరడు కట్టి పోయిన యీ తత్వం మీద యీ ఊహలు నిరుపయోగంగా జారిపోతాయని కాని ఆశ రొద పెట్టగా పెట్టగా – కాస్తేనా ఏమిటీ గోల అని ఆలోచించరా అని ఇలా ఆలోచించడం ప్రారంబించిన స్త్రీల సంఖ్య పేరుగుతోందనిపిస్తుంది అందుకే – సంతోషంగా వుంది నాకు మంత్రాలకు చింతకాయలు రాలవు – కార్యక్రమాలు – రాజకీయపు రంగు పూసుకుని – స్వార్ధ పరుల ప్రయోజనం కోసమే ఉపయోగిస్తాయని – చరిత్ర చెప్పడంలేదా?!

డి ఎస్ ఆర్ – అత్తిలి

అక్కయ్యా మీ ఆడ వాళ్లంతా మగాళ్లతో సమానంగా హక్కులు కావాలంటారు దేనికి?

★ మనుషుల్లా బ్రతుకుదామని!

ఆర్ ఎ ఎం ఆర్ – హైదరాబాదు

మీకు మోతాదు మించి పొగరుంది

ప్రశ్నావళి

కె రామలక్ష్మి

విద్యతో వినయం వస్తుంది మీలో వినయం లేదు కాబట్టి విద్య పెద్ద సున్న

★ కనిపెట్టావయ్యా కొలంబస్!

టి డి ఆర్ – మరం సిరియాపల్లి

రచయితకి కవికి బేదం ఏమిటి?

★ రచయిత రుబ్బుతాడు కవి – అల్లుతాడు? కాదా?!

పి సి హెచ్ – ఒంగోలు

దనవంతుడు దనవంతునితో స్నేహం చేస్తాడు పేదవాని స్నేహం కోరడు ఎందుకేమిటి?

★ డబ్బున్న వాడికి డబ్బు లేనివాడిని దూరంగా వుంచాలని వుంటుంది– డబ్బుడుగుతాడని!

పి యు – కాశీబుగ్గ

మీ ప్రశ్నావళి శీర్షికలో మీ జవాబులు బాగుంటాయి మీ ఫోటో ఒకటి వేయరా?

★ వేయమనే అంటున్నాను మీకు తెలియదు–యీ పేజీ చింపేస్తారు చదివేవాళ్లు అంటున్నారు ఎడిటరుగారు?

ఎస్ ఎన్ – గుడివాడ

పశు పక్ష్యాదులలో లేని కులమతాలు చెట్టు చేమలలో లేని కులమతాలు మానవులైన మనకి మాత్రం ఎందుకు? అనిరేడియోలో విని – ఆ వెంటనే – ఈ క్రింది ఉద్యోగాలకు షె కు , వె కు షె తె అభ్యర్ధులకు మాత్రమే రిజర్వు చేయబడినవి – అని వింటే ఎలా వుంటుంది ?

★ మన ప్రభుత్వం కుల మతాలు సృష్టించదు రక్షిస్తుంది అంతే

ఆర్ ఎమ్ ఆర్ అంబుసోలి

పెళ్లి కానిపిల్లలకు– అబ్బాయిలకి అమ్మాయిలకి– ఒక పెద్ద సమస్య ఏమిటి?

★ పెళ్లి!

కె యు డి – తిమ్మలాపురం


ప్రేమ పక్షులు ఏమితిని బ్రతుకుదామని వారి ఉద్దేశం? లౌమీ – లౌమీ అంటూ పాడతారు

★ కట్నం డబ్బు కరిగే దాకానే యీ ప్రేమ గోల మనం బయపడక్కరలేదు

సి ఎస్ ఆర్ – ఎతొ్తండ

మీ రిచ్చే న్యాయ విచక్షణ లేని జవాబులు చదివి కొంత మంది స్త్రీ ద్వేషు లవుతున్నారు

★ కొయ్ స్వామి – కొయ్! చదివి మారే మనుషులున్నారా?!



ప్రియత

బండి లక్ష్మీనరసింహారెడ్డి



పావని

పావని మనసు నవనీతం పావని సొగసు కమనీయం

ఆమె అనురాగవతి అపరంజి బొమ్మ

ఆమె నవ్వితే చాలు—వెన్నెలలు కురుస్తాయి, నవరతనాలొలుకుతాయి కన్నుల్లోనూ, చూపుల్లోనూ ఒక వింతయిన సోయగం

ఆమె కదిలితే చాలు కలహంస హొయలు పలికితే చాలు సెలయేటి ఝరులు

ఒక్కమాటలో చెప్పాలంటే సౌందర్యమంతా ఆమె సొత్తు ఆమె సమక్షంలో సమస్తలోకం సద్దుమణిగిపోతుంది

ఒకానొక నిండు పున్నమి వెన్నెల రోజున అదృష్టవశాత్తు ఆగ్రాలోని తాజ్‌మహలును సందర్శించడం జరిగింది అప్పుడు అనుకున్నాను — 'అతిలోక సుందరియైన కన్య సైతం, అప్పుడే పన్నీటితో జలకాలాడి పరిమళాలు వెదజల్లుతూ ఎదుట నిలిచినాసరే ఈ తాజ్‌మహలు సౌందర్యంముందు, మిలమిలలాడే ఆ సుందరి అందం తప్పక వెలవెలపోతుంద'ని

కాని కొన్నాళ్ళకు ఆనాటి నా అంచనా తారుమారయింది అదే పావని అందాన్ని చూచిన క్షణాన ఆ క్షణంలో నా కళ్ళు అపురూపంగా నందనవనాన్ని సందర్శించాయి ఏవేవో దివ్యలోకాలకు నన్ను మత్తుగా నడిపించాయి '

అంతటి అద్భుతమైన సౌందర్యం ఆమెది

ఆ అందం నా స్వంతం కాబోతున్నది రోజు

కాదు కాదు ఏనాడో ఆమె నాకు స్వంతమై, సమస్తమై సర్వం అర్పించుకున్నప్పటికీ, ఆ బంధాన్ని, ఆ అనుబంధాన్ని ఈ రోజు శోభనం రాత్రి పేరిట శాశ్వితంగా బందీని చేసుకోబోతున్నది

నిన్నటివరకూ ఆమె నాకు కేవలం ప్రియురాలు కాని నేటినుండి సహధర్మచారిణి ఇది కేవలం లోకం దృష్టిలో మాత్రమే మా ఇద్దరిదీ పూర్వం గాంధర్వ వివాహం ఆత్మసాక్షిగా మాకేనాడో పెళ్లయిపోయింది

అగరువత్తులు ఆ గదినిండా సువాసనలు వెదజల్లుతూ ఆహ్లాదకరమైన వాతావరణానికి జీవం పోస్తున్నాయి మెర్క్యురీ లైటుకాంతి-పాలవెన్నెలను తలపింపజేస్తున్నది మల్లెపువ్వుల సౌరభం మత్తెక్కిస్తున్నది గులాబీలు, సన్నజాజులు, మందారాలు తమ అందాలను చాటుకుంటున్నాయి పందిరిమంచం పూలమాలలతో నిండి హంసతూలికాతల్పాన్ని సైతం అవహేళన చేస్తున్నట్లున్నది టీపాయ్‌పై వెండి పళ్లెరంలో అందంగా సర్దబడి, నవనవలాడుతూన్న మామిడి పళ్ళు, అరటిపళ్ళు, బత్తాయిలు, ద్రాక్ష, ఆపిల్, మొదలయిన పళ్ళు సగర్వంగా తలలెత్తి తమ అదృష్టానికి మిడిసిపడుతున్నట్లున్నాయి

అదొక దివ్యమైన మధురానుభూతి దీర్ఘంగా క్షణాలు గడిచిపోతున్నా, పావని ఇంకా చెంతకు రాలేదేమిటనే ఆరాటం — నన్ను మరో లోకంలో విహరింపజేస్తున్నది

సరిగ్గా అయిదేళ్లక్రితం — ఆరునెలలపాటు, మద్రాసు మహానగరంలో పావనీ, నేనూ కలిసి తిరుగని ప్రదేశమంటూ లేనేలేదు మెరీనాబీచ్, గోల్డెన్‌బీచ్, వి జి పి గార్డెన్సు అన్నానగర్ పార్కు, టి నగర్ — పానగల్ పార్కు, మహాబలిపురంలో సముద్ర తీరాలు, మైసూరులో బృందావనం, ఇంకా చెప్పాలంటే కొడైకెనాల్, ఊటీ, మొదలయిన అందాలు చిందే ప్రదేశాలలో— ఒకరి కౌగిట్లో మరొకరం కరిగిపోతూ, రతీ మన్మధుల వలె ప్రణయ రాజ్య మేలిన వాళ్ళమే

ఆ మధురమైన సామ్రాజ్యంలో ఎన్నెన్నో ఊసులు, ఎన్నెన్నో బాసలు ఒకరిపై ఒకరికి ఎనలేని విశ్వాసం ఒకరిని విడిచి మరొకరు బ్రతికి మనలేమనే తపన అనుభూతి దివ్య సంకల్పం కృతనిశ్చయం సంతోష సాగరాలు మా ముందు హోరులెత్తేవి

మహా మహా నగరాలలోని — టూ స్టార్, త్రీ స్టార్ హోటల్లు మా పాలిట దేవేంద్ర భవనాలు కాగా, రాత్రింబవళ్లనే తేడా లేకుండానే గడిపిన రోజులను గుర్తు తెచ్చుకుంటుంటే — ఒళ్లంతా ఆనందంతో పులకరిస్తున్నది ఆ తనందపు ఘడియలను ఒక్కొక్కటి నెమరు వేసుకుంటుంటే రమణీయమైన రంగుల స్వప్నంలా, స్వర్గధామంలా అనిపిస్తున్నది

అయితే నాటికీ నేటికీ ఒక్కటే తేడా ఆనాడు నేను సర్వాంగ సుందరుడనని పలువురిచే ప్రశంసల నందుకుంటే, ఈ రోజు ప్రమాద వశాత్తు కుడిచేయిని కోల్పోయిన వికలాంగుడను!

స్వల్పకాలంలో సంపాదించిన డబ్బు లక్షలకు లక్షలు బ్యాంకుల్లో మూలుగుతూ ఉన్నా యం బి, యం డి, [మెడిసిన్] డి యం, [కార్డియాలోజి] యం ఏ, యం యస్, [కార్డియాలోజి] యఫ్ ఆర్ యస్ టి యం [లండన్] యఫ్ సి సి పి [యు యస్ ఏ] డిగ్రీలు నా పేరుకు ప్రక్కగా ఎంత అందంగా మెరుస్తూ ఉన్నా హైదరాబాదు నగరంలో ఎకరపు విస్తీర్ణపు భూభాగంలో ప్రైవేటు హాస్పిటల్‌ను స్వంతంగా నిర్మించుకొని ఉన్నా మంచి ఫీజిషియన్‌గా, హార్ట్ స్పెషలిస్టుగా — దేశం నలుమూలలా నాకు ఎనలేని కీర్తిప్రతిష్ట లున్నా అంగవైకల్యమనే అసంతృప్తి జీవితం ముందు ఏ ఐశ్వర్యమూ నాలో స్పందన కలిగించడం లేదు

లోపభూయిష్టమయిన జీవనపథం ఏదో వెలితి మరేదో నైరాశ్యం నన్నతిగా పీడిస్తున్నది

విధి యనబడే అసంకల్పిత శాసనం ముందు మనం నిమిత్త మాత్రులమేనేమో

భరించలేని బాధ తీవ్రతరమై వేధిస్తున్నది ఈ శుభ సమయంలో వేదననంతా మరచిపోవాలని నాలో ఎంతగానో తాపత్రయం ఎనలేని సంఘర్షణ ఆవేదన ఆరాటం షాంపైన్ షాంపైన్

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పావని తలుపులు తెరిచి లోనికి వచ్చింది కాదు కాదు ముత్తైదువలు పరిహాసాలాడుతూ చిలిపిగా, బలవంతంగా ఆమెను లోనికి పంపి తలుపులు మూసివేసారు గుమ్మం చెంతనే నిలచిన పావనిని చూస్తూంటే అజంతా చిత్ర సుందరి గుర్తుకు వస్తున్నది

చిలక పచ్చని పట్టుచీర, అదేరంగు బ్లౌజు, మెడలో వజ్రాలహారం, చెవులకు మెరిసిపోయే జూకాలు, చేతికి బంగారు గాజులు, తల నిండా పూదండ ఓహ్! అంతగా అలంకరింప బడిన ఆమెను చూస్తుంటే అమృత పాత్ర నదించే జగన్మోహినిలా, దివి నుండి భువికే తెంచిన దేవకన్యలా అనిపిస్తున్నది నవ్వుతూ సిరులొలుకుతూ నా ముందు ప్రత్యక్షమయి నట్టున్నది

బిడియపడుతూ గడియ వేయకుండా అక్కడే స్థాణువులా నిలిచిపోయిన ఆ సుందరిని చూస్తుంటే ప్రపంచంలోని అందాలన్నీ నా ముందు ప్రోదియై పసందుగా విందు చేసుకోవడం కోసం పొందు పరచబడినాయేమోననే భావం ఆ క్షణాన నాలో కలిగింది

లవ్ ఈజ్ బౌండ్

నీ చూపు
ధనుర్విముక్త విశిఖంలా
నా హృదయాన్ని గాయపరిచిన దరిమిలా
మధురమైన ఆ గాయాలకి మందు
నీ పొందునో, లేదా మరణమనో
అమాయక, అజ్ఞానపుఎడారిలో
ఒంటరినై ప్రేమ ఒయాసిస్సును
వెదుక్కుంటూ వొచ్చిన ఇన్నేళ్లకితెల్సింది,
ఇది వొట్టి దేహమని
కర్మసంచిత గేహమని
మట్టికి ఇది ప్రియనేస్తమని!
ఐనాగానీ ప్రియే
నీ కనురెప్పల నీడల్లో
నీ కనుపాపల ఊయెల్లో
విశ్రమించాలన్న కోరిక చావక
నడుస్తూనే వున్నాను యుగాలుగా
ఆశల సుడిగాలులకి
కళ్లలో పడిన దుమ్ముని
తుడుచుకుంటూ
త డు ము కుం టూ

— ఎమ్ దివాకర్ బాబు

"పావనీ ఇలారా" ఆర్ద్రతతో కోటి వీణల రాగంతో నా స్వరం స్వాగత వచనాలు పలికింది

క్రీగంటితో నావైపొకసారి దృష్టిని సారించి, మళ్లీ తల వంచుకుంది క్షణాలు గడిచిపోతున్నాయ్ కడకేమనుకుందో ఏమో నెమ్మదిగా తలుపులు బిగించి, అలవోకగా నడిచి నా చెంతకు వచ్చి నిలిచింది చేతిలో ఉన్న పాలగ్లాసును నా పెదిమల కందిస్తూ

"పావనీ! నీకింత బిడియం పనికిరాదు సుమా! ఆనాటి సహచర్యం అప్పుడే మరిచి పోయావా?" ఆమెను దగ్గరకు లాక్కుంటూ అక్కున చేర్చుకున్నాను

"పావనీ, ఇలాంటి రోజు మనకేమీ కొత్త గాదుగా నీ శరీరంలోని అంగాంగమూ నాకు చిరపరిచితమే పూర్వపు రోజులు గుర్తుకు వస్తున్నాయి పరుగుపరుగునా నా వద్దకు వస్తావనీ బిగి కౌగిట్లో బంధిస్తావనీ, పూర్వంలా ముద్దులతో ముంచేత్తావనీ ఈ క్షణంకోసం నేనెంతగా పరితపించానో మానసికంగా నేనెంత కృశించిపోయానో నీకు తెలుసా? కాని ఇలా బేలలా ఏమీ తెలియని ముగ్ధలా"

మరింత మౌనం తీయని స్పందన మిలమిలమెరిసే ఆ కళ్లల్లో కళ్లు కలిపితే యుగాలుసైతం క్షణాలుగా మారిపోతాయి

నా కౌగిల్లో కరిగిపోతున్న ఆమెలో చలనం ఆమె సున్నితమైన హస్తద్వయం నా మెడ చుట్టూ పూలహారంకాగా మరింత చేరువకు జరిగింది ఒకనాటి చిలిపి చేష్టలను ప్రదర్శించ కున్నా, మౌనంగానే తీయని పెదవుల నందించింది సొంతంగా మరింత గాఢంగా నన్నల్లుకు పోయింది ఆమె ఎర్రని నునులేత బుగ్గలపై అలుముకున్న సిగ్గుల మొగ్గల నొక్కొక్కటే నా పెదవులతో ముచ్చటగా అందుకోవడం నావంతయింది

చందన పరిమళమిచ్చే మరికొంత మత్తులో ఆమె అంగాంగమూ సున్నితంగా స్పృజించాను అయిదేళ్లక్రితం తొలిసారి కలయికలో చూసిన ఆమె అందం ద్విగుణీకృతమైనదేతప్ప ఏ మాత్రం తరిగిపోలేదు ఏదో పరవశం అదేదో మైకం ఎన్నేళ్ల విరహతాపమో ఎన్నాళ్ల తపఃఫలితమో

అదొక మధురానుభూతి

దివ్యానుభూతి

కౌగిట్లో గువ్వలా ఒదిగి, గట్టిగా నన్ను పొదివి పట్టుకున్న ఆమెతో "పావనీ, ఈ ప్రస్తుత జీవితంతో రాజీపడి నీవేం సుఖపడతావు పావనీ? యాక్సిడెంట్‌లో అప్పుడే ప్రాణం పోయినా బాగుణ్ను"

సున్నితమైన తన వ్రేళ్లతో పెదవులు మూస్తూ — "ఎప్పుడూ అలా అనుకోకండి మీరు బ్రతికారు నాకంతే చాలు" స్థూలంగా నాలో తిష్టవేసుకున్న విషాద

ఛాయలను దూరంగా తరిమివేయాలనే తాపత్రయంతో నన్ను మరింత హత్తుకుపోయింది

"ప్చ్! యాక్సిడెంట్ ఆ యాక్సిడెంట్‌లో విరిగిన చేయి ఆపరేషన్ నెల రోజులకు పైగా ట్రీట్‌మెంట్ ఆర్టిఫిషియల్ లింబ్" చెలరేగిన అల చెరగని కల సుదీర్ఘమైన నిట్టూర్పు!

చెంగున గెంతి, టేబిల్‌పై ఉన్న షాంపైన్ బాటిల్ తెరిచి, నిండు గ్లాసును నా పెదిమల కందించింది నా కళ్లల్లోకి గోముగా చూస్తూ విదేశాల్లో అలవడిన ఒకే ఒక్క అలవాటు — యాక్సిడెంట్ షాక్‌వల్ల రెట్టింపయింది కొంత రిలీఫ్

అవగాహన, ఆప్యాయత, పావనికి మారు పేర్లేమో మనసున మల్లెలు గుభాళించగా ఆమెకు జోహారు లర్పించాను

"ఏమండీ నావల్లనే కదండీ మీకీ ప్రమాదం జరిగింది, మీ బంగారం వంటి బ్రతుకు దుర్భరమైపోయింది నేను దురదృష్టవంతురాలిని" బరువుగా నా గుండెలపై వాలిపోయింది పారలివస్తున్న ఆమె కన్నీటిధారను చూసి విచలుడనైనాను తీయని అనురాగం వీడని అనుబంధం' చలించని అభయహస్తం మమతల ఊయల గాఢ పరిష్వంగంలో ఆమె బ్రహ్మ — తీరికగా చూడముచ్చటగా మలచిన సుందర విగ్రహం!

అయితే, పూర్వం నాకు తెలిసిన పావనికి — జన్మజన్మలకు మరుపురాని ఒక గుర్తు—ఎప్పుడూ చూడాలనిపించే గులాబీ రంగులో మెరిసిపోయే పొత్తికడుపు పొంకంగా తీర్చిదిద్దినట్లున్న నాభికి కుడివైపు పెసరుగింజ పరిమాణంలో తేనేరంగు పుట్టుమచ్చ ప్రతిసారీ ఆ చోట గిలిగింతలు పెడుతూ చేసే అల్లరికి మెలికలు తిరిగిపోతూ, నవ్వులతో కవ్వించే పావని అదొక 'చిలిపి చేష్ట' ఆరు నెలల సహవాసం

స్పందించే ఆ స్పర్శతో తరించిపోవాలనే తపనతో — నా కళ్లు వెదికాయి కాని అక్కడ ఆ మచ్చ కనిపించలేదు

జీవితంలో ఇది మరొక పెద్ద షాక్! ప్రమాదం వల్ల గాయాలతో నా మనసు సంక్షోభంలో పడిపోయినా, ఆనాటి అనుభవాలన్నీ స్మృతి పథం నుండి తప్పిపోలేదు

"పావనీ!" అన్న గర్జింపుతో 'నీవు పావనివి కాదా?' అన్న ఖచ్చితమైన అభ్యంతరాన్ని స్ఫురింపజేస్తూ బిగ్గరగా అరిచాను ఆమె కళ్లల్లోకి తీక్షణంగా చూస్తూ

హోరుగాలిలో రెపరెపలాడే చిగురుటాకులా చలించిపోయిందామె అంతలోనే నిబ్బరం ఆమెనొక నేరస్తురాలిగా ఎంచి ఏహ్యభావంతో చూస్తున్న నా చూపులను తట్టుకోలేని స్థితి ఆమెది నా కళ్లలోకి సూటిగా చూడలేక పోతున్నది

ప్రియత

పావని కాదు ఆమె ముమ్మాటికీ కాదు ముమ్మూర్తులా పావనిని పోలిన సుందరి పావని లాంటి రూపురేఖలు, హావభావాలు కలిగియుండి, నన్ను మభ్యపెట్ట చూస్తున్న చతురురాలు ఆమె ఎవరు? ఎవరామె నన్ను నిలువెత్తునా దహిస్తున్న సమస్య ఆక్షేపణ కసి కసి

ముఖానికి చేరువగా ఉన్న ఆమె చెక్కిళ్లను ఆ కసితోనే గట్టిగా పళ్లు బిగుసుకున్నాయి ఆమెలో సన్నని మూలుగు బాధననుభవిస్తూ కూడా నన్ను మరింత గాఢంగా అల్లుకుపోతూ బిగికౌగిలి బలమైన ఉచ్ఛ్వాస నిశ్వాసలు అందం అందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది మత్తు మత్తు షాంపైన్ మైకం అవ్యక్తమైన అనుభూతి నిర్వచించ లేని తమకం స్వర్గధామం .. నేను లొంగిపోయాను క్షణాలు దొరిలిపోయాయి

వేడి నిట్టూర్పులు దీర్ఘనిశ్వాస . హాహారవం

ఆమెను దూరంగా నెట్టివేస్తూ అన్నాను—

శాస్త్ర పరిశోధనలో రెండవ స్థానం!

జపాన్ 1982 ఆర్థిక సంవత్సరంలో శాస్త్రీయ పరిశోధనకు ముప్ఫైవేల కోట్ల రూపాయలు ఖర్చుచేసింది ఇందుకై మునుపెన్నడూ ఇంత డబ్బు ఖర్చుపెట్టలేదు శాస్త్రీయ పరిశోధన వ్యయం విషయంలో ప్రపంచంలో అమెరికా తరువాతి స్థానం జపానుదే ఈ మొత్తంలో ఎక్కువ ఖర్చుపెట్టింది ప్రైవేటు రంగం

శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకై జపాన్ ఖర్చుచేసిన మొత్తంలో అధికభాగం, అంటే 27 వేలకోట్లు ప్రకృతి శాస్త్రాలకు సంబంధించిన పరిశోధనలకు వెళ్లింది రోదసీ పరిశోధనల, సముద్ర, మానవ పరిసరాల పరిశోధనల వాటా గణనీయంగా పెరిగింది ఇంధన పరిశోధన వ్యయం రు 3,150 కోట్లు ఇందులో ఒక్క అణుశక్తి పరిశోధనకే రు 1,220 కోట్లు ఖర్చయింది జీవ సాంకేతిక శాస్త్రరంగంలో పరిశోధనలు ఇటీవల ముమ్మరమైనందు వల్లనేమో, జీవ సంబంధ శాస్త్ర పరిశోధనలకు పెద్ద మొత్తమే (రు 3,000 కోట్లు) వ్యయమయినట్లు తేలింది (జ వా)

"నీవేవరివో కాని—కన్యవు నీవు పావనివి కానేకాదు ఎందుకంటే ఆమె కన్య కాదు గనుక ఆరునెలల సహచర్యం మాది నీవెంతగా ఆమెని పోలి ఉన్నా అనుభవంతో తెలుస్తున్న నిజమిది అసలు నువ్వెవరు? నా పావనినేంచేశావు?" కోపంతో గద్దించాను

"నేను నిజంగా పావనినే! మీరు పొరబడుతున్నారేమో? నన్ను నమ్మండి ప్రస్తుతం మిమ్మల్ని అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యను గుర్తుంచుకోండి" రోషంతో అంటున్న ఆమె కంఠంలోని నిశ్చలత్వానికి ఆశ్చర్యపోవడం నా వంతయింది

భరించలేని బాధ మస్తిష్కంలో తీరని అలజడి అదే అదనుగా ఎంచి షాంపైన్ నింపిన గ్లాసును నాకందించింది—నన్ను లాలిస్తూ, తన కనువుగా నన్ను లోబరుచుకుంటూ

మధురమైన మధువు, సుందరమైన మగువ అందులో నవ వధువు అదొక స్వర్గలోకం

తెల్లవారింది కాదు నిద్రలేచేసరికి మధ్యాహ్నమయింది

ఆమె పావని కానేకాదని నిరూపించాలనుకున్నాను దూరంగా వెళ్లిపోవాలనీ, నా పావనిని మళ్లీ వెతుక్కోవాలనీ అనుకున్నాను కాని నా మనసులోని ఊహను పసిగట్టినట్లుగానే ఆ సాయంత్రం ఆపిల్ పండు కోస్తూ తన కుడిచేతి వేళ్లకు గాయం చేసుకుంది బలంగా లోతుగా దిగిన కత్తి గాటుకు రక్తం బాగా స్రవించింది. క్లినిక్‌కు తీసుకువెళ్లి బ్యాండేజ్ వేయించడంతో సరిపోయింది ఆమె దస్తూరీతో పావని నాకు వ్రాసిన ఉత్తరాలలోని దస్తూరీని పోల్చి చూపించాలనుకున్నా

కాని ఈ సంఘటనతో, తాత్కాలికమైన అంతరాయం ఏర్పడింది

కావాలనే కుడిచేతికి తానైతాను ఏర్పరచుకున్న గాయంగా, నేను గమనించక పోలేదు

ఆమె నా ఐశ్వర్యాన్ని వరించిందా? కేవలం ఒక సందేహం అలా అయి ఉండదు ఆమె చిన్నారి కన్నెగానే నా జీవితంలో ప్రవేశించింది అయితే పావనిలా ఎందుకు చలామణీ కావాలని కోరుకుంటున్నది? మరొక ధర్మ సందేహం లేక నా కీర్తిని చూసి దాసోహమయిందా? అలా అయి ఉండదు ఏదో చరిత్ర ఉండి తీరుతుంది దీర్ఘాలోచనలతో నా కళ్లు మూతలు పడుతున్నాయి బరువుగా

ఆ సుందరి ననుజేర వస్తున్నది— అనురాగ దేవతయై

ఒకనాడు— మామూలు పేషేంటుగా వచ్చి, విజిటింగ్ వార్డులో కూర్చున్న పావని నా కంట బడింది ఆ ఒక్క చూపులోనే నా మనసు ఆమెకు అంకితమైపోయింది లోనికి వెళ్లి కన్‌సల్టింగ్ రూంలో ఆమె రాకకోసం ఎదురు చూస్తున్నాను సరిగ్గా ఆమె నలభైనాల్గవ

పేషెంటుగా నా వద్దకు వచ్చింది అది నా లక్కీ నెంబరు

"పేరు ?"

"పావని !" వీణాతంత్రులు మ్రోగాయి

అరె పావని నా నర్సింగ్ హోం పేరు కూడా అదే పావని నర్సింగ్ హోం కోడంబాకం హై రోడ్డు మద్రాసు

"ఏం చేస్తుంటారు ?" వృత్తిరీత్యా అది నాకప్రస్తుతం

"యం యస్సీ , ఫైనలియర్!" మాటిగా నా కళ్ళల్లోకి చూస్తూ జవాబు చెప్పింది

ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి మౌనంగా పలుకరించుకున్నాయి మనసులు రెండూ ఒకటయినాయి అంతవరకూ ఏ స్త్రీ నన్నాకట్టుకోలేదు అదే విచిత్రం

మెడికల్ చెకప్ డయాగ్నస్ చేయడం మళ్ళీ మళ్ళీ రోజుల తరబడి ప్రత్యక్షం

ఆ పరిచయమే ఆరునెలల సహచర్యానికి నాంది పలికింది ఒకరిని విడిచి మరొకరు ఉండలేని నిరీక్షణం ఒకరిపై ఒకరికి ఎనలేని గౌరవం అపారమైన నమ్మకం ఆ విశ్వాసం తోనే కలియికలోని మాధుర్యం చవిచూసాం జీవితాంతం పావనియే నా జీవిత భాగస్వామి తిరుగులేని నిశ్చయం ఏక పత్నీవ్రతమే నా ఏకైక లక్ష్యం వేరెవ్వరి ప్రమేయమూ లేనిది మా జీవిత బంధం దానికితోడు డాక్టరు హోదాలో విపరీతమైన ఆర్జన స్వేచ్ఛా జీవనం

మా ఇద్దరి మధ్యా ఒక పెద్ద అఖాతంలా— అమెరికాలో యఫ్ సి సి పి డిగ్రీ చేయడం కోసం పిత్రుని ప్రోద్బలం వల్ల ఆయాచితంగా పంపిన దరఖాస్తు ఆమోదింపబడటం వీసా చేతికందడం రెండేళ్ళ ఎడబాటుకు ఇద్దరమూ సహృదయంతో అంగీకరించడం వెంట వెంట జరిగిపోయింది

ప్రియత

ఆనాటి అప్పటి ఎడబాటే — ఈ నా దుస్థితికి కారణ భూతమయింది

రెండేళ్ళలో డిగ్రీ పూర్తిచేసుకొని స్వదేశం తిరిగి వచ్చేసరికి పావని ఎక్కడా కనిపించలేదు హఠాత్తుగా, నాలుగు నెలలనుండి జవాబు రావడం ఆగిపోయేసరికి, ఏదో కీడును శంకించాను అలాగే అయింది

మద్రాసు చేరుకున్న వెంటనే 16, అజీజ్ నగర్‌లో ఉంటున్న ఆమె ఇంటికి వెళ్లితే — ఇల్లు ఖాళీచేసి వాళ్ల నాన్నతోబాటు వెళ్లిపోయారని తెలిసింది ఆమె స్వస్థలమైన నెల్లూరుకు ప్రయాణమయ్యాను —ఫలితం శూన్యమే అయింది ఇంటినీ ఉన్న ఆస్థినీ అమ్ముకున్నారనీ, ఎక్కడికి వెళ్లిపోయారో తెలియదనీ


భారంగా వెనుదిరిగివచ్చి, మళ్లీ మద్రాసు నగరమంతా ఆమెకోసం పిచ్చిగా వెదికాను వెదిగి వెదికి వేసారిపోయాను పత్రికాప్రకటనలిచ్చినా ఆశించిన ఫలితం దక్కలేదు పావని పావని నా పావని ఏమైపోయింది ?

మానసికపరమైన పెద్ద అఘాతం ఎంత మరిచిపోదామనుకున్నా, మరుపురాని పావని రూపం

స్థలం మార్పుకోసం హైదరాబాదుకు తరలిరాక తప్పలేదు అదీ మిత్రుల సలహాతోనే

నాకున్న డిగ్రీలు తలవని తలంపుగానే ప్రాక్టీసును పెంచాయి సంపాదన సంపాదన హోదా కీర్తి ప్రతిష్టలు అయినా ఏదో వెలితి అసంతృప్తి వేదన స్మృతిపథంలో పావని

ఒకరోజున — ఆకాశవాణి శ్రోతలకు — పేరు పొందిన హార్టు స్పెషలిస్టుగా నేనివ్వబోయే ప్రత్యేక ఇంటర్వ్యూ కార్యక్రమం ఉండగా, స్టుడియోలో రికార్డింగ్ పూర్తి చేసుకొని, ఫియట్ కారులో బయలుదేరాను నాంపల్లి రోడ్డు మీదుగా హాస్పిటల్‌కు తిరిగి వస్తున్నాను అల్లంత దూరంలో, రోడ్డుకు రెండవవైపు చివర హఠాత్తుగా పావని నా కంట బడింది ఆ క్షణంలో నా మనసు ఎగిరి గంతేసింది అయిదేళ్ళ దీర్ఘ నిరీక్షణ తరువాత అక్కడ పావని కనిపించడంతో ఆనందానికి అవధులు లేకపోయాయి అవును ఆమె అచ్చం పావనియే ఆటో ఎక్కబోతున్న పావని జీవితంలో మళ్ళీ ఆమె కనిపించడం దుర్లభమేమో ? ఆతృత టెన్షన్ డ్రైవ్ చేస్తున్న నేను సడెన్ బ్రేకులువేస్తూ, చేయి ముందుకు చాచి సైగ చేస్తూ "పావనీ !!" అంటూ గావుకేక వేసాను



ఆమె త్రుటిలో నావైపు చూసింది ఆమె వైపే చూస్తున్నాను అంతే స్పీడుగా వచ్చిన ఎదుటి బస్సు — రోడ్డువైపు బయటకు చాచి ఉన్న నా చేయుని ఢీకొనడం హస్తం రక్తసిక్తమైపోవడం రోడ్డంతా లీలగా పరుగులు తీస్తున్నట్లు కళ్లు బైర్లు క్రమ్మడం అంతే తెలుసు

తెగిపోయిన చేయి ఆపరేషన్ నలభై రోజులు పేషెంటుగా హాస్పిటల్ జీవితం చావలేక బ్రతుకు

పావనితోబాటు ఆమె తండ్రి ఉమ్మడిగా చేసిన సపర్యలు -- నన్ను సజీవుణ్ణి చేసాయి ఒక మనిషిగా తీర్చిదిద్దాయి

ఈనాటివరకూ ఆమె అలా పావనిగానే చెలామణి అవుతూ, నాతో విపరీతమైన సాన్నిహిత్యాన్ని కోరి, కడకు నా జీవితంలో భాగస్వామిగా ప్రవేశించిన ఆమె పట్ల ఎందుకో కొంత అభిమానం ముంచుకొస్తున్నది నా ప్రేమ కోసం పరితపిస్తున్న ఆమె పవిత్రత నన్నమితంగా ఆకర్షిస్తున్నది ఎంతటి చతురురాలు

అయినా నా పావని కోసం ఎడతెగని ఆలోచన ఈ చిక్కు సమస్య విడివడనిది

ఆ రోజు ఆమె — తన అప్తురాలైన సుజాతతో కలిసి షాపింగుకని కారులో బయలుదేరింది అదే మంచి అదను ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో -- ముందుగానే ఆమెకు తెలియకుండా వ్యానిటీ బ్యాగ్‌లో నుంచి 'కీబంచ్'ను సంగ్రహించడం జరిగింది అది తప్పు పని, కాని తప్పని పరిస్థితి

గాడ్రెజ్ బీరువా తెరిచాను ఊహు ఫలితం కనిపించలేదు అలా వెదుకుతూనే సేఫ్టీ లాకర్ కూడా తెరవడంతో నా కళ్లు మెరిసాయి

ఆమె ఎవరో తెలిసిపోయింది స్కూల్ ఫైనల్, ఇంటర్, డిగ్రీ మొదలయిన సర్టిఫికేట్లున్న ఫైలు ఆమె పేరు రాగిణి

ఆ ఫైలుకు ప్రక్కగానే ఉన్న ఆల్బంను చూస్తున్నప్పుడు ఒకచోట నా కళ్లు నిలిచి

పోయూయి పావనిని పోలిన రాగిణి రాగిణిని పోలిన పావని

ఇద్దరిదీ ఒకే పోలిక వయసు తేడాతో ఇద్దరూ ఒకే చోట ఒకరి ప్రక్కన మరొకరు

అదొక మిస్టరీ నాలో ఏదో కలవరం తూలి పడబోయాను అంతలోనే నిబ్బరం మనో నిబ్బరం

పట్టువిడువని విక్రమార్కుడిలా ఇంకా వెదుకుతున్నాను అరలోపలి భాగంలో ఒక మూల వెండి భరిణలో ఆభరణాలు అటు ప్రక్కనే ఒక డైరీ

వారం రోజుల క్రితం వరకే వ్రాయబడి ఉన్న డైరీఅది—

తేది 18–9–1983

" నా కోసం ప్రమాదానికి గురియైన డాక్టరుగారిని చూస్తూ ఉంటే నాకు విపరీతమైన జాలి ప్రేమ నేనే పావని ననుకొని పాపం చేయి పోగొట్టుకున్నారు ఆ పాపం నాదే కదా వారి బంగారం వంటి భవిష్యత్తు నా వల్లనే కదా దోపిడీకి గురి అయింది హాస్పిటల్లో చేర్చాక పావనీ పావనీ అంటూ వందలసార్లు పలువరిస్తూంటే— వారి గాఢమైన ప్రేమను తలచి, నా మనసు కరిగి నీరైపోయింది

అందుకే అప్పుడే నిర్ణయించుకున్నాను పావనిలా చలామణీ కావాలనీ అక్కయ్యలా నటించాలనీ జీవితాంతం వారికి చేదోడుగా నిలిచి, అసంతృప్తికి తావులేకుండా— వసంతగానం చేయాలనుకున్నాను కాని ఈ రోజు నా ఆశలన్నీ వమ్మయిపోయాయి నేను పావనిని కాదని గుర్తించారు అదే నా దౌర్భాగ్యం ...

అయినా నాలో అదే నిశ్చయం ఎలాగైనా పావనిని మరిపించాలనీ వారి జీవితం నందనవనం కావాలనీ ఆ బలమైన కోరికతోనే రాగిణిగా నా జీవితం చాలించాను — పావనిలా రాణించాలని నేను పావనిగానే వారి హృదయంలో కలకాలం నిలిచిపోవాలని ఆరాటం

పిల్లలు లేని కారణంగా చిన్నాన్న పెంపకంలో, నేను అక్కయ్యకు చాలా దూరంగా ఉండడం కారణాన నేనెవరో వారికి తెలియదు పావని చెల్లెలుగా నన్ను గుర్తించలేకపోయారు లేకపోతే రాగిణిగా, ముద్దుల మరదలుగానే నన్నభిమానించే వారు పావనిగా అపోహకు తావు లేకుండా ఉండేది 'ఆంజీనా'తో ప్రారంభమైన జబ్బు — 'హార్టెటాక్'తో అక్కయ్య జీవితాన్ని కాటువేసి ఉండకపోతే "

ముందుకు సాగలేదు నా చూపులు ఇక చదువలేకపోయాను

"పావనీ" భోరున ఏడుస్తూ కుప్పలా కూలిపోయాను

కళ్లు తెరచేసరికి బెడ్‌పై నేను ఎదురుగా నా అసిస్టెంట్ శ్రీధర్ సమయానికి వచ్చినట్లున్నాడు అప్పుడే ఇంజక్షన్ చేసాడు కాబోలు

"హౌ ఆర్‌యూ డాక్టర్!" నా కళ్లల్లోకి చూస్తూ చిన్న అభ్యర్థన


"యామ్ ఆల్‌రైట్ " నా చూపుల్లో దీనావస్థ, దీర్ఘమైన నిట్టూర్పు

"బీ బ్రేవ్ డాక్టర్ !" నెమ్మదిగా భుజం తట్టూ, బీరువాలో అన్నీ సర్దానని చెప్పి నా చేతికి తాళాలందించాడు కృతజ్ఞతలు తెలియజేసాను

అంతలోనే బయట కారు శబ్దం వినిపించింది

"పావని గారొస్తున్నారు !" చిరునవ్వులు చిందిస్తూ, నా గది నుండి నిష్క్రమించాడు

దరహాసం మేళవించిన పలుకరింపుతో — ఆప్యాయంగా నా కళ్లలోకి చూస్తూ లోనికి ప్రవేశిస్తున్న రాగిణి కాదు పావనిపై నా చూపులు నిలిచిపోయాయి ★



సిక్స్త్ సెన్స్‌తో హంతకుల ఆచూకీ తెలిపే సిద్ధహస్తురాలు డరోతీ ఆలిసన్



సాధారణంగా అతీంద్రియ శక్తులు ప్రదర్శించే వారిలో టెలిపతీ తెలిసినవారు ఎదుటివారి మనసులో ఏముందో చెప్పడం క్లయర్ వాయన్స్ తెలిసినవారు ఒక ప్రదేశంలో ఉండి మరోచోట ఏం జరుగుతుందో చెప్పటం సైకోకైనసిస్ తెలిసినవారు కళ్ళతో చూసి వస్తువులలో చలనం కలిగించడమే చేస్తుంటారు కానీ టెలిపతీ తెలిసినవారు క్లయర్ వాయన్స్ ప్రదర్శించడం క్లయర్ వాయన్స్ శక్తి గలవారు మరో శక్తిని ప్రదర్శించడం చాలా అరుదు అమెరికాకు చెందిన మధ్య తరగతి కుటుంబ మహిళ డరోతి ఆలిసన్ క్లయర్ వాయన్స్ శక్తిని అనన్య సామాన్యంగా ప్రదర్శిస్తూ సైకోమెట్రీ శక్తిని కూడా అత్యద్భుతంగా ప్రదర్శించి శాస్త్రజ్ఞులను దిగ్భ్రమ పరిచింది

సైకోమెట్రీ శక్తి గల వారు తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ తెలపడంలోనూ పోయిన వస్తువుల ఆచూకి తెలపడంలోనూ సిద్ధహస్తులై ఉంటారు తప్పిపోయిన వ్యక్తికి సంబంధించిన వస్తువు నేదైనా తీసుకుని దానిని ఏకాగ్రతతో పరీక్షించి ఆ వ్యక్తి ఎక్కడ ఉన్నాడో ఏం చేస్తున్నాడో తెలుపగలరు అంతేకాకుండా ఏ వ్యకి ఏం చేస్తున్నాడో తెలుసుకోవాలని ఉన్నా అతనికి సంబంధించిన వస్తువును పట్టుకుని చూసి అతని వివరాలు తెలుపగలరు

అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రానికి చెందిన మిసెస్ డరోతికి ఈ అతీంద్రియ శక్తి అతి విచిత్రంగా సంక్రమించింది అంతకుముందు ఇటువంటి శక్తుల గురించి ఆమె టెలివిజన్లో చూసినా పేపర్లో చదివినా వాటిపై ఒక ఖచ్చితమైన అభిప్రాయానికి రాలేక పోయింది ఆమెకు అతీంద్రియ శక్తులపై నమ్మకంకన్నా అనుమానాలే ఎక్కువగా ఉండేవి తన స్నేహితురాళ్ళతో అతీంద్రియ శక్తులు వట్టి బూటకం అని కూడా వాదించేది ఎవరైనా టెలిపతీ ప్రదర్శించి ఎదుటివారి మనసులోని మాట చెప్పినప్పుడు అదంతా నాటకమనీ వారిద్దరూ ముందు అనుకుని పథకం ప్రకారం చేస్తున్నారనీ ఎవరైనా క్లయర్ వాయన్స్ శక్తి ద్వారా మరో ప్రదేశంలో జరుగుతున్నది చెప్పినప్పుడు అది యాదృచ్ఛికంగా జరిగిందని కొట్టిపడేసి ఈ శక్తుల పేరుతో కొందరు వ్యక్తులు మోసం చేస్తున్నారని ప్రకటిస్తూ ఉండేది ఒకసారి ఒక వ్యక్తి కళ్ళతో చూసి తాళం చెవులను మేకులను సైకోకైనసిస్ శక్తి ద్వారా వంచుతున్నాడని ఒక స్నేహితురాలు చెప్పినప్పుడు ఆమె అది అంగీకరించక బహుశః అతను మెజీషియను అయి ఉంటాడు ఉన్న వస్తువును ఉన్నట్లుగా వాళ్ళు మనకు భ్రమ కలిగిస్తుంటారు అలాగే అతను తన హస్తలాఘవ నైపుణ్యంతో తాళాలను మాయ చేస్తున్నాడు అని తన అనుమానాన్ని వ్యక్తపరిచింది

అతీంద్రియ శక్తులపై అంతగా నమ్మకంలేని డరోతికి 1967 డిసెంబరు మూడవ తారీఖు తెల్లవారు జామున ఒక విచిత్రమైన కల వచ్చింది ఆ కలలో మైకేల్ అనే ఐదు సంవత్సరాల బాలుడు నదిలో కొట్టుకునిపోతూ ఒక పెద్ద పైపులో ఇరుక్కున్నట్లుగా చూసింది ఆ కల చూడగానే ఆమె వెంటనే ఉలిక్కిపడి లేచి కూర్చుంది మళ్ళీ నిద్ర పట్టలేదు కళ్ళు మూసుకుంటే ఆ బాలుడే కనపడుతున్నాడు ఈ విషయం ఇంట్లో వాళ్ళకు చెప్తే ఏదో పీడ కల మర్చిపో అని సలహా ఇచ్చారు కానీ ఆమె మర్చిపోలేకపోయింది ఒకవారం తరువాత ఉండబట్టలేక తనకు తెలిసిన ఒక పోలీసు ఆఫీసరుకి ఈ విషయం చెప్పింది అది విని ఉలిక్కిపడిన ఆ ఆఫీసరు తమకు ఆ బాలుడి తల్లి దండ్రులనుంచి రిపోర్టు అందిందనీ ఇంతవరకు ఆ బాలుడి ఆచూకీ దొరకలేదనీ ఇంకా వివరాలు ఇవ్వమని ప్రాధేయపడ్డాడు

ఆ సమయంలో ఆమె అంతకన్నా ఎక్కువ చెప్పలేకపోయింది డాక్టర్ రిచర్ట్ అనే సైకియాట్రిస్ట్ ఆమెను హిప్నటైజ్ చేసి ఆమె నుంచి మరికొంత సమాచారం రాబట్టగలిగాడు ఆ బాలుడి కుడి కాలు బూటు ఎడమ కాలికి ఎడమది కుడి కాలుకి తొడుక్కున్నాడనీ అతను తొడుక్కున్న బట్టల రంగులూ వగైరాలు చెప్పింది తరువాత పోలీసులు గజ ఈతగాళ్ళను పంపి చివరకు ఆ బాలుడి మృత దేహాన్ని కనుగొన్నారు డరోతి చెప్పినట్లుగా బూట్లు ఒక కాలిది మరో కాలికి తొడగటం బట్టల రంగులు అన్నీ కరెక్టుగా ఉన్నాయి అప్పటినుంచి డరోతికి అతీంద్రియ శక్తులపై విశ్వాసం ఏర్పడింది ఆనాటినుంచీ డరోతి తనకు అసంకల్పితంగా సంక్రమించిన అతీంద్రియ శక్తిని సద్వినియోగ పరుచుకోవాలనే సదుద్దేశంతో న్యూజెర్సీ పోలీసు వారిని కలిసి తప్పించుకుని దొరక్కుండా పోతున్న దొంగల ఆచూకీ తెలిపి పత్రికల వారిని పోలీస్ వారిని ఆశ్చర్య పరిచింది అదే ప్రకారంగా తప్పిపోయిన పిల్లల పైనం కూడా వారికి సంబంధించిన ఒక వస్తువును పట్టుకుని తదేకంగా దీక్షగా చూసి చెప్పగలిగేది ఒకసారి కొంతమంది పత్రికా ప్రతినిధులు ఆమెను తప్పిపోయిన వ్యక్తుల ఆచూకీ వారి వస్తువు చూసి ఎలా చెప్పగలుగుతున్నావ ని అడిగినపుడు ఆమె వారితో వారికి సంబంధించిన వస్తువుని ఏకాగ్రతతో పరిశీలిస్తే అందులో వారు ఎక్కడ ఉన్నారో ఏం చేస్తున్నారో లీలగా కనబడుతుంది ఒక్క విషయం ఇక్కడ చాలా ముఖ్యం తప్పిపోయినవారు మనకు తప్పకుండా కనపడుతారు అనే విశ్వాసం ముందు మనలో ఉండాలి ఆ విశ్వాసం ఉంటే సిక్స్త్ సెన్స్ ద్వారా అది అతి సునాయాసంగా తెలుపవచ్చు అని చెప్పింది

అద్భుత వ్యక్తులు


బి.వి. పట్టాభిరామ్

మెజీషియన్—హిప్నాటిస్ట్

అమెరికాలోని పీపుల్ అనే ఒక పత్రిక డరోతిని క్షుణ్ణంగా పరీక్షించి పరిశోధనలు చేయించి ఒక చక్కని వ్యాసం ప్రచురించారు అందులో డరోతికి సైకోమెట్రీ క్లయర్ వాయన్స్ శక్తులు పుష్కలంగా ఉన్నాయి ఆమె పది సంవత్సరాల కాలంలో ఎన్నో అద్భుత కార్యాలు చేసింది చిన్నతనంలో తప్పిపోయి తల్లి దండ్రులు ఆశలు వదులుకున్న 26 మంది వ్యక్తుల ఆచూకీలు తెలిపి వారికి అపారమైన ఆనందాన్ని కలుగచేసింది పోలీసు వారికి కూడా ఎన్నో కేసులలో సహాయం చేసింది ముఖ్యంగా ఆరు హత్యా కేసులలో హంతకులను పట్టుకోటానికి ఆమె అతీంద్రియ శక్తి ఎంతగానో ఉపయోగ పడింది ఇది పోలీసులు రికార్డు చేసిన ఉదంతం అని ప్రచురించింది

డరోతికి కేవలం క్లయర్ వాయన్స్ సైకోమెట్రీల శక్తులు కలిగి ఉండడమే కాక భవిష్యత్తును కూడా చెప్పగలిగే శక్తి కూడా ఉండేది తన స్నేహితులకు రాబోయే ప్రమాదాల గురించి ముందే హెచ్చరించేది డరోతిని ఎందరో లబ్ధ ప్రతిష్టులైన శాస్త్రజ్ఞులు పరీక్షించారు ఆమె చేసే కార్యాలలో ఎటువంటి మోసము లేదని నిర్ధారించారు డరోతి కూడా తన శక్తిని మానవ కళ్యాణానికే వినియోగిస్తాననీ,

(66వ పేజీ చూడండి)


విజంస్
Vijay
a friend of your family
Jaisons/AMA/62/84 TEL
అసోసియేటెడ్ మార్కెటింగ్ ఏజెన్సీస్
4-4-340/బి, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాదు-500 001

సీరియల్

శ్రావణి



మాదుగుల కృష్ణకుమారి

(గత సంచిక తరువాయి)

14

"వాట్ ప్రమీ! పక్క వూరిలో మీటింగ్ వుందని వెళ్ళి ఎవర్నో వెంటపెట్టుకుని వచ్చావేమిటే? విషయం ఏమిటసలు?" అన్నాడు కైలాష్ భార్యతో

తను మీటింగ్ పూర్తి చేసుకుని వస్తుంటే జరిగిందంతా చెప్పింది ప్రమీల

"ఒక నిండు ప్రాణాన్ని సాటి మనిషిగా రక్షించావు అంతవరకూ బాగానే వుంది కానీ ఇప్పుడేం చేద్దామని?" అన్నాడు

"మీ కన్నిటికీ ఆత్రుతేనండీ! అసలు విషయం ఏమిటో ఆమె ద్వారా తెల్సుకోవాలి తర్వాత ఏం చెయ్యాలన్నదే సస్పెన్సు" అంది నవ్వుతూ

"మొత్తానికి రచయిత్రి బుద్ధి పోనిచ్చుకున్నావుకాదు ఇక్కడ కూడా సస్పెన్స్ ఏనా? ముగింపు చెప్పు డార్లింగ్" అన్నాడు ముద్దుగా

"హుష్! మెల్లిగా మాట్లాడండి పక్క గదిలో ఆ అమ్మాయి పడుకుంది కాస్త మంచిగా వుండటం నేర్చుకోండి ముగింపు తెల్సిన ఫ్లాట్ ముందే టేస్టు చూసిన ఐటమ్‌లా, రుచిగా వుండదు వెయిట్ ఎండ్‌సీ" అంది

"అంతేనంటావా?" అన్నాడు

"అంతే" అంది ప్రమీల

"రచనల్లోనే కాకుండా, వాస్తవంలోకూడా స్త్రీ జనోద్ధరణ చేస్తానంటే తప్పేతుందా? కానీ" అన్నాడు నవ్వుతూ

"మగవాళ్ళ దౌర్జన్యానికి బలయిపోయే మా సాటి సోదరీమణులకు మేము చేయూత నివ్వటం తప్పంటారా?" అంది ఆవేశంగా ప్రమీల

"అలా ఎందుకంటాను అయినా నిన్ను రెచ్చగొడితే నీకు మూడ్ వస్తుంది మూడ్‌వస్తే కాగితాలు ముందేసుకుని కూర్చున్నా కూర్చుంటావు తప్పయిపోయింది" అని చెంపలు వేసుకుంటున్న అతనివైపు ప్రేమగా చూసింది ప్రమీల

15

"కొత్త చోటు బాగా నిద్రపట్టిందా?" అని చిరునవ్వుతో ప్రమీల అడుగుతుంటే సిగ్గుగా తల వూపింది శ్రావణి

శ్రావణి అందంగానే వుంది మనిషిలాగే మనసు కూడా మంచిదని అనుకుంటే, రాత్రి చీకట్లో సరిగ్గా చూడనేలేదు తనకంటే ఏ రెండు మూడు సంవత్సరాలో చిన్నదిగా వుంది కానీ ఇంత చిన్న వయసులోనే విరాగిలా విరక్తి చెంది ఆ ఘోరానికి తలబడింది ముఖం చూస్తే అమాయకత కొట్టొచ్చినట్లుగా కన్పడుతోంది అనుకుంది శ్రావణిని పరీక్షగా చూస్తూ ప్రమీల

అలా తనవంకే చూస్తున్న ప్రమీలనుంచి చూపులు తప్పించుకుందుకు ప్రయత్నం చేసింది

ముఖం కడుక్కుని రమ్మని శ్రావణివచ్చాక వేడివేడి కాఫీ ఆమెకో కప్పిచ్చి, తను కూడా తీసుకుంది

ఏదో ఆలోచిస్తూ వుండిపోయింది శ్రావణి

"ఏమిటా ఆలోచన? కాఫీ చల్లారి పోతోంద"ని హెచ్చరించింది ప్రమీల

"మీకు నేను ఏమవుతానని ఇలా తీసుకు వచ్చారు నిజంగా మిమ్మల్ని"— అంది నీళ్ళు నిండిన కళ్ళతో అభిమానంగా చూస్తూ

"తర్వాత తీరికగా ఆ సంగతి చెప్పుకుందాం, ముందు కాఫీ త్రాగి స్నానం చేసిరా అప్పుడు తీరికగా మాట్లాడుకుందాం ఆ, మరొకమాట ఇక నుంచీ, నువ్వు నన్ను అక్కా అని పిలు అలా పిలిస్తే బాధ చెప్పుకునేందుకు వీలుగా వుంటుంది లేకపోతే మన మధ్య దూరం అలాగే వుండి పోతుంది" అంది నవ్వు ముఖంతో

ఒక్కొక్కపుడు అభిమానం ఎక్కువయినా భరించలేరు ఇప్పుడు శ్రావణి పరిస్థితి అలాగే వుంది

> **జరిగిన కథ—3** బిడ్డలులేని శ్రీహరి, శ్రావణి దంపతులు డాక్టరు దగ్గరకు వెళుతారు శ్రావణిని పరీక్షచేసి ఆమెకు పెళ్ళికి ముందే బిడ్డలు పుట్టకుండా ఆపరేషన్ జరిగినట్లు చెపుతుంది డాక్టర్ శ్రీహరి శ్రావణిని పుట్టింటికి పంపించేస్తాడు రైల్లో కూర్చొన్న శ్రావణి జరిగిపోయిన తమ తీయని దాంపత్య జీవితం గురించి తలపోయసాగింది శ్రావణి తల్లి తండ్రులను చేరుతుంది కానీ జరిగిన దాంట్లో తల్లి తండ్రులకు భాగం ఉందని తెలుసుకొని ఇల్లు విడిచి వెళ్ళిపోతుంది ప్రాణం తీసుకో బోతున్న శ్రావణిని రక్షించిన స్త్రీ ఆమెను తన ఇంటికి తీసుకెళ్ళి ఆశ్రయం ఇస్తుంది

మనసు నిర్మలంగా వుండటం కోసం ఫ్రెష్‌గా స్నానం చేసి వచ్చింది

హడావిడిగా ఒక మూడు సంవత్సరాల అబ్బాయితో శ్రావణి గదిలోకి వచ్చిన ప్రమీల "వీడు మా వంశోద్ధారకుడు పేరు జీవన్ అని, బాబూ అంటారా" అంది

బొద్దుగా వున్న వాడివంక ముద్దుగా చూసింది శ్రావణి

"ఒక్క క్షణం ఆగు అయ్యన్ని, బాబుని పంపించి వస్తాను" అంది వెళ్ళిపోతూ

మరొక పదినిముషాలకు గదిలోకి వస్తూ "ఇప్పుడు నాకింక అంతా తీరికే" అంది నవ్వుతూ

ఎప్పుడూ నవ్వుతూ వుండే ప్రమీల ముఖం ఎంతసేపయినా చూస్తూ వుండాలన్పిస్తుంది శ్రావణికి

"బాబేడి?" అంది

"వాడు కాన్వెంటుకి ఆయన ఆఫీసుకి వెళ్ళారు ఉ! ఇప్పుడు చెప్పు నీ గురించి?" అంది ఆసక్తిగా చూస్తూ ప్రమీల

"మా ఆయన నన్ను పుట్టింటికి పంపించేశారు" అంది చిన్నపోయిన ముఖంతో

"ఏం! ఆయన మంచివాడు కాదా?" అంది

"మంచివారే నన్ను పువ్వులలో పెట్టి పూజించేవారు" అంది శ్రావణి

"మరి! పువ్వులలో పెట్టి పూజించేవాడు పుట్టింటికి ఎందుకు పంపాడు?" అంది

సమాధానం చెప్పకుండా ఏడవటం మొదలు పెట్టింది శ్రావణి

'వద్దులే ఏడవకు నీ మనసింకా కుదుట పడ్డట్టుగాలేదు ఇప్పుడేం చెప్పద్దు, నా గురించి చెపుతాను విను" అంది

కళ్ళనీళ్ళు తుడుచుకుని ముఖం పైకి ఎత్తింది

"నువ్వు పుస్తకాలు చదువుతావా?" అని అడిగింది శ్రావణిని

"చదువుతాను" అంది చిన్నగా శ్రావణి

"అయితే ప్రమీలా కైలాష్ అన్న పేరు ఏ పుస్తకంలో అయినా చూశావా?"

"నరకం మరెక్కడోలేదు" అన్న కథ మీరు రాసిందేనా" అంది ఆశ్చర్యంగా చూస్తూ

"అవును" అంది చిరునవ్వుతో ప్రమీల

"ఆ కథ నాకు చాలా నచ్చింది" అంది శ్రావణి

ఏవేవో సంగతులు చెపుతూనే "పెళ్ళికాక ముందునుంచే నీకు ఈ పుస్తకాలు చదివే అలవాటుందా?" అంది

"లేదు మాది ఒకరకంగా చెప్పాలంటే పల్లెటూరు రైల్వేస్టేషను వుంది బస్సులు వున్నాయి కానీ అంతగా అభివృద్ధి చెందలేదు పేరుకి హైస్కూలు మాత్రం వుంది అందులోనే నేను కొంతవరకూ చదివాను పుస్తకాలు చదవాలని కోరిక వున్నా మా ఇంట్లో తెచ్చేవారు

కాదు అసలు రేడియోకూడా లేదు మా ఇంట్లో మా అత్తగారింట్లో మాత్రం అన్నీ వున్నాయి అందుకే నాకు పట్నం సంబంధం చేసుకోవాలని కోరికగా వుండేది'' అని అనాలోచితంగా అనేసి నాలుక కొరుక్కుంది

''అయితే నీ కోరిక ప్రకారం పట్నం సంబంధమే కుదిరిందన్నమాట''అంది నవ్వుతూ

''అవును'' అంది శ్రావణి

మళ్లీ ఏవో మాట్లాడుతూ, మాటల మధ్య శ్రావణి పుట్టింటి వారి స్థితి అంతతం మాత్రమే అయితే అక్క భర్త పూనుకుని తన పెళ్లి జరిపించాడని ఆమె మాటల ద్వారా తెలుసుకుంది ప్రమీల

శ్రావణి గురించి తెల్సుకోవాలంటే తను తొందరపడకూడదని కనీసం ఒక వారమయినా ఓపికపట్టి వుండాలని అనుకుంది ప్రమీల

మామూలు మాటలు తప్ప శ్రావణిని గురించి ఏమీ అడగలేదు

16

''ఏమిటి మామయ్యా అర్జంటుగా కబురు పంపించారు ?'' అన్నాడు శేషు

''అల్లుడూ మళ్ళీ కథ మొదటికి వచ్చింది శ్రావణిని వాళ్ళు పంపించివేశారు పైగా ఆపరేషన్‌కూడా జరిగిందని అన్నారుట'' అన్నాడాయన సిగ్గుగా

''ఈ కొంపకేదో దరిద్రం పట్టిందయ్యా ఏదో అప్పుడు చిన్నతనం అలా జరిగింది బుద్ధి తెచ్చుకుని దానంతట అదే వచ్చింది నువ్వు పూనుకున్నావు పెళ్ళి జరిపించావు నీ ధర్మమా అని అది గొప్పింటికి కోడలే అయ్యింది సవ్యంగా కాపురం చేసుకుంటోంది కదా అని సంతోషించి నన్నిరోజులు పట్టలేదు మళ్ళీ ఇప్పుడిట్లా అయింది'' అంది శాంతమ్మ

''ఏది ? శ్రావణి ఎక్కడుంది'' అన్నాడు శేషు

''ఏం చెప్పమంటావు రాగానే మామీద గొడవ చేసింది మమ్మల్ని అడిగితే మేమేం చెపుతాము మాకేం తెల్సు రాత్రి పడుకుంది తెల్లవారి చూస్తే లేదు ఈ ఉత్తరం మాత్రం ఉంది'' అని తెచ్చి శేషు చేతికిచ్చింది

''అరే ! ఎంత ఘోరం జరిగింది స్వయంగా రాసిపెట్టిందంటే ఇక వెదికే పనికూడా లేదు మనకి'' అన్నాడు శేషు నిర్లిప్తంగా

''పోనీ వెళ్ళి వాళ్ళాయన్ని అడిగితే?'' అంది శాంతమ్మ

''మన బంగారం మంచిదయితే కంసాలిని అడిగి ఏం ప్రయోజనం అన్నట్లుగా నీ కుతూరి వల్ల ఏ లోటూ లేకపోతే వెళ్ళి అడగవచ్చు నా కడుపున చెడపుట్టిందసలు పెళ్ళి కుదిరాక కూడా ఎవరేం చెపుతారో అని హడలి చచ్చాను ఆ గండం గట్టెక్కి ఒకింటిది అయింది కానీ ఆ ఆనందం మాకు దక్కనిస్తేనా? ఇప్పుడీ అపవాదుతో తిరిగివచ్చింది మళ్ళీ పౌరుషానికేం తక్కువలేదు ఇప్పుడేమో చస్తున్నానని ఈ ఉత్తరం అసలు నాకు ఒక్కత్తే పుట్టిందను కుంటాను ఇంకోత్తి పుట్టగానే చచ్చిందను కుంటాను'' అని కోపంగా రంకెలు వేశాడు లక్ష్మయ్య

''తొందర పడకండి మామయ్యా'' అని వారించాడు శేషు

''ఇక నే పడే తొందరేముందయ్యా దాని సమస్యకి అదే శాశ్వతంగా పరిష్కారం వెతుక్కుంది'' అన్నాడు

''అసలే పిల్లపోయి నేను ఏడుస్తుంటే మీ గోలేమిటి'' అంది దిగులుగా శాంతమ్మ

''ఉన్నమాటంటే సాధింపుగానే వుంటుంది



శ్రావణి

మళ్ళీ ఇల్లు చేరిననాడే నాల్గు అంటిస్తే సంగతి బయటపెట్టేది. ఆ రోజు పరువు — ప్రతిష్ట అని నా నోరునొక్కారు. ఏనాడు మా వంశంలో ఏ ఆడపిల్లా ఇలా గడపదిగి ఎరగదు. ఇది నా కడుపున చీడపురుగులా పుట్టింది. ఎంతో అమాయకురాలని అనుకున్నాను'' అన్నాడాయన.

''ఏం అనుకుని లాభం? జరగరానిది జరిగిపోయింది'' అన్నాడు విచారంగా శేషు.

''అందుకే ఒక ఏడుపు ఏడ్చి వూరుకుంటే సరిపోతుంది'' అన్నాడాయన విరక్తిగా.

''ఒకవేళ మళ్ళీ అత్తారింటికే వెళ్ళిందేమో?'' అంది ఆశ చావని శాంతమ్మ.

''వెళ్ళగొట్టిన వాళ్ళే నరయినా మళ్ళీ రానిస్తారా? అయినా శ్రావణికి అభిమానం ఎక్కువ. బహుశా ఈపాటికి అంతా పూర్తయే వుంటుంది. మళ్ళీ మనం ఏ ముఖం పెట్టుకుని అక్కడికి వెళతాం. అదంతా వృధాప్రయత్నం'' అన్నాడు శేషు.

''ఈ విషయం వాళ్ళకి తెలియచేద్దామా?'' అన్నాడు లక్ష్మయ్య.

''ఎందుకుట మీరు చేసిన ఘనకార్యానికి మా అమ్మాయి ప్రాణం తీసుకుంది అని చెపులారా? ఏమీ అక్కర్లేదు'' అంది శాంతమ్మ ఏడుస్తూ.

''నిజమే మావయ్యా. అత్తయ్య చెప్పింది కూడా సబబుగానేవుంది. ఇంటినుంచి గెంటేసిన వాళ్ళకి మన పిల్ల ఏమయితే వాళ్ళకి కావాలి!'' అన్నాడు శేషు అత్తగారిని సమర్థిస్తూ.

17

అప్పటికి శ్రావణి ప్రమీల ఇల్లు చేరి పది రోజులయింది.

ఏ పనీ చెయ్యకుండా అలా వూరికే తిని కూర్చోవటం సిగ్గుగా వుంది శ్రావణికి. అందుకే తనకు తానుగా కావాలని ప్రమీల వారించినా వినకుండా ఏదో పనులు కల్పించుకునేది.

పొరపాటున కూడా ఏ రోజు కైలాష్ కంట పడేదికాదు.

అసలు శ్రావణి అనే మరొక వ్యక్తి ఆ ఇంట్లో వుందా? లేదా అన్న అనుమానం ఒక్కొక్కసారి కైలాష్‌కి కూడా వచ్చేది.

కానీ ప్రమీలకి వంటపనిలో సాయం చేస్తాననటం బొత్తిగా నచ్చని విషయం. ఎన్నోమార్లు చెప్పి చూసింది. కానీ లాభం లేకపోయింది.

ఆ రోజు పనిమనిషి రాకపోవటంతో ప్రమీల లేచేసరికి, తెల్లవారుఝామునే లేచిన శ్రావణి అంట్లన్నీ శుభ్రంగా తోమి వంటగది నీట్‌గా సర్ది డికాషన్ తీసే ప్రయత్నంలో వుంది.

''ఎవరు చెయ్యమన్నారీ పని?'' అంది కోపంగా ప్రమీల.

''ఒకరు చెప్పాలేమిటి'' అంది శ్రావణి.

''ఇదిగో చూడు! ఇది లాస్ట్ వార్నింగ్. నీకు మరొకసారెప్పుడూ ఇలా చెయ్యనని నాకు మాటివ్వాలి. నా మాట కాదని నువ్వు చేస్తుంటే నాకు ఎలా అన్పిస్తోందో తెలుసా! పనులు చేయిస్తున్నానని తోస్తోంది'' అంది ప్రమీల బాధగా ముఖంపెట్టి.

''మనిద్దరికి ఏ సంబంధమున్నదని ముక్కూ ముఖం తెలియని దాన్ని నన్ను నీ ఇంటికి తెచ్చావు. అక్కా అని పిలవమన్నావు. నాకంత చనువు ఇచ్చిన దానికి స్వతంత్రంగా ఈ పని చేస్తే తప్పా?'' అంది అమాయకంగా శ్రావణి.

కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి ప్రమీలకు. అయినా తమాయించుకుని అంది. ''నీ కంతగా పని చెయ్యాలని వుంటే నా నవలల్ని ఫెయిర్ కాపీ రాయి. దాంతో నీకు బాగా కాలక్షేపం అవుతుంది'' అంది.

అలాగేనని సంతోషంగా ఒప్పుకుని ''పూర్తిగా ఆ పనే కాదు మధ్య మధ్య ఇలాటి పనులు చెయ్యనని మాత్రం అనుకోకు'' అంది శ్రావణి నవ్వుతూ.

అతి కొద్ది రోజుల్లోనే తనతోపాటు కల్సిపోయిన శ్రావణంటే ఎంతో ప్రేమా, అభిమానం ఏర్పడినాయి ప్రమీలకు. శ్రావణికికూడా అంతే?

ప్రమీల అర్జంటుగా పంపవల్సిన నవలను ఫెయిర్ చేస్తున్న శ్రావణి ''ఈ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటుందా?'' అని అనుమానంగా అడిగింది ప్రమీలను.

''చేసుకోదు. ఎందుకు అలా చెయ్యాలి? మగవాడి నిరంకుశత్వానికి ఆడది బలయిపోయేటట్లు రాయటం నా అభిమతంకాదు. ఒకవేళ ఆ స్త్రీ అలా చేసినా ఆమెమీద జాలిచూపేదెవరు సాటి సంఘంలో మనుషులా? బ్రతికున్నంతకాలం ఆమెను వేధించుకుతిన్న భర్తా? అందుకే ఎదురీది పోరాడుతుంది జీవితంలో తోడు లేకపోయినా స్వశక్తితో తన కాళ్ళమీద నిలబడుతుంది'' అంది కాగితాలు బొత్తిగా సర్దుతూ.

''ఆడది ఎంత తన కాళ్ళమీద తాను నిలబడ్డా జీవితంలో మగతోడు లేకుండా గడపటం సాధ్యమంటావా అక్కా?'' అంది తన గురించి ఆలోచిస్తూ చిన్నపోయిన ముఖంతో.

''అది వాళ్ళ వాళ్ళ పరిస్థితినిబట్టి ఆధారపడి వుంటుంది. కానీ మగవాడి నిర్లక్ష్యానికి గురయిన ఆడది పిరికిదానిలా బ్రతుకు ముగించుకునేకంటే, ధైర్యంగా ఎదుర్కొన్ననాడే కొందరు మగువల చరిత్రలలో అయినా మార్పువస్తుంది'' అంది.

''అందరికీ నీలాగా ధైర్యం వుండదు. కష్టాలు వచ్చినప్పుడు ఎదురీది పోరాడేకంటే, ఆ సమస్యల వేడిలో బ్రతుకు ముగించుకోవటమే మంచిదన్పిస్తుంది'' అంది తన అనుభవాన్ని నెమరువేసుకుంటూ.

''పిచ్చిదానా పుడుతూనే ఎవ్వరూ ధైర్యవంతులుకారు. పరిస్థితులే మనిషిని మొండిగా చేస్తాయి. ఆ మొండితనంనుంచే ధైర్యంకూడా పుడుతుంది. అందుకు నా జీవితమే వుదాహరణ'' అంది.

''నీ జీవితానికేం హాయిగా గడిచిపోతుంటే'' అంది శ్రావణి అర్థంకాక.

''నా భర్త దుర్మార్గుడు. పచ్చి రక్తం త్రాగటానికికూడా వెనకాడేవాడు కాదు'' అంది ప్రమీల.

నమ్మలేనట్లుగా చూస్తూ ''అబద్ధం మీరు చెప్పేది నేను నమ్మను. కైలాష్‌గారు అలాటివారు కాదు'' అంది శ్రావణి.

''ఈయన కాదు. ఇంతకుముందతని సంగతి'' అంది ప్రమీల.

అంటే నీకు... అంది ఆశ్చర్యంగా చూస్తూ.

''అవును కైలాష్ మళ్ళీ జన్మనిచ్చిన మహనీయుడు. అంతకుముందు వున్న తను శాడిస్టు. అతనితో వున్న ఆరునెలలు నేను చావకుండా బ్రతికివున్నానంటే కారణం నేను మొండిదాన్నవటమే'' అంది గంభీరంగా.

''అర్థం అయేలా చెప్పక్కా'' అంది పెన్ను మూస్తూ శ్రావణి.

ప్రమీల చెపుతోంది.

18

నా పదవసంవత్సరంలోనే మా అమ్మ నాకు కరువయ్యింది. ఆ లోటుని సహించలేని మా నాన్న తనకోసంకానీ, నాకోసంకానీ మరొకావిడని శాస్త్రోక్తంగానే నాకు అమ్మగా తెచ్చాడు. అప్పటినుంచే నా కష్టాలు మొదలయినాయి. మా పిన్ని పేరు సుశీలమ్మ కానీ సుగుణాలరాసిమాత్రంకాదు. వచ్చిన మర్నాటి నుంచే నేనంటే చిటపటలాడేది. కానీ నాన్నంటే మాత్రం ఇష్టంగానే వుండేది.

కర్తవ్యం

ఏదో రాష్ట్రంలో
ఏదో జరిగితే
ఏమో నాకెందుకని వూరుకోకు—
ఎందుకంటే రాజుకున్నది 'నిప్పు'
ఏ క్షణంలోనైనా నీకే ముప్పు
చల్లార్చడానికి ప్రయత్నించు
చేతకాకపోతే వూరుకో—
కానీ
చల్లార్చేవాళ్ళ రెక్కలట్టుకుని లాగకు

— మంత్రవాది మహేశ్వర్

ఆ తేడ ఎందుకని ఎంత ఆలోచించినా నాకా రోజుల్లో తెల్సేదికాదు

ఒకరోజు పిన్ని ఆర్డరుపై పంచదారకి వెళ్లాను నేను కొట్టువైపు వెడుతుండగానే ఒకతను ఎదురువచ్చి —

''చూడమ్మా పాపా మీ అమ్మ నన్ను పంచదార తెమ్మంది నువ్విక్కడేవుండు తెచ్చి ఇస్తాను అక్కడ జనం చాలామంది వున్నారు చిన్నపిల్లవి నువ్వారద్దీలో నిలబడలేవు'' అని చొరవగా సంచీ, డబ్బులు తీసుకున్నాడు నా చేతి లోంచి

''అక్కడికీ అనుమానంగా మా ఇల్లెక్కడో చెప్పండి'' అన్నాను మిమ్మల్ని ఎప్పుడూ చూడ లేదనికూడా చెప్పేను

మా నాన్న పేరు, మా ఇల్లెక్కడ వుంది చెప్పి మీ ఇంట్లో వుంది మీ ముగ్గురేగా అని మీ నాన్న, నేను చాలా మంచి స్నేహితులం అని కూడా చెప్పాడు కానీ అతడు చెప్పే వివరాలు అన్నీ మా కార్డు చూసి చెప్తున్నాడని తెల్సుకో లేకపోయాను అందుకే నమ్మాను కానీ అతడు చెప్పిన దానికంటే కూడా ఎక్కువసేపు నిలబడ్డా చివరకు విసుగొచ్చి కొట్టు దగ్గరకు వెళ్లాను అప్పటికి అందరికీ పంచదార ఇవ్వటము షాపు ముయ్యటము కూడా జరిగింది గుండె జల్లుమంది భయం భయంగా ఇల్లు చేరి జరిగింది చెప్పాను

ఆరోజు నేను ఆవిడ చేతిలో తిన్న దెబ్బలకి నిజంగా అక్కడికక్కడే చచ్చి వుండాల్సింది నన్ను కిందపడేసి కాలితో తొక్కుతూ, తన్నుతుంటే కూడా చావలేదంటే, దీనికన్నా కఠినమైన పరిస్థితులు ముందు ఎదుర్కోవాలని నా నుదుట రాసుందేమో

కేవలం నేను చెప్పింది మచ్చుకు ఒక్క సంఘటన మాత్రమే ఇలాటివి నా జీవితంలో ఎన్నో చెప్పలేను

మరొక సంఘటన బహుశా ఇలాటివి కూడా వుంటాయని నేను మొదటిసారిగా అప్పుడే తెల్సుకున్నాను

అప్పటికి నాకు పదహారు సంవత్సరా లుంటాయి ఆడదానికి అందమే శత్రువు అన్న మాట నిజమన్నట్లుగా బయటకు వెడితే మగవాళ్ళ చూపులన్నీ నా మీద వుండేవి వెళ్ళనంటే పిన్ని తిట్లు, వెడితే వాళ్ళ చూపులు భరించటం కష్టంగా వుండేది

జీవితంలో మొదటిసారిగా తన అందం కూడా తనకే శత్రువనీ, నా మీద నాకే అసహ్యం కల్గినరోజు

మా పిన్ని ఎవరింట్లోనో పెళ్ళికని వెళ్ళింది ఆవిడ పిల్లలతోపాటు నేను కూడా వరండాలో పడుకున్నాను పగలంతా చాకిరీతో అలసిపోయిన నాకు మాగన్నుగా నిద్ర పడుతోంది ఎవరో మీద పడ్డట్లయింది లేచి గట్టిగా అరవబోయాను. కానీ! నా చేతులు పట్టుకుని, ''ఈ ఒక్కసారి నామాట విను ఈ రాత్రికి మీ పిన్ని ఇంట్లో లేదు, నా కళ్ళకు నువ్వచ్చం మీ అమ్మలాగా కన్పడుతున్నావు నా మాట కాదనకు'' అని నన్ను బ్రతిమాలే గొంతు నన్ను కన్న తండ్రిది అని తెలియగానే నా ఊపిరి స్తంభించిపోయి నట్లుగా నిలబడి పోయాను మౌనమే అంగీకార మనుకున్న ఆయన చొరవని తిరస్కరిస్తూ ఆయన్నించి రక్షించుకోవటానికి నన్ను నేను చేసిన ప్రయత్నాలు ఎన్నో ఇల్లంతా పరుగులు తీశాను తలుపు వూడిపోయిన బాత్‌రూమ్ కూడా నాకు రక్షణ నివ్వలేకపోయింది చివరకు నా పాలిట పెన్నిధిలా మరుగుదొడ్డి నా కాశ్రయం ఇచ్చింది ఆ దుర్వాసనను భరిస్తూనే అక్కడ గడిపిన రాత్రిని తల్చుకుంటే ఈ జీవితంమీద, ఈ ఆడతనంమీద, నాకు నాకే అసహ్యం వేసేస్తుంది

కామాంధుడైన కన్న తండ్రి బారినుంచి తప్పించుకోవటానికి ఆ రాత్రి నేను ఎన్ని అగచాట్లు నాకు తెల్సు, ఆ దేవుడికి తెల్సు

అప్పట్లో చద్దామంటే చావలేని పిరికితనం ఒక రకంగా నాకన్నా నువ్వే ధైర్యవంతురాలివి ధైర్యంగా చావాలనే అనుకున్నావు అనులో కూడా పెట్టావు

ఆ రోజునుంచీ మా నాన్నతో మాట్లాడడం పూర్తిగా మానేశాను ఒక రకంగా ఆయనకన్నా పిన్నే నయం అన్పించేది నాన్న గురించి చెప్పేద్దామంటే ఏం జరుగుతుందోనన్న భయం ఒకవైపు, చెప్పకపోతే దెబ్బతిన్న పాము బుస కొడుతూ మరెప్పుడయినా కాటువేస్తుందేమోనన్న భయం మరొకవైపు

ఈ భయాల మధ్య చిత్తక్షోభను అనుభ విస్తున్న నాకు విముక్తి ప్రసాదించటాని కన్నట్లుగా ఒకతను నా అందం చూసి నన్ను పెళ్ళాడతానన్నాడు

పైసాకూడా కోరని అతనికి నన్నిచ్చి పిన్ని ఆనందంగానే ముడిపెట్టింది కానీ పెళ్ళిపేరుతో పెనంమీదనుంచి నిప్పుల్లో పడ్డట్టుగా అయింది నా పని అతికొద్దిరోజుల్లోనే అతనిది శాడిస్టు మెంటాలిటి అని, భార్యగా ప్రేమించేందుకు కాదని నన్ను చేసుకుంది, నన్ను హింసించి దాంతో ఆనందపడటం తృప్తిచెందటం, కోసమే నన్ను భార్యగా ఎన్నుకున్నాడని తెల్సుకున్నాను

కాస్త మంచిచీర కట్టుకుంటేచాలు ''ఎవరి కోసమే తయారయ్యావు ?'' అనేవాడు

అలా బాధిస్తున్నాడని తలకూడా దువ్వుకోని నాడు —

''నీకన్నా బజారు మనుషులే నయం ఇంటికి వెడితే కనీసం నవ్వుతూ అన్నా పలకరిస్తారు'' అనేవాడు

''డబ్బిచ్చుకుని చూపించే బజారు మనుషుల ప్రేమ శాశ్వతం కాదని తెల్సుకున్నరోజు కట్టుకున్న

ఆగస్టు 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన స్వాతి సపరివార పత్రిక ఆవిష్కరణోత్సవ సందర్భంగా జరిగిన 'అందచందాల పోటీ'లో ఎన్నికైన యువతులకి బిరుద ప్రదానం చేసిన శ్రీమతి మాలతీ చందూర్, 'స్వాతి కుమారి'గా తృతీయస్థానం పొందిన కుమారి శర్మిల, 'స్వాతి సుందరి'గా మొదటి స్థానం పొందిన కుమారి వి ఎస్ విజయలక్ష్మి, 'స్వాతి సుకుమారిగా' ద్వితీయస్థానం పొందిన కుమారి రమణి, పోటీ నిర్వహించిన స్వాతి సంపాదకుడు శ్రీ వేమూరి బలరామ్‌గార్లని చిత్రంలో చూడవచ్చు



పెళ్ళాం కాళ్ళ దగ్గరకువచ్చి చేరే మగవాళ్ళని చాలామందిని చూస్తున్నాం'' అన్నాను పొరపాటున నోరు జారి

అంతే నేనన్న మాటలకు నా మీద కోపం వచ్చి కాళ్ళు—చేతులు కట్టిపడేసి గొడ్డుకన్నా హీనంగా చావబాదాడు అయినా కక్ష తీరక ''ఈ అందాన్ని చూసుకునేగా విర్రవీగుతున్నావు అదే లేకుండ చేస్తే''అని నేను గోల పెడుతున్నా వినకుండా నా జడను కత్తిరించి, బుగ్గలపై బ్లేడుపెట్టి గాట్లుపెట్టాడు నేను బాధతో విలవిలలాడుతుంటే పైశాచిక ఆనందం పొందిన మనిషిలా ఇల్లంతా వెర్రి గంతులువేశాడు

అతని మనస్తత్వం పూర్తిగా తెల్సుకున్న నేను అతని ముందు రెచ్చగొట్టేటట్లుగా మాట్లాడకూడదని అనుకున్నాను కానీ అతని ధోరణి మరింత విపరీతమయింది భోజనం దగ్గర వండిన పదార్థాలన్నీ ఇల్లంతా చిమ్మిపారేసి కొత్తవి కావాలనేవాడు చచ్చీ—చెడి మళ్ళీ కొత్తవి తయారు చేస్తే, మళ్ళీ ముందు చేసినవే కావాలనేవాడు

ఎంత ఓర్పుగా చేద్దామనుకున్నా నా సహనాన్ని పరీక్ష చేసేవాడు అలాటి మనిషితో వేగలేకపోయాను కనీసం మనసులోని కష్టం చెపితే వినే వ్యక్తులు కూడ కరువయ్యారు

రోజురోజూ పరిస్థితి విషమించుతున్న కొద్దీ ఏమయితే అయిందని మరింత మొండిగా తయారయ్యాను

ఆ రోజు ముందుగానే ఇల్లు చేరారు వస్తూనే నన్ను పేరుపెట్టి పిలుస్తూ పువ్వుల పొట్లాం చేతికిచ్చి ''త్వరగా తయారవు సినిమాకి వెళ్దామన్నారు '' కలా? నిజమా? అన్న విషయం నుంచి తేరుకుని మళ్ళీ ఏం మూడ్ మారుతుందోనని తయారయ్యాను

అదే మొదలు మా పెళ్ళయిన ఆరునెలలకు సినిమా పేరుతో మొదటిసారిగా బయటకు వెళ్ళటం ఎంతో ఆనందంగా వుంది నా మనసు

కానీ ఆ సంతోషాన్ని వమ్ముచేస్తూ ''సినిమాకి వద్దులే, ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుందాం'' అన్నారు

ఏమంటే ఏ ముప్పు వస్తుందో అని ''సరే'' అన్నాను

మామూలు మనిషిలా ఎంతో ఆప్యాయంగా కబుర్లు చెపుతున్నారు నిజంగా ఆ ఆప్యాయతకు నా కళ్ళు చెమర్చాయి

''ఏమండీ రోజూ ఇలాగే వుండకూడదు ఇవేళ నా మనసుకు ఎంతో ఆనందంగా వుంది'' అన్నా

''ఎందుకు వుండను నిన్నెప్పుడు సంతోషంగా వుంచుతాను'' అని గట్టిగా నవ్వి నన్ను పట్టుకుని ఊహించని విధంగా నా చెవి కొరికేశాడు బాధతో నేను కేకలు పెడుతున్నాను గింజుకుంటూ కానీ విడవకుండా పిచ్చిబలంతో

శ్రావణి

కండ వూడి వచ్చేవరకు కొరికారు ఆ గుర్తు ఇంకా మిగిలింది అని తన చెవి మీద జుట్టు తొలగించి చూపింది ప్రమీల


మానసికంగానే కాకుండా, శారీరకంగాకూడా గాయపరుస్తున్న ఆ మొరటు మనిషి ఆధీనంలో ఇంక వుండలేనని అన్పించేది కానీ వెళ్ళే దారేది

ఆయన సహచర్యంలో నేను అనుభవించింది నరకమంటే అతిశయోక్తి కాదేమో ఈ బాధ భరించలేక పుట్టింటికి పారిపోదామంటే, కన్న తండ్రి ఒకవైపు సవతితల్లి మరొకవైపు బ్రతికుండగానే నన్ను తలా కొంచెం పంచుకుతినే రాక్షసుల్లాగా కన్పించారు వాళ్ళందరు నా మనసుకి

ఈ సమస్యకి పరిష్కారమే లేదా? అని మథనపడేదాన్ని మరొక వారం రోజులు కి ఒకనాటి సాయంకాలంవేళ ఆయన మృతదేహాన్ని తెచ్చి ఇంటిదగ్గర పడేశారు గుండె నెప్పివలన పోయారని చెప్పారు

శిలా ప్రతిమలా వుండిపోయాను నే కోరుకున్న పరిష్కారం ఇదా అని నాలో నేనే వాపొయ్యాను ఈ గూడునుంచి తప్పించి నిలువ నీడలేకుండా చేసి నా జీవితంతో ఎంతకాలమో విధి ఆడే నాటకం అనుకున్నాను కానీ నా కంటి నుంచి ఒక్క చుక్క నీరయినా రాలేదు తాళి కట్టిన భర్తయినా, నా మనసుకి పరాయివాడిలాగే అన్పించాడు అతని చావు నామీద ఎలాటి ప్రభావం చూపలేదంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది

ఈ పరిస్థితిలో పుట్టింటికి వెళదామంటే వయసులోవున్న నన్ను నన్ను, నా అందాన్ని చూసిన కన్న తండ్రి నాకు రక్షకుడే అవుతాడో, భక్షకుడే అవుతాడో తెలియదు ఏం చెయ్యాలో తోచక చివరికి ఒక నిర్ణయానికివచ్చి బ్రతుకు తెరువుకోసం చిన్నపాటి వుద్యోగం వెతుక్కుని మకాం ఉమన్స్ హాస్టలుకి మార్చాను విషయం తెల్సికూడా నాకోసం ఎవ్వరూ రాలేదు



ఆ హాస్టలు వార్డెన్ సువర్చలాదేవి నా గాథను విని సానుభూతి చూపించేది మళ్ళీ మంచి రోజులు వస్తాయని చెప్పేది ఆవిడకోసం తరుచుగా వచ్చే ఆవిడ తమ్ముడు కైలాష్‌కు నాకు పరిచయం కల్గించింది సువర్చలాదేవి? ఆ పరిచయం పెరిగి పెద్దదయింది కైలాష్ ఎంతో మంచివాడు జీవితంలో మొదటిసారిగా నేను కోరుకున్న ఆప్యాయత చవిచూపింది వారి దగ్గరే మా ఇద్దరిమధ్యా చనువు మరింత వృద్ధి అవసాగింది

ఆ చనువును పురస్కరించుకునే నన్ను పెళ్ళి చేసికొమ్మని కోరాడు నట్టనడిసముద్రంలో ప్రయాణం చేస్తున్న దారి తప్పిన చిన్న నావకి తనకు తానుగా ఎదురుగా ఒక పెద్ద ఓడ వచ్చి నావకు రక్షణ అవుతానంటే ఆ నావ పరిస్థితి ఎలా వుంటుందో నా పరిస్థితి అలా వుంది ఇంచుమించు

ఒకసారి వివాహితనయిన, నన్ను పెళ్ళాడి నాకొక అండగా నిలుస్తున్న అతని సంస్కారానికి, ఉదార స్వభావానికి జోహారులర్పించాను

''నా గురించి పూర్తిగా తెలిసివుంటే మీరింత త్వరపడి ఒక నిర్ణయానికి వచ్చేవారు కారేమో'' అన్నాను

''చూడండి ప్రమీలా! అక్కయ్య ద్వారా నాకు అంతా తెల్సింది అందమయిన మోజుపడ్డ గులాబీని స్వంతం చేసుకోవాలన్పించినపుడు దాని వెనకవున్న ముళ్ళను గురించి ఆలోచించటం అనవసరం నాకు మీరు నచ్చారు మీకేమన్నా అభ్యంతరం వుంటే చెప్పండి, మనిద్దరి మధ్యా ఈ టాపిక్ రాలేదని అనుకుంటాను''

ఒక్కసారి నా భవిష్యత్తు ఊహించుకున్నాను ఎన్నాళ్ళని ఈ చిన్నపాటి జీతంతో బ్రతుకు గడుపుతాను అందించిన చెయ్యిని అలక్ష్యం చేస్తే అనాథగానే మిగిలిపోతానన్న భయం అరసెకనులో నా అభిప్రాయాన్ని మార్చేసింది మరి మాట్లాడకుండా ఆ పెళ్ళికి అంగీకరించాను

అంతే! నా జీవితమే పూర్తిగా మారిపోయింది అతని సహచర్యంలో నా జీవితం మూడు పువ్వులూ— ఆరు కాయలుగా గడిచిపోయింది, గడిచిపోతోంది కూడా నాచేత బి ఏ చదివించటమే కాకుండా, ఒక రచయిత్రిగా కూడా తయారుచేశారు నా రచనా జీవితానికి తొలిమెట్టు మా శ్రీవారని నేనీనాడు సగర్వంగా చెప్పుకుంటాను

మనిషి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు మార్పు రాకుండా వుండదు అనూహ్యమైన పరిస్థితులు ఎదురయినా మనసు దృఢపర్చుకున్ననాడే మనిషి విలువ పెరుగుతుంది ఇదంతా నేను స్వానుభవంతో చెపుతున్నాను'' అంది ప్రమీల

(ఇంకా ఉంది)

కూలిన ఆశలు

దాసరి అన్నపూర్ణ



"సార్ !" పి ఎ నీళ్ళు నములుతూ నిలుచున్నాడు.

"ఏమిటి చెప్పండి ?" ఫైల్సు మధ్య నుండి తల ఎత్తకుండానే ముఖానికి పట్టిన చమట తుడుచుకుంటూ విసుగ్గా అడిగాడు మానేజరు ఉపేంద్ర

"మీకోసం మిసెస్ మూర్తిగారు !" పి ఎ చెప్పే మాట పూర్తికాకుండానే అసహనంగా తల అటూ ఇటూ వేగంగా త్రిప్పాడు ఉపేంద్ర

"ఈ రోజున నేనెవ్వర్నీ కలుసుకోను వీలు పడదని మీకపుడే రెండు మూడుసార్లు చెప్పాను ప్లీజ్ డోన్ట్ డిస్టర్బ్‌మి !" విసుగ్గా ఫైల్సు మధ్య తలదూర్చేశాడు పని ఒత్తిడివలన కలిగిన చికాకు అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది అజాగ్రత్తగా — బాధ్యతారహితంగా ఆఫీసు ఫైల్సు విషయంలో ప్రవర్తించడం వుద్యోగి పట్ల క్షమించరాని నేరం అది ఎవరయినాసరే— బాధ్యతపట్ల ఏమరపాటు వుండకూడదు బ్రాంచాఫీసునుండి ఫైలు పోగొట్టిన ఒక వుద్యోగిని కేసు విషయమై తీవ్రంగా ఆలోచించి చివరకు సస్పెన్షన్ ఆర్డరు యివ్వడానికే నిశ్చయించుకున్నాడు ఉపేంద్ర వాచీవంక చూశాడు అప్పటికే అయిదయిపోయింది ఆఫీసు స్టాపంతా వెళ్ళిపోయినట్లున్నారు లేచి చల్లటి మంచి నీళ్ళు త్రాగి విశ్రాంతిగా కుర్చీలో వెనక్కి వాలి ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు

"సార్ ! ఆమె ఎంత చెప్పినా వినడం లేదు మిమ్మల్నెలాగయినా కలుసుకోవాలట — ఉదయంనుండి ఆమె అలా కూర్చునే వున్నారు"

క్షణం ఆలోచించి— "సరే పంపించండి" గంభీరంగా అన్నాడు మరుక్షణంలో స్ప్రింగ్ డోర్ తెరుచుకుని లోపలికి రాబోతున్న మూప్పై అయిదేళ్ళ యువతి పాదాలు మరి ముందుకుపోలేనన్నట్టు అక్కడే నిలిచిపోయాయి ఆమె చేతి వ్రేళ్ళు స్ప్రింగ్ డోర్‌మీద బలంగా బిగుసుకున్నాయి

తనతో మాట్లాడటం కొరకు ఉదయం నుండి ఎదురుచూసి ఇపుడు చుక్కలు లెక్క పెడుతూ నడుస్తోందా? ఎంతకీ రాదేం లోపలికి ఏం ఆడవాళ్ళో ఎక్కడికి వచ్చినా హంసనడకలు టైం విలువ బొత్తిగా తెలుకోలేరు ఇక ఎంత మాత్రం సహనం పట్టలేని వాడిలా విసుగ్గా తల ఎత్తి చూసిన ఉపేంద్ర షాక్ తిన్నట్టుగా కళ్ళు వెడల్పు చేసుకుని ఆమెవంకే చూస్తుండి పోయాడు ఏనాటి మయూరి? అతని కళ్ళ ముందు మయూరి— ఫైలు— మిసెస్ మూర్తి అన్నీ ఒకటిగాకలిసిపోయి గిరగిర తిరిగిపోతున్నాయి ఆమె కూడా అదే స్థితిలో వుంది ఎంత ఆశ్చర్యం ? ఏనాటి ఉపేంద్ర— ఇంత కాలానికీ విధంగా— ఏనాడూ ఊహించని స్థానంలోవున్న ఉపేంద్ర దగ్గరకు తానీ స్థితిలో ఒక నిరుపేదగా నడిచిరావడం ఎంతవిచిత్రం జీవితంలో సంభవం కానిది— అసంభవమైనది వుండనే వుండదేమో! ఆమె మనసు పరిపరి విధాల పోతున్నా— ఆమె పాదాలు కదలికను మరచిపోయినట్లు నేలకు అంటుకునే వుండిపోయాయి మంచు బొమ్మలా స్ప్రింగ్ డోర్ దగ్గరే నిలిచిపోయింది ఆమె ఎంత మార్పు ? ఆ కళ్ళల్లో— రూపంలో బోలెడన్ని కోరికలు ఆశలు గంతులేస్తూ వుండేవి ఆనాడి మయూరి ఊహలు రాజహంసల్లా రెక్కలు చాచుకుని ఆకాశంలో ఎత్తుగా విహరించేవి ఈనాడు ఆ మెరుపులు— ఆశలు ఏమై పోయాయి కాంతిలేని కళ్ళు కన్నీటి కధల్ని వినిపించడానికి సిద్ధంగా వున్నట్లున్నాయి వయసు తెచ్చిన మార్పుకంటె ఎక్కువగా ఆమెలో మార్పు కనిపిస్తోంది రెప్పవేయడం మరచిన ఉపేంద్ర కళ్ళల్లో ఒకనాటి అందమైన మయూరి గంతులువేస్తూ వచ్చి నిలుచుంది

*　　*　　*

ఉపేంద్ర, మయూరి ఒకే స్కూల్లో కలసి చదువుకున్నారు తెల్లగా బొద్దుగా, పువ్వులా వుండే మయూరి అంటే ఉపేంద్రకు ఎంతో ఇష్టం ఆ పాపతో మాట్లాడాలన్నా— కలసి తిరగాలన్నా వుత్సాహం వుప్పొంగేది అతనిలో

మయూరి కిష్టమైన వస్తువేదయినా వున్నదంటే అది ఎలాగయినా సంపాదించి ఆమె కివ్వడంలో ఎంతో ఆనందాన్ని అనుభవించేవాడు ఒక్కోసారి ఆ పని మీద క్లాసు కూడా ఎగ్గొట్టే వాడు అంతకంటె అతనికి ఆసక్తికరమైన విషయం మరొకటి వుంది ఆటల్లో వున్నాడంటే ఏ విషయమూ పట్టేదికాదు చదువు, తిండి, ఇల్లు అన్ని మరచిపోయాడా అన్నట్లుండేవాడు ఆ విధంగా చదువు మీద ఏర్పడిన అశ్రద్ధ — ఆటలమీద ఎక్కువయిన శ్రద్ధా కలసి ఉపేంద్రను చదువులో వెనకబడేట్లు చేశాయి మయూరి డిగ్రీ పూర్తిచేసేసరికి ఉపేంద్ర ఇంకా సెకండి యర్‌లోనే వున్నాడు మయూరి దృష్టిలో

కూలిన ఆశలు

ఉపేంద్ర ఒక మొద్దబ్బాయిగా గుర్తింపబడ్డాడు అతని మాటలన్నా—పనులన్నా ఒక అలక్ష్య భావం ఏర్పడిపోయింది ఆమెలో ఆతనితో చనువుగా తిరగడానికి, సరదాగా కాలక్షేపం చేయడానికి ఆమెకు అభ్యంతరమూ కనిపించలేదు పైగా దృఢంగా, ఆరోగ్యంగా వుండే ఉపేంద్ర ఆమెకో బాడీగార్డులా కనిపించాడు వయసుతోపాటు పదింతలుగా అందాన్ని నింపుకున్న మయూరి పట్ల మరింత ఆరాధనాభావంతో వున్న ఆతనికి ఆమె చూపే నిర్లక్ష్యభావంగాని, ఆమెలో కలిగిన మార్పుగాని గుర్తించలేకపోయాడు మయూరి ఉద్యోగంలో జాయినయింది ఉపేంద్ర డిగ్రీ పూర్తిచేసి, అతికష్టం మీద వుద్యోగం సంపాదించి జాయినయ్యే ముందు రోజున మయూరితో అన్నాడు

"మయూరీ ! నాకు వుద్యోగం వచ్చింది ఇక మనం దూరదూరంగా వుండటానికి ఏ అడ్డూ కనిపించడంలేదు నేను ప్రత్యేకించి నా మనసు విప్పిజెప్పేదేంలేదు మయూరీ ! ఆ మనసునిండా నీవే వున్నావు నీ మధురమైన మనసు విప్పిచెప్పు, మయూరీ !" టాంక్ బండ్ మీద వీస్తున్న చల్ల గాలులు గిలిగింతలు రేపుతూంటే మయూరి చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నిమురుతూ తన్మయత్వంతో కన్నులు మూసుకున్నాడు ఉపేంద్ర

గట్టిగా నవ్వుతూ ఉపేంద్ర చేతినుండి తన చేతిని తీసివేసుకుంది మయూరి

"ఓహ్ వండర్‌ఫుల్, ఉపేంద్రా ! డైలాగ్సు చాలా బావున్నాయి చదువు త్వరగా ఒంటబట్టకపోయినా ప్రేమ పైత్యం బాగానే తలకెక్కింది !" ఇంకా నవ్వుతూనే వుంది మయూరి

"అంటే ? అంటే ?" తెల్లబోయాడు ఉపేంద్ర

"చూడు, ఉపేంద్రా ! చిన్ననాటినుండి స్నేహంగా, సరదాగా తిరిగినంత మాత్రాన దానికి నీవు ప్రేమ — పెళ్ళి అంటూ అర్థాలు తీయడం బావుండలేదు జీవితంలో పెళ్ళి ఒక్కటే ముఖ్యంకాదు భవిష్యత్తులో పైపైకి రావాలనే పట్టుదల వుండాలి"

'పెళ్ళికి — నా చదువుకి — ప్రేమకి సంబంధం ఏమిటి ? నేనడుగుతున్నది మన పెళ్ళి గురించే !" మనసులో ఇంకా ఆశ్చర్యపోతూనే పొంగుతున్న కోపావేశాన్ని అణచుకుంటూ అన్నాడు

"అవును నేను చెబుతున్నదికూడా దాని గురించే — నాకు జీవితం మీద చాలా ఆశలు, కోరికలు వున్నాయి, ఉపేంద్రా ! నాకు తెలియక నిన్నేమైనా బాధకు గురిచేసి వుంటే క్షమించు బై !" చకచకా వెళ్ళిపోయింది మయూరి

హతాశుడయ్యాడు ఉపేంద్ర అతనిలో రేగిన అవమానపు జ్వాల మనసుని దహించి వేస్తుంటే పశ్చిమాన కృంగిపోతున్న సూర్యునిలాగానే ఉపేంద్ర ముఖంకూడా ఎర్రగా కందిపోయింది

*　　*　　*

"అమ్మా! క్రితంసారి అన్నావు గుర్తుందా ఒక అమ్మాయి గురించి నీకిష్టమయితే నాకే అభ్యంతరంలేదు !" ఆశ్చర్యంగా చూస్తున్న తల్లి చూపుల్ని గమనించనట్లుగా భోజనం ముగించి లేచి వెళ్ళిపోయాడు ఉపేంద్ర తల్లీ—తండ్రీ ప్రశ్నార్థకంగా ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు

కొంతకాలానికి రాధా— ఉపేంద్రల వివాహం అతి నిరాడంబరంగా జరిగిపోయింది పార్టీకి అందరితోపాటు మయూరికూడా వచ్చింది మండే మంటలమీద మంచుపొర కప్పి చిరునవ్వుతో రాధని పరిచయం చేశాడు ఉపేంద్ర రాధ సౌందర్యాన్ని చూస్తూ రెప్పవేయడం కూడా మరచిపోయింది మయూరి

కాలం నిర్మలంగా కదలిపోతూంది రాధా— ఉపేంద్రల జీవితంలోకి మధురిమను పంచుతూ రాధలోని అమాయకత్వం ముగ్ధత్వం ఉపేంద్రను మరీ మరీ ఆకర్షిస్తున్నాయి

"రాధా! నీ సాంగత్యంలో ఇంత మాధుర్యం వుంటుందని నేననుకోలేదు !" ఆమె నుదుట నాట్యం చేస్తున్న ముంగురుల్ని మృదువుగా సవరిస్తూ అన్నాడు

"నేను కూడా ఇంత అదృష్టవంతురాల్నని ఎన్నడూ అనుకోలేదు కట్నం ఆశించకుండా నన్ను భార్యగా స్వీకరించిన మీ ఔన్నత్య నీడ చాలు !" కన్నులు అరమోడ్చింది రాధ

మనిషి సుఖజీవనానికి తొలిమెట్టు రాజీపడి జీవించడం ఉపేంద్ర చాలవరకు పరిస్థితులతో రాజీపడి జీవించడం నేర్చుకున్నాడు

మయూరి వెడ్డింగ్ పట్టుకుని వచ్చి, రాధా — ఉపేంద్రలను తన పెళ్ళికి రమ్మని కోరింది తనక్కాబోయే భర్త పెద్దఉద్యోగస్థుడని మాటల మధ్య వెల్లడించిన ఆమె ఆడంబారాతిశయానికి మనసులోనే నవ్వుకున్నాడు అంతేగాక ఆమె అలంకరణ — నడక మాటతీరు మారాయని గ్రహించాడు

ఉపేంద్రకు మయూరి పెళ్ళికి వెళ్ళాలని పించలేదు గ్రీటింగ్సు పంపించి ఊరుకున్నాడు

భర్తతో వెళ్ళబోయేముందు ఉపేంద్రను ఒకసారి కలుసుకుని వెళ్ళాలనే కోరికతో ఉపేంద్ర గుమ్మంలో అడుగుపెట్టిన మయూరి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక పోయింది అక్కడ కనిపిస్తున్న దృశ్యానికి ఆమె ముఖంలో ఎందుకో కొద్దిగా కళ తప్పినట్లయింది ముందుకి వెళ్ళాలో వెనక్కి వెళ్ళాలో తోచక సందిగ్ధంలో వున్న మయూరిని చూసిన రాధ సిగ్గుతో భర్త ఒడి నుండి పక్కకు తప్పుకుంది ఉపేంద్ర చిరునవ్వు తెచ్చిపెట్టుకున్నాడు కుర్చీలోకూర్చుంటూ ముఖానికి నవ్వుపులుముకుని అంది మయూరి,

"ఏమిటి ఉపేంద్రా ! కొత్త [illegible] న్నవు ?"

"అబ్బే అదేం లేదే !" తడబాటును కప్పిపుచ్చుకున్నాడు

మయూరి రాక అతని మనసు నెవరో కెలుకుతున్నట్లుగా వుంది గంటలు క్షణాల్లో కబుర్లతో కరిగించిన వాళ్ళకీనాడు మాటలే కరువయ్యాయి ఆ నిశ్శబ్దం యిద్దరికీ యిబ్బందిగానే వుంది కుర్చీలో మయూరి అటు ఇటు కదలి నెమ్మదిగా అంది,

"నీ మిసెస్ ఏం చదువుకుందో చెప్పా లేదు"

"ఏ చదువూ యివ్వలేని సంస్కారమే ఆమె చదువు ?" చిరునవ్వుతో అన్నాడు భార్యపట్ల ఆతనికున్న అభిమానానికి అసూయతో ఆమె మనసు మెరమెరలాడింది ఆమె మనసు ఎందుకా విధంగా బలహీనమైపోతుందో ఆమెకే అర్థం కాలేదు లేచి నిలుచుంది మయూరి

"వస్తాను, ఉపేంద్రా ! ఆయనతోకలిసి బొంబే వెళ్ళిపోతున్నాను వెళ్ళేముందు నిన్నొకసారి చూడాలనిపించి వచ్చాను బై !" వెళ్ళి పోయింది మయూరి

*　　*　　*


ఉపేంద్ర జీవితంలో అనుకోని సమస్యలు వచ్చిపడ్డాయి తండ్రికి పక్షవాతం రావడంతో ఆ ఇంటి వాతావరణమే మారిపోయింది తండ్రి మందులకీ, వున్న ఒక్క తమ్ముడి చదువుకి, ఇంటి ఖర్చులకి ఉపేంద్ర జీతం చాలక పరిస్థితి విషమంగా తయారయింది సమయస్ఫూర్తిగల రాధ ఉపేంద్రకు కుడిభుజంలా నిలిచింది వుద్యోగానికి అప్లైచేసి దానికోసం ఎదురు తెన్నులు చూస్తూ కాలం వృథాకానీయకుండా ఇంట్లో కుట్టుమిషను ప్రారంభించింది

బాధ్యతలు మెడకు ఉచ్చుల్లా బిగుసుకుంటున్నా ఆతను తలపెట్టిన పథకాన్ని నెరవేర్చుకోవడానికి రెట్టించిన పట్టుదలతో ఆత్మవిశ్వాసంతో ఒక్కొక్క మెట్టూ పైకెక్కే ప్రయత్నంలో సఫలీకృతుడవుతున్నాడు

వేసవి వడగాడ్పులంతరించగానే చల్లని తొలకరి జల్లులు పుడమికి పులకింతలు కలిగించినట్లుగా ఉపేంద్ర జీవితంలోకి వసంతం తొంగి చూసింది ఉపేంద్ర మానేజరుగా ప్రమోటు కావడం, రాధా ఉపేంద్రల జీవితంలోకి బోసి నవ్వుల బాబు అవతరించడం అన్నీ వరుసగా జరిగిపోయాయి

ఆవేశాలు, ఆడంబరాలు సంఘంలో ప్రదర్శించాలనుకునే భేషజాలు వదులుకుంటే ప్రతిఒక్కరూ కొద్దిగానయినా సుఖశాంతుల్ని పొందగలరనిపించింది ఉపేంద్రకు

అంతలో ఏదో దబ్బున పడిన శబ్దానికి


హార్లిక్స్ మా కుటుంబంలో ప్రతి ఒక్కరికి మిత్రుడు వంటిది - రోజంతా ఆఫీసు పనితో అలసి వచ్చే మా శ్రీవారికి, కాలేజీకి, డాన్సు క్లాసుకి వెళ్ళివచ్చే మా అమ్మాయికి, ఫుట్‌బాల్ హీరో మా అబ్బాయికి. అంతెందుకు, రోజూ మార్కెట్ పని ముగించుకుని ఇంటికి వచ్చాక , నేను కూడా ఒక కప్పు హార్లిక్స్ త్రాగవలసిందే! హార్లిక్స్ మాలో ప్రతి ఒక్కరికి మేలు చేస్తుందని నా నమ్మకం.
మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు వన్నె గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో రుచికరమైన పానీయం.
పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాలకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?
Horlicks
The Great Nourisher
కొత్త సమయం, కొత్త రూపం
మంచి పుష్టికరమైనది
HTD-HMM-8072 TEL

ఉలిక్కిపడి యీ లోకంలోకి వచ్చిన ఉపేంద్ర నేలమీద స్పృహతప్పి పడివున్న మయూరిని చూస్తూనే ఖంగారుగా లేచి వచ్చాడు ఆమె ముఖం మీద నీళ్ళు జల్లి మెలకువ తెప్పించడానికి ప్రయత్నిస్తూనే ఆమె పట్ల తానంత సేపు చూపిన నిర్లక్ష్యానికి తిట్టుకున్నాడు ఎంతసేపటికి ఆమెకు మెలకువ వచ్చే సూచన కనిపించకపోవడంతో ఆమెను తీసుకుని హాస్పటల్ వైపుగా కారుని పోనిచ్చాడు

* * *

''మయూరి !'' చిక్కిన ముఖంచుట్టూ ముసురుకున్న ముంగురుల్ని సున్నితంగా వెనక్కి సర్దుతూ మృదువుగా పిలిచాడు ఉపేంద్ర సన్నగా మూలుగుతూ ఉపేంద్ర వంక ఒకసారి చూసి మళ్ళీ కళ్ళు మూసుకుంది మయూరి అప్పటికామెకు స్పృహ తప్పి పద్దెనిమిది గంటలయింది అప్పట్నుండి ఉపేంద్ర మయూరి దగ్గరే వున్నాడు

''షి యీజ్ ఆల్‌రైట్ మిస్టర్, ఉపేంద్రా ! ఆమె మానసికంగా వీక్ అయ్యారు ఈ రోజుకి వుంచి రేపు ఉదయమే తీసుకువెళ్ళండి !'' స్పృహ వచ్చిన మయూరిని చూసి వెళ్ళాడు డాక్టర్

ముందు రోజు రాత్రి ఆ మరునాడు కూడా ఉపేంద్ర ఇంటికి రాకపోవడంతో రాధ కంగారుగా ఆఫీసుకి ఫోను చేసింది ఉపేంద్ర హాస్పటల్‌లో వున్నాడని తెలియగానే ఆమె శిలాప్రతిమే అయింది హార్లిక్సు కలిపి నెమ్మదిగా మయూరి చేత త్రాగిస్తూ సాలోచనగా ఆమె ముఖంలోకి చూశాడు తనే ప్రశ్న వేసినా సమాధానం చెప్పడానికి సుముఖంగా లేదని గ్రహించిన ఉపేంద్ర మౌనంగా దిండ్లు సర్ది పడుకోబెట్టాడు నీరసంగా ఒకసారి కనురెప్పలెత్తి ఉపేంద్ర వంక చూసిన మయూరి కళ్ళు కన్నీటితో నిండిపోతూంటే భారంగా దిండ్లనానుకుని కళ్ళు మూసుకుంది

రాధకు ఫోను చేసి పరిస్థితి వివరించి చెప్పాలని గుమ్మం వైపుగా నాలుగడుగులు

కూలిన ఆశలు

వేశాడో లేదో ఎదురుగా రాధ — ఆమె ముఖంలో ఆందోళన భయం మిళితమై వున్నాయి

''రాధా !'' విస్మయంగా పిలిచాడు

కళ్ళు విప్పార్చుకుని చూస్తున్న రాధ తేలిగ్గా నిట్టూర్చుతూ గుండెలమీద చేయి వేసుకుంది ''అమ్మయ్య ఎంత హడలిపోయానో — ఎన్ని దేవుళ్ళకు మొక్కానో మీకేం తెలుసు !'' సగం నిశ్చింత — సగం నిష్ఠూరత ధ్వనించాయి ఆ గొంతులో

''నీకంతా వివరంగా చెబుతాను రా బయటకువెళ్ళి మాట్లాడుకుందాం !'' అప్పుడు చూసింది రాధ మయూరిని

అంతా విన్న ఆమె మనసు జాలితో నిండిపోయింది ఆమెదగ్గర కూర్చుని కాసేపు మాట్లాడి ఉపేంద్రతో అంది

''రేపు మన యింటికి తీసుకురండి ఆమె కోలుకున్నాక పంపించవచ్చును !'' మయూరి నిర్లిప్తంగా వుండిపోయింది

* * *

ఆ మరునాడు ఉదయమే టాక్సీకోసం వెళ్ళిన ఉపేంద్ర తిరిగి వచ్చేసరికి మయూరి రూమ్‌లో లేదు అటూ ఇటూ చూస్తున్న ఉపేంద్ర చేతిలో నర్సు ఒక కవరుపెట్టి ఆమె వెళ్ళిపోయానని మీతో చెప్పమన్నారు ! అంది దిగ్భ్రాంతి చెందిన ఉపేంద్ర తేరుకుని కవరు చించి చదవడం మొదలుపెట్టాడు

'ఉపేంద్రా ! నన్ను క్షమిస్తావుకదూ నీ మంచితనాన్ని — ఋణ భారాన్ని మోసే శక్తి లేకనే వెళ్ళిపోతున్నాను అడిగే అర్హత లేకపోయినా క్షమించమని ఆశతో అడుగుతున్నాను ఉపేంద్రా ! అదృష్టాన్ని వెతుక్కుంటూ నేను వెళితే ఆ అదృష్టమే నిన్ను వెతుక్కుంటూవచ్చి నీ కృషికి చేయూతనిచ్చి నిలబెట్టి నన్ను అధపాతాళానికి త్రొక్కివేసింది అతి భయంకర పరిస్థితులు నన్ను చుట్టుముట్టాయి ఆ పరిస్థితినుండి నేను తప్పించుకోలేను— నన్నెవరూ తప్పించనూలేరు, ఉపేంద్రా ! నన్ను ఓదార్చగలిగే తల్లిదండ్రులుకూడా నాకు కరువయ్యారు నా తల్లిదండ్రులకి ఒక్కర్తెనీ గారాలపట్టిగా పుట్టి పెరిగాను కష్టమనేది తెలియకుండా గాలిలో మేడలు కట్టుకుంటూ ఊహలకు రెక్కలిచ్చాను ఈనాడు కూలిపోయి బాధలకు తట్టుకోలేక విలవిల్లాడుతున్నాను ఒకప్పుడు నా ప్రతి మాటలోను నీపట్ల చులకన ధ్వనించేది ఇపుడు నా మీద నాకే జాలి కలుగుతూంది చాలా వ్రాశానుకదూ !''

సెలవు

మయూరి

ఆవేదనతో ఉపేంద్ర మనసు విలవిల్లాడింది


నీకు నేను వున్నాను మయూరీ ! నీకు నేను వున్నాను ! అప్పటికపుడే మద్రాసు ప్రయాణమై బ్రాంచాఫీసులో ఆమె అడ్రసు తీసుకుని ఇంటికివెళ్ళాడు

అతిసాధారణమయిన పెంకుటిల్లది ఇంటి చుట్టూ ఖాళీ స్థలం వుంది వెదురు బద్దలతో అల్లిన దడి అవసాన దశలో వుంది రంగులు వెలిసి పోయి — గుంటలు పడిన గచ్చులతో కళావిహీనంగా వుందాయిల్లు నెమ్మదిగా వరండా మెట్లు ఎక్కబోతున్న ఉపేంద్ర చటుక్కున ఆగిపోయాడు ఇంట్లోనుండి పెద్దగా వినిపించే కేకలతోపాటు — వున్నట్టుండి తెరుచుకున్న తలుపుల మధ్యనుండి ఎవరో విసిరేసిన బంతిలా వాకిట్లోకి వచ్చిపడింది మయూరి అంతకంటే వేగంగా శబ్దంతో మూసుకున్నాయి తలుపులు గాలి స్తంభించినట్లుగా వాతావరణమంత నిశ్శబ్దం అలుముకుంది నెమ్మదిగా మోచేతిమీద లేచి — రక్తం చిందే చోట పవిటచెంగుతో అద్దుతూ మూర్తీభవించిన శోకదేవతలా వున్న మయూరి, తన దగ్గర ఎవరో నిలుచున్నట్లయి తలఎత్తి ఉపేంద్రను చూసి నిర్ఘాంతపోయింది నీళ్ళు నిండిన కళ్ళతో ఆమె ముఖంలోకే చూస్తున్న ఉపేంద్ర ఆత్మీయంగా లేవనెత్తాడు అకస్మాత్తుగా ఆత్మీయుడనేవాడు ఎదురుగా వుండేసరికి ఆమెలో దాగిన దుఃఖమంతా విరుచుకుపడింది వెక్కి వెక్కి ఏడుస్తూ ఉపేంద్ర భుజంమీద వాలిపోయింది అతని చేతులు ఆమెని చుట్టి ఓదార్పుగా నిమిరాయి

'మయూరి ! నీ సమస్య ఏమిటో అంతుచిక్కకుండా వుంది చెప్పు — ప్లీజ్ నా చేతనయిన సహాయం చేస్తాను !''

పెద్ద పురుము పురిమినట్లుగా దఢాల్న తెరుచుకున్న తలుపుల మధ్య చంకల క్రింద కర్రల సాయంతో నిలుచున్న ఆతని కళ్ళు అగ్నిగోళాల్లా ప్రజ్వరిల్లుతూంటే తీక్షణంగా మయూరి వంక చూశాడు

''అదేం చెబుతుంది నేను చెబుతాను విను మొగుడు అవిటివాడయి అప్రయోజకుడిగా పడివుంటే ఏ ఆడదయినా ఏం చేయగలుగుతుంది



ధర్మపథం

—బులుసు వేంకటరమణయ్య



భగవద్విశ్వాసం

భగవంతుడు భక్తపరాధీనుడు తన్ను నమ్ముకున్న భక్తులను సర్వ కాల సర్వావస్థలలోనూ రక్షిస్తూనే ఉంటాడు భక్తులు కూడా అన్నిటికీ ఆయిననే నమ్ముకుని ఉండాలి అట్టి భక్తులు రాత్రింబగళ్లు విచక్షణ లేక ఏకాకిగా పర్యటిస్తూ ఉన్నా నిర్భయంగానూ ధైర్యంగానూ ఉంటారు

ఆడిదం సూరకవి విజయనగర ప్రభువులకు ఆశ్రితుడు అయినా ఆర్థికంగా అతనికి శ్రమగానే ఉండేది అతడు దేశ సంచారం చేస్తూ శ్రీమంతుల వల్లా జమీందారులవల్లా సహాయం పొందుతూ కాలం గడిపేవాడు ఒకప్పుడు ఆయన బొబ్బిలి సంస్థానానికి వెళ్లి అక్కడి ప్రభువు రావు రంగారాయనిం వారిని దర్శించాడు విజయనగరం వారికీ బొబ్బిలి వారికీ బద్ధ విరోధం అయినా కవులకు దానితో సంబంధం లేనందున తన్ను రంగారాయనింగారు సత్కరించగలరనే సంకల్పంతోనే సూరకవి ఆయన వద్దకు వెళ్లాడు కాని అలా జరగలేదు ఆ జమీందారు సూరకవి యెదుట విజయనగర ప్రభువును వినరాని దుర్భాషలాడి మనస్సును మిక్కిలి గాయ పరిచాడు ఆత్మాభిమానం ప్రభువుల యెడ భక్తి గల ఆ కవి ఇదిగో! ఇంత అసభ్యంగా ప్రవర్తించిన నీ రాజ్యంలో ఒక క్షణమయినా నిలవకూడదు అని తటాలున లేచి బయలుదేరాడు అప్పటికే సాయంకాలమయింది అంధకారం నలువైపులా వ్యాపించసాగింది

సూర కవి ఆమడ దూరమైనా ప్రయాణం చేస్తేనేగాని బొబ్బిలి రాజ్యపు పొలి మేరను దాట లేడు ఏ రాత్రికయినా దాటి పోయి ప్రక్క గ్రామంలో రాత్రి గడప దలచుకొని అన్నిటికీ శ్రీరాముడే దిక్కని అతన్ని స్మరిస్తూ ప్రయాణం సాగించాడు

బొబ్బిలి జమీందారూ పట్టుదల మనిషే! దారిలో సూర కవిని అంతమొందించడానికి ఆయన నలుగురు బోయ వాళ్లను పంపాడు కొంత రాత్రి గడిచాక వాళ్లు సూర కవిని సమీపించి చుట్టుముట్టారు కాని వాళ్లకు ఆ కవి ముందు హనుమత్సుగ్రీవ లక్ష్మణులతో కూడిన శ్రీరాముడు కానవచ్చాడు వాళ్లకు ఆశ్చర్యంతో పాటు ఎంతో భయం కలిగింది వాళ్లు గడగడ వణుకుతూ ప్రాణాలు దక్కించుకోడానికి పరారి అయ్యారు ఇదంతా గమనిస్తూ ఉన్న సూరకవి నవ్వుకుంటూ రావు రంగారాయని గురించి ఒక పద్యం చెప్పాడు అది యీ సంఘటనకు దృష్టాంతంగా నేటికీ నిలిచి ఉన్నది ఆ పద్యం యిది-

హనుమంతుం డెదుటన్ దివాకరసుతుం డా
చెంత సౌమిత్రియున్
తను సేవింపగ జానకీ విభుడు వాత్సల్యంతో
నిల్పి యిం
పున నన్నెప్పుడు కాచుచుండగను ఈ బోయా
దముల్ కిన్కచే
నను చంపంగలవారె రావు కుల జన్మా!
రంగరాయోత్తమా!

భగవంతుడు తన భక్తులను ఎలా ఉపేక్షించగలడు?

దొరికిన స్నేహాన్నల్లా అంది పుచ్చుకోవడానికే ప్రయత్నిస్తుంది దానికి నీలా అనేకుంది వున్నారు గడప దాటలేని నా అసహాయత అలుసుగా తీసుకుని!'' అతి నీచంగా ఆవేశంగా అరుస్తున్న అతను ఫిట్స్ వచ్చిన వాడిలా నేల మీద కూలిపోయి రోదించసాగాడు మయూరి రెండంగల్లో భర్తను సమీపించి ఉపేంద్ర సాయంతో మంచం మీద చేర్చి రెండు మాత్రలు అతని నోటిలో వేసి దుప్పటి కప్పింది కాస్సేపటికి అతను మత్తులోకి జారిపోయాడు అలసటగా నేలమీద గోడవారగా కూర్చుండిపోయి కళ్లు మూసుకుంది మయూరి భయంకరమైన నిశ్శబ్దంలో మూగవాడిలా నిలబడ్డాడు ఉపేంద్ర

''ఉపేంద్రా!'' చాలసేపటికి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చిన ఏడుపుకి వులిక్కిపడ్డాడు ఉపేంద్ర కళ్లు మూసుకునే చెప్పుకుపోతూంది మయూరి

''చూశావుగా ఇదీ నా జీవితం ఆయన రెండు చేతులా సంపాదించినంతకాలం ముందు చూపనేది లేకుండా కులాసాగా జీవితాన్ని అనుభవించాం స్వర్గ సౌఖ్యాల మధ్య వున్నామనుకునే సమయంలో యాక్సిడెంటు కావడం — ఆయన ఎడమకాలు పూర్తిగా తీసివేయాల్సి రావడంతో మానసికంగా ఆయన బాగా కృంగిపోయారు ఎవరుమాత్రం ఎంతకాలం ఆదుకుంటారు కూర్చుని తింటే కొండలైనా తరుగుతాయన్నట్లుగా వున్న ఆస్తి పెద్ద బంగళా అన్నీ పోగొట్టుకుని ఈనాడు నేను వుద్యోగం చేయకపోతే ఇల్లు గడవని పరిస్థితి వచ్చింది చనిపోతూ నాన్న యిచ్చిన కొద్దిపాటి ఆస్తి మాత్రం పాప చదువు కోసం వుంచాను ఈ పరిస్థితులలో పాపని మా మధ్య వుంచడం మంచిది కాదని గుండె రాయి చేసుకుని హాస్టల్‌లోవుంచి చదివిస్తున్నాను

ఆయన స్వతహాగా మంచివారే నిస్సహాయత ఆయన మానసిక స్థితిని భయంకరంగా మార్చివేసి నన్ను హింసించే స్థితికి దిగజారారు ఇది ఉపేంద్రా! అపరిష్కృతంగా మిగిలిపోయిన నా జీవిత సమస్య

తలవనితలంపుగా నిన్ను కలవడం— ఆ మానేజరు నీవే కావడం ఊహించని పరిస్థితులు జీవితం ఎంత చిత్రమైనది!'' దీర్ఘంగా నిట్టూర్పుతూ ఆవేదనగా ఆగి ఆగి అంది మయూరి

'ఉపేంద్రా! వెళ్ళు వెళ్ళిపో ఉపేంద్రా! ఆయనకి మెలకువ రాకుండా వెళ్ళిపోవడమే నీవు నాకు ఉపకారం చేసినవాడివవుతావు దయచేసి త్వరగా వెళ్ళిపో'' దోసిట్లో ముఖం దాచుకున్న మయూరి కళ్ళు తెరిచి చూసేసరికి బరువుగా నడుస్తూ గేటు దాటి వెళ్ళిపోతున్న ఉపేంద్ర— కన్నీరు నిండిన కళ్ళకు లీలగా కనిపించాడు మయూరి శిలా ప్రతిమే అయింది ★

కొండపాడు 'అమ్మ' ఆశ్రమం ఒక విశాలమైన తోటలో ఉంది.

అందులో అడుగు పెట్టిన నాకు ఏదో దివ్య లోకంలో ఉన్న అనుభూతి కలుగటం మొదలు పెట్టింది.



కొత్త జీవితం ప్రారంభం!!

ఒకే అమ్మ కథ అన్నపూర్ణ



ఎటు చూసినా పువ్వులతో, కాయలతో నిండిన చెట్లు, వింత వింత సవ్వడులు చేస్తున్న పక్షులు, చెట్ల కొమ్మలు రెమ్మలతో దోబూచు లాడుతున్న భానుకిరణ పరంపర!

"తోటలో కొద్దిసేపు నడిచాక అల్లంత దూరంలో 'అమ్మ' ఆశ్రమంతాలూకు కుటీరం కనిపించింది దానిముందొక పెద్ద మండపం చుట్టూ బారులు తీరినట్టు నిలబడివున్న జనసందోహం! భక్తుల మొర ఆలకించి వాళ్ళకు తన ఆశీస్సులను అందిస్తున్నట్లుంది అమ్మ

అది గమనించి ఆతృత అణుచుకోలే మాతో నడుస్తున్న వాళ్ళలో చాలా మంది తవ నడక వేగాన్ని పెంచారు నేను, మా శ్రీమతి చిరంజీవి మాత్రం తాపీగానే అడుగుల వేస్తున్నాం

తీరా దగ్గరికి వెళ్ళి 'అమ్మ' స్థానంలో కూర్చొని వున్న స్త్రీమూర్తిని చూశాక పెద్ద అతిశయోక్తి అనిపించింది నా మట్టుకు నాకు మరి! నిండా ముప్పైఫ సంవత్సరాలు కూడా లే ఓ యువతి 'అమ్మ'గా పేరు పొందటం, ఆ అబలకు వేలాది మంది భక్తి ప్రపత్తులు ప్రద ర్శించి నీరాజనాలర్పించటం— ఏ కోణం నుంచి చూసినా దీనిలో సహజత్వం కనిపించటం లేదు కానీ కళ్ళముందు నమ్మక తప్పటం లేదు

మండపం మధ్యలో వేణుగోపాలస్వామి నిలువెత్తు విగ్రహం, దాని సమీపంలో ఓ చిరు చాపమీద కూర్చొని ఉంది ఆమె ఒకరి తర్వాత ఒకరు 'అమ్మ' దగ్గరికి వెళ్ళి తమ తమ సమస్యలు వినిపించి, అందుకు ఆవిడ చెప్పే సమాధానాలకు తృప్తిపడి ఇవతలికి వచ్చేస్తున్నారు జనం

"జగన్! మన యిద్దరికి పరిచయం ఏర్పడి దాదాపు నాలుగు సంవత్సరాలైంది ఈ పరిచయ కాలంలో జీవితం పట్ల నీ నిరాశావాదాన్ని తెలుసు కున్నాను అలాగే నా మనోగత అభిప్రాయాలు నీకు తెలియ చెప్పాను గ్రహచారాలనూ అదృష్టదురదృష్టాలను నేను నమ్మను చేసే కృషి లభించే ప్రతిఫలం వీట్ని మాత్రమే విశ్వ సిస్తాను అయితే నా శ్రీమతి 'మణి' ఈ విషయంలో నాకు పూర్తిగా వ్యతిరేకం ఏ కష్టం కలిగినా గ్రహచారం చాలలేదనీ ఏ నష్టం వచ్చినా అదృష్టం కలిసిరాలేదనీ వ్యాఖ్యానాలు చేస్తూంటుంది ఆమె

ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం నీకు తెలుసు ఈ మధ్య నాకు అనారోగ్యం చేయటం ఆఫీసుకు శలవుపెట్టి డాక్టర్ల చుట్టూ తిరగటం జబ్బు ఫలాన అని తేల్చి చెప్పకపోయినా డైజేషన్‌లో వచ్చిన లోపమే నా అనారోగ్యానికి మూలమని డాక్టర్లు తేల్చేశారు వాళ్ళ ప్రిస్క్రిప్షన్ ప్రకారమే మందులు వాడుతున్నాను ఐనా వెంటనే సుగుణం కనిపించలేదు దాంతో మా మణి సెంటిమెంట్స్‌కు చేవ వచ్చినట్లైంది

'ఏవండీ, మీరు అదృష్ట దురదృష్టాలను నమ్మరు, గ్రహచారాలను లెఖ్ఖచేయరు మరి మీకు ఈ అనారోగ్యం ఎందుకు చేసింది? సరే, డాక్టర్లు చెప్పిన ప్రకారమే అన్ని మందులూ వాడుతున్నారు కద? ఐనా ఇంకా తగ్గకపోవట మేమిటండీ మీకీ నలతా?' అనడిగింది ఓ రోజు

'తగ్గుతుంది మణీ, నాకు ఆ విశ్వాసం ఉంది కాకపోతే కొంచెం టైమ్ తీసు కొంటుంది అంతే' అన్నాను

'అలానే చెబుతారు మీ విశ్వాసాలకేం గానీండి, ఇప్పటికైనా నా మాట వింటురూ

మనం ఒకసారి ఆ కొండపాడు 'అమ్మ' దగ్గిరికి వెళ్ళివద్దామండీ ఆవిడ నోటి వాక్కు చాలా మంచిదట! అక్కడికి వెళ్తే సంతతిలేనివాళ్ళకు సంతతి కలుగుతుందట మొండి జబ్బులు సైతం అమ్మ దృష్టి పడితే చాలు — ఇట్టే నయమైపోతాయ్‌టండీ!'

మణి అమాయకత్వానికి నవ్వు, కోపం రెండూ వచ్చాయి నాకు

'భేష్! ఐతే మన దేశంలో ప్రజారోగ్యం గురించి ఇన్ని హాస్పటల్స్ ఏర్పాటు చెయ్యటం, ఇంతమంది డాక్టర్లను తయారు చేయటం అనవసరమే పెద్ద పెద్ద డాక్టర్లకుకూడా లొంగని రోగాలను ఇట్టే కుదిర్చివేయగల ఎందరో బాబాలు, అమ్మలు ఉండగా మెడికల్ కాలేజీలనీ, రీసెర్చి ఇనిస్టిట్యూట్‌లనీ పెట్టి — ఎంతో ప్రజా ధనాన్ని దుబారా చేసేస్తోంది ప్రభుత్వం డాక్టర్లను కాకుండా అమ్మలను, బాబాలను, హాస్పిటల్స్‌కు బదులు ఆశ్రమాలను గ్రామ గ్రామాన ఏర్పాటుచేస్తే ప్రజలు పూర్తిగా ఆరోగ్యవంతులైపోరూ? ఈ సత్యాన్ని మన గవర్నమెంట్ గుర్తించినట్లు లేదు పోనీ, నువ్వోక విజ్ఞాపనా పత్రం వ్రాసి పడేసి అందరి కళ్ళూ తెరిపించకూడదూ?' అన్నాను వెటకారంగా

'బాబాలన్నా, అమ్మలన్నా మీకెందుకండీ అంత కసి?'

కసకాదు మణీ, వాళ్ళంటే నాకు జాలి! ప్రపంచంలో వేరేవిధంగా బ్రతకటం చేతకాని కొందరు వంచకులు వేస్తున్న వెర్రి మొర్రి వేషాలే ఈ అవతారమూర్తులు! తెర వెనుక వాళ్ళు సాగించే భాగవతాలు అనేకం ఆ మధ్య కాకినాడలో జరిగినదానికి ఏం చెబుతావ్? కొందరు అమాయక స్త్రీలను నమ్మించి — తన దర్శనం కోరివచ్చిన వాళ్ళను వరుసగా ముద్దు పెట్టుకొని మోక్షం వస్తుంది పొమ్మన్నాట్ట, ఓ బాబాగారు! మరొక యోగి పుంగవుడు పూజలు పునస్కారాల పేరిట చాలా మందినుంచీ బంగారు నగలు తీసుకొని దేవుడిముందు పెట్టి — ఓ రాత్రికి రాత్రి వాటితో ఉడాయించాట్ట పోలీసులు అతడికోసం గాలిస్తున్నారు నువ్వు పేపర్లో చదవలేదూ ఈ వార్తలు? ప్రజలను ప్రలోభాలకు గురిచేసి తాము విలాసవంతంగా బ్రతకటమే అలాంటివాళ్ళ లక్ష్యంగా కనిపిస్తోంది'

'మీరు చెప్పింది నిజమే అలాంటి వార్తలు తరచు పేపర్లో చదువుతూనే ఉన్నాను ఐతే ఎప్పుడో, ఎక్కడో, ఎవరో ఏదో చేశారని అందర్నీ నిందించటాన్ని మాత్రం నేను ఒప్పుకోను కేవలం తాము విలాసంగా బ్రతికితే చాలు అనుకొని తిప్పలుపడేవాళ్ళు అవతారమూర్తులు కారండీ ఎవరైతే సమాజ శ్రేయస్సుకు అంకిత మౌతారో, మానవ సముద్ధరణకు పాటుపడతారో వాళ్లేనండీ నిజమైన అవతారమూర్తులు!

ఒక అమ్మ కథ

కొండపాడు 'అమ్మ'ను నేనూ అంత తేలిగ్గా నమ్మేదాన్ని కాదు కానీ, ప్రక్కింటి బామ్మగారు చెప్పిన కొన్ని కొన్ని నిజాలు నా మనసును అటు వైపు లాగుతున్నాయ్ సంతానం లేక ఎంతో కాలం బాధపడి — చివరికి 'కొండపాడు అమ్మ ఆశ్రమానికి వెళ్ళివచ్చిన తర్వాత కడుపు పండి — బంగారంలాంటి బిడ్డను కన్న స్త్రీ ఎవరో తెలుసాండీ— ఓ ప్రొఫెసర్‌గారి భార్య! మన వీధి చివర మేడలోనే వాళ్లు ఉంటున్నారు కావాలంటే స్వయంగా మీరేవెళ్లి యదార్థం ఏమిటో అడిగి తెలుసుకోండి' అంది మణి ఢంకా బజాయింపుగా దాంతో నాకు పౌరుషం వచ్చింది తనవి ఎంతటి అంధవిశ్వాసాలో ఆమెకు ఆమే తెలుసుకొంటేనేగాని లాభంలేదనిపించి

' యదార్థం తెలియాలంటే వెళ్లి ఒకళ్ళను అడగనక్కరలేదు మణీ! సరే, ఇంతగా చెబుతున్నావ్ నీ మాట ఎందుకు కాదనాలి, అలాగేవెళ్దాం ఆ 'అమ్మ' మహత్తు, అసలు స్వరూపం బయటపెట్టటానికి నేను ఒక్కణ్ణి చాలు' అన్నాను

అలాగే ఆమెతోబాటు బయలుదేరాను నిన్న, ఇక్కడికి రాబోయేముందు మీ ఇంటికి ఒకసారి వచ్చాను తాళం పెట్టిఉంది నీవు హైదరాబాద్ క్యాంపు వెళ్లినట్లు చెప్పారు మీ ఇల్లుగలవాళ్ళు

కొండపాడులో మాతోపాటు చాలామంది బస్‌దిగారు ఎనభైఏళ్ల వయోవృద్ధులు మొదలు ఎనిమిదేళ్ల పసివాడివరకు • అన్నివయసులవాళ్లు ఉన్నారు యువతీ యువకులలో చాలామంది చదువుకున్నవాళ్లు! ఆధునీకరణతో అందవేసినట్లున్నయ్ వాళ్ల వేషభాషలు! వాళ్లందరూ కూడా అమ్మ' దర్శనం కోరి మారుమూల ఉన్న ఈ పల్లెకు పనికట్టుకొని వచ్చారంటే — గొప్ప ఆశ్చర్యంలో మునిగిపోయాను

'అమ్మలో ఏదో ప్రత్యేకత ఉండబట్టేకద ఇంతమందీ వస్తోంది? ఒకవేళ ఆమెను గురించి నేనే పొరబాటుగా అభిప్రాయపడుతున్నానేమో?' అన్న మీమాంస మొదటిసారిగా ఏర్పడింది నాలో అప్పుడు ఐనా పైకి తొణకలేదు నా శ్రీమతి మణి, బాబు ఉదయ్ కూడానే ఉన్నారు నాకు

జనం మధ్యలో నిలబడి అక్కడ జరిగే తంతు చూస్తున్నాను నేను

ఒక పల్లెపడుచు వెళ్ళి 'అమ్మా, మూడు రోజులుగా మా గేదెగొడ్లు కనిపించటంలేదు అది ఎలాపోయిందీ, ఇప్పుడు ఎక్కడ ఉన్నదీ తవరే శలవివ్వాలి' అని మొర పెట్టుకుంది, అమ్మ దగ్గిర

'మీ గేదెగొడ్లు పోతే నాదగ్గిరకెందుకమ్మా రావటం? అవి ఎలా పోయిందీ, ఎక్కడ ఉన్నదీ చెప్పటానికి నాకేం దివ్యదృష్టి లేదమ్మా గొడ్లు కనిపించకుండా పోయాయంటే అందుకు మీ అజాగ్రత్తే కారణం! వెళ్లి శ్రద్ధగా వెతికించు అవే కనిపిస్తయ్' అని చెప్పిందామె

'ఇంతేగామలు ఈవిడిగారి మహత్తు!' అని అనుకున్నాను చులకనగా

వెతికిస్తే కనిపిస్త్యున్నారు గేదెగొడ్లు ఆ మాటేచాలు అవివచ్చి మా ఇంటిముందు ఉన్నట్లే లెఖ్ఖ!' అని తన సంతోషంకొద్దీ వేణుగోపాల స్వామి విగ్రహం ముందు ఏర్పాటు చేసిన హుండీలో తోచిన కానుకలు వేసి వెళ్ళిపోయిందామె

తర్వాత, దాదాపు అరవై సంవత్సరాలుంటయ్ ఓ వృద్ధుడు వెళ్ళి అమ్మ పాదాలను స్పృజించబోయాడు కానీ, ఆవిడ వారించింది, పెద్దవారు, తండ్రిలాంటి మీరు నా పాదాలను తాకాలనుకోవటం భావ్యం కాదండీ ఎవరైనా ఆరాధించవలసిందీ, మ్రొక్కవలసిందీ, భగవంతుడికేనండీ' అంటూ దైవ విగ్రహాన్ని చూపింది

'వయోపరంగా నేను పెద్దవాణ్ణే కావచ్చు కానీ, మానసికంగా నీకంటే చాలా చిన్నవాణ్ణమ్మా జీవంలేని ఆ రాతి బొమ్మకంటే ప్రత్యక్షంగా కళ్ళకు కనిపిస్తూ మాలాంటి దీనుల మొర ఆలకించే నీ పాదాలకు నమస్కరించటం ఉత్తమం కదమ్మా!' అన్నాడు వృద్ధుడు వినమ్రంగా

'అది సరైన అభిప్రాయంకాదండీ ఇప్పుడు ఇంతమందీ వచ్చి అడుగుతున్న అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్పగలుగుతున్నానంటే— ఇందులో నా ప్రజ్ఞ ఏమాత్రం లేదు అంతా భగవదను

రసాయన నూలువస్త్రాల వల్ల చర్మవ్యాధులు!

రసాయన నూలువస్త్రాలు ధరించడం వల్ల చర్మవ్యాధులు ప్రబలుతున్నాయనీ, వీటి నివారణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలనీ జపాన్ గృహిణుల సంఘం ఇటీవల అంతరంగిక వ్యాపార పరిశ్రమల మంత్రిత్వశాఖను అభ్యర్థించింది

బట్టలు వేసుకొన్నప్పుడు ఒళ్లంతా దురదా, దద్దురులూ ప్రారంభమయినట్లు ఇటీవల జరిపిన సర్వేవల్ల తేలింది ఇలా ఫిర్యాదు చేసినవారిలో నూటికి 75 మంది రసాయన నూలు వస్త్రాలు ధరించినవారు, 25 మంది ఉన్ని వస్త్రధారిణులు ఈ సర్వే ఫలితాల దృష్ట్యా, రసాయన నూలు వస్త్రాలు తయారుచేసే కంపెనీలు ఇటువంటి నూలును వాడకుండా చూడాలనీ, ఈ విషయంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలనీ ఆ సంఘం మంత్రిత్వశాఖను కోరింది (జ వా)

గ్రహమే. మీకు గురుశిష్యుల కథ గుర్తులేదూ ? గురువును ధ్యానిస్తూ పెద్ద నదిని సునాయాసంగా దాటగలిగాడు శిష్యుడు. 'నా శిష్యుడికే సాధ్యమైనది నాకెందుకు సాధ్యం కాదు ?' అనుకొని నదిలో దిగి మునిగిపోయాడు, గురువు. శిష్యుడిది భక్తి, ఏకాగ్రత· గురువుది అహంకారం మూర్ఖత్వం ! అలాగే రోజూ నా దగ్గిరికి ఇంతమంది వచ్చిపోతున్నారు, వేనోళ్ల శ్లాఘిస్తున్నారు అని నేను గర్వపడి, లేని ఔన్నత్యాన్ని అంటగట్టుకొంటే చివరికి మిగిలేది ఆత్మవంచనే నండీ' అన్నది. 'ఎంతటి నిగర్వి !' అనిపించింది నాకు.

వృద్ధుడు అమ్మ చెప్పినట్లే వెళ్ళి దైవ విగ్రహానికి నమస్కరించి వచ్చి తన గోడు వినిపించాడు

'... 'నా' అన్న వాళ్లంతా ఇప్పుడు నన్ను హీనాతిహీనంగా చూస్తున్నారమ్మా ' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

'అర్థమైందండీ ప్రస్తుత పరిస్థితి. ఏళ్ళ తరబడి పాలు పితుక్కొని తాగుతాం కదుపారా... కానీ, ఆ పాలు ఇచ్చే గొడ్డు వట్టిపోతే ఎలాగోలా దానిపీడ వదుల్చుకోవాలని చూస్తాం తప్పితే దాన్ని సాకాలని అనుకోం...స్వార్థపూరితులైన కొందరు మనుషులు తమ తమ వాళ్ళ విషయంలో వ్యవహరించేతీరు అలాగే ఉంటుందండీ... ప్రస్తుతం మీకు కరువైంది మనశ్శాంతి. దాన్ని 'పొందగలిగాను' అని అనిపించేటంత వరకు మా ఆశ్రమంలోనే ఉండిపోండి' అంటూ అభయమిచ్చింది వెంటనే. 'అలాగే తల్లీ' అంటూ పరమ సంతోషంతో పక్కకు జరిగాడు వృద్ధుడు

ఆ తర్వాత ఓ నడివయస్కురాలు అమ్మ దగ్గిరికి వెళ్ళింది. ఆమె ప్రక్కనే చిక్కి శల్యమైపోయిన ఓ యువతి ఉంది

'ఈ పిల్ల నా కూతురమ్మా దీని భర్త పోయి ఆర్నెల్లైంది... అప్పట్నుంచీ ఇలా మతి లేకుండా తయారైంది ఎంతోమంది డాక్టర్లు, ఎన్నో మందులు అయ్యాయి. ఐనా ఏ మాత్రం సుగుణం కనిపించటం లేదమ్మా' అంటూ తన గోడు వినిపించింది. అది విన్న అమ్మ చిరు దరహాసం చేసి,

'శరీరానికి జబ్బు చేస్తే డాక్టర్లు, మందులు అవసరం. కాని, మానసికంగా గూడు కట్టుకు పోయిన భయంకర నైరాశ్యం — దాన్ని ఏ మందు రూపుమాపగలదు ? సూక్ష్మంగా ఆలోచిస్తే సమస్యను అనుసరించే ఉంటుందమ్మా పరిష్కార మార్గం. అదేమిటో తెలిసీ సంఘం ఒప్పదనీ, శాస్త్రం అంగీకరించదనీ — ఇటువంటి గుడ్డి సాకులతో దాన్ని ఆచరించటానికి సాహసించం. లేతవయసులోనే భర్తను కోల్పోయిన అభాగ్యురాలు నీ కూతురు. ఆమె వేదన హృద్గతమైనది ! జీవహింస అనేది కేవలం ఒక జీవి ప్రాణం తీయటమేకాదమ్మా. బ్రతికి ఉన్న ప్రాణిని అన్నివిధాల కృంగదీయటం కూడా 'హింసే' అని, అంతటితో ఆగక ఇంత కుంకుమ చేతిలోకి తీసుకొని ఆ యువతి ముఖాన బొట్టు పెట్టింది — అది చూసి ఖంగారు పడిపోయింది నడివయస్కురాలు

'అదేవిటమ్మా, అన్నీ తెలిసిన మీరే ఇలా చేశారు ! భర్తతో పాటే ఆడదాని అన్ని సౌభాగ్యాలు పోతయ్ కద ?' అంటూ సందేహం వ్యక్తం చేసిందికూడా

'అలా అని ఎవరు చెప్పారమ్మా ? వివాహం కాకముందు నీ కూతురుకు భర్త అనబడే వ్యక్తి లేడుకద ? అప్పుడు ఎలా ఉంది ఆమె ?.. భర్త పేరుతో మధ్యలో ప్రవేశించిన వ్యక్తి మధ్యలోనే దాటిపోయాడు. ఐనంత మాత్రాన ?... ఆమె సర్వసౌభాగ్యాలు ఎందుకు తుడిచివేయాలి ? నలుగురి మధ్య హాయిగా తిరుగనీయకుండా ఎందుకు నిర్బంధించాలి ?' — సూటిగా ప్రశ్నించింది అమ్మ.

'. మరి మన శాస్త్రాల మాట ఏమిటమ్మా ?'

'శాస్త్రాలలో ఏం వ్రాసి ఉంది ? వాట్ని నువ్వు చదివావా ?. . లేదు పెద్దలు చెప్పగా విన్నావ్... అనుభవజ్ఞులు చెప్పింది వినవద్దని నేను అనను. కానీ, ఆ చెప్పినదానిలోని మంచీ చెడులను గురించి ఆలోచించటం మనమూ అలవరచుకోవాలి ఈనాటి మన దేశపు వర్తమాన పరిస్థితులు ఏమిటి ? వర్ణవ్యవస్థ రూపుమాసిపోతోంది. కులాంతర — మతాంతర వివాహాలు జరుగుతున్నయ్. ఇక — మనం నమ్ముతున్న శాస్త్రాలు ఈనాటివి కావు. అవి ఒకనాటివి ! ఆనాటి సమాజ శ్రేయస్సు కోసం, సాంఘిక కట్టుబాట్ల కోసం అవి సృష్టించబడ్డాయి.. అలా అని వాటిలో ఔచిత్యం లేదనీ, తిరస్కరించమనీ నేను మూర్ఖంగా సలహా ఇవ్వను. ఎందుకంటే వాట్నే విమర్శించగలిగేంతటి జ్ఞానశక్తి నాకు లేదు. నా ఉద్దేశ్యంలో మన మనసుకు మంచిదిగా తోచిందే శాస్త్రం ! ఒక మనిషి తోటి మనిషిని బ్రతికించటానికి చేసే ప్రయత్నాన్ని ఏ శాస్త్రమూ నివారించదు. నీ కూతురు బ్రతికి బట్టకట్టాలంటే ఆమెలో తిరిగి జీవనానురక్తిని చిగురింపజేయాలి అలా జరగాలంటే కోల్పోయిన సర్వసౌభాగ్యాలనూ ఆమెకు తిరిగి ప్రసాదించాలి. అప్పుడు నీ కూతురికి అనారోగ్యము, నీకు సమస్య ఉండదు.'

'నీ శలవు ఎలా ఉంటే అలా జరిపిస్తాం తల్లీ. నాకు నా కూతురు దక్కాలి. అది కోరుకొంటే రెండో పెళ్ళి చేయటానికైనా నేను సిద్ధమేనమ్మా !' అంది ఆ నడివయస్కురాలు ఓ దృఢనిర్ణయానికి వచ్చినట్లు తల్లి నోటి నుంచీ ఆ మాటలు రావటంతో యువతి ముఖంలో అప్పుడే కొంత వెలుగు వచ్చింది.


ఆ తర్వాత మరికొందరు అమ్మ దగ్గిరికి వెళ్ళారు. జనం కొద్ది కొద్దిగా పలుచబడుతున్నారు. 'పదండి మనమూ వెళ్దాం' అని మణి తొందరపెట్టటంతో నేను ముందుకు నడువబోయాను. ఈలోగా యువతరానికి ప్రతినిధి అనిపించే ఒక కుర్రవాడు వెళ్ళి అమ్మ ముందు కూర్చున్నాడు తాపీగా.

'మిమ్మల్ని చూస్తుంటే మొన్న ఈ మధ్యన నేను చూసిన ఒక పాత సినిమాలో హీరోయిన్ — ఆమె పేరు చంద్రవంక గాముల— నాకు గుర్తు వస్తోంది' అన్నాడతడు

'పోలికలు ఉండవచ్చు. వ్యక్తులం మాత్రం ఒకటేకాము. ఇంతకూ నీవు అడగదలుచుకున్నది?'

'నాలో చాలా కాలంగా కొన్ని ధర్మసందేహాలున్నాయ్. అభ్యంతరం లేకపోతే మీకు ...'

ఆ యువకుడి వైపు అదోలా చూసిన అమ్మ. 'మంచిది తమ్ముడూ! నీ సందేహాలేమిటో బయటపెట్టు. నాకు తెలిసినంతవరకు చెబుతాను' అంది



అమ్మను పరీక్షించటమే తన ధ్యేయంగా పెట్టుకున్నట్లు, 'దేవుడు ఉన్నాడంటారా ?' అనడిగాడు మొదటగా.

'... నా వరకూ చెప్పాలంటే ఉన్నాడు. అదే నీకు 'లేడు' అనిపించవచ్చు. దేవుడు ఉన్నాడా, లేడా అన్న ధర్మ సందేహం మనమన మనసులనుబట్టి కలుగుతూంటుంది తమ్ముడూ ! నిజానికి దేవుడు ఉన్నాడని చెప్పేవాడు త్వరగా నిరూపణ చేయలేడు. ఇక దేవుడు లేడు అని చెప్పేవాడి మాట సత్వరం నెగ్గుతుంది. ఐతే ఆ గెలుపు ఓటములు శాశ్వతంకావు. సూక్ష్మంగా ఆలోచిస్తే దేవుడు లేనిదే ఈ ప్రపంచమే లేదేమో ? మనిషిలోని నీతి న్యాయాలు, మంచి మానవత్వాలు -- ఇవే దైవానికి ప్రతి రూపాలుగా భావిస్తాను నేను. వీటికి మూలస్తంభాలు పాప పుణ్యాలు ! ఈ పాప పుణ్య చింతన మానవుడిలో లోపించిననాడు మనమూ ఉండం, ఈ సభ్య సమాజమూ ఉండదు. మరి ప్రభుత్వము, చట్టాలు ఎంత మందిని, ఎంతకాలమని శిక్షించ గలవ్ ?'

ఆమె వాదనతో అతడూ కొంతవరకు ఏకీభవించినట్లు కనిపించాడు.

'మరి ఈనాడు అవతారమూర్తులుగా పేర్కొనబడుతున్న సత్యసాయిబాబా, మంత్రాలయ రాఘవేంద్రస్వామి, జిల్లెళ్ళమూడి అమ్మ, ముమ్మిడివరం బాలయోగి — వీళ్ళపై మీ అభిప్రాయం ?'

'పేర్లు చెప్పగా విన్నానుగాని వ్యక్తిగతంగా ఆ మహాత్ముల గురించి నాకు తెలియదు. కాబట్టి వాళ్ళను గురించి వ్యాఖ్యానం చేయటం మంచిది కాదు. ఏదైనా ఒక్కటి మాత్రం గుర్తించుకో తమ్ముడూ, ఒక వ్యక్తిలోని ఔన్నత్యం విద్య విజ్ఞానాలవల్ల కావచ్చు, మంచి మానవత్వాలవల్ల కావచ్చు, భక్తి వైరాగ్యాలవల్ల కావచ్చు - ఏవిధంగా ఉన్నతుడైనా ఆ మనిషికి తప్పక గుర్తింపు ఉంటుంది ఈ కర్మభూమిలో.'

'సరే, అదలా పోనీయండి... మరి మీరు చెప్పింది చెప్పినట్లే జరుగుతుందని అంటున్నారు...?'

'నేను చెప్పటం, ఆ చెప్పింది జరగటం — అంతా యాదృచ్ఛికం తమ్ముడూ ! భూత భవిష్యత్ వర్తమాన కాలాలను నిర్దేశించటానికి నేనేం దైవాంశ సంభూతురాలిని కాదు. నాలో దివ్యజ్ఞానం లేదు. మంత్ర తంత్రాలు చేతకావు. కేవలం భగవంతుణ్ణి నమ్ముకొని, ఆ స్వామి చల్లని నీడలో సేదదీరాలనుకొనే అల్ప జీవిని నేను.'

'ఇంతకుముందు మీరు ఒక తాతగారికి గురు శిష్యుల కథ చెప్పారు. దానిలో నీతినిబట్టి 'నేను గొప్ప' అన్న అహం మీకు పనికిరాకపోవచ్చు. అలా అని మీ గొప్పతనాన్ని ఇతరులు గుర్తించటంలో తప్పులేదు కద ?... సరేనమ్మా నా మాటలతో మీ సమయాన్ని వృథా చేయదలుచుకో లేదు. నేను అడగాలనుకున్న మరికొన్ని ప్రశ్నలు అలాగే ఉండిపోయినయ్ ఇంకా.'


'అడుగు తమ్ముడూ.'

'ఈనాడు దేశంలో నాస్తికత్వం పెచ్చుమీరి పోతోంది. 'దేవుడు ఉన్నాడు' అని అనేవాడు అవహేళన పాలౌతున్నాడు. హేతువాది ఐన 'డాక్టర్ కోవూర్,' హిందూ దేవతలను చెప్పులతో కొట్టించిన 'ఇ. వి. రామస్వామి నాయకర్,' భారతీయులు పవిత్రంగా భావించే గోవు మాంసం తిని— మన నమ్మకాలు విలువలేనివని తేల్చిచెప్పి నాస్తికత్వాన్ని ప్రబోధించిన 'గోరా' — వీళ్లనే మంటారు మీరు ? వీరంతా ఇప్పుడు కీర్తిశేషు లనుకోండి.'

'వాళ్లను మనసారా అభినందిస్తాను తమ్ముడూ, నేను. నూటికి తొంభై వంతుల మంది తమకు కష్టాలు వచ్చినప్పుడు దేవుడు లేడనీ, ఏదైనా అదృష్టం కలిసి వచ్చినప్పుడు అంతా భగవదనుగ్రహం అనీ ఇటు ఆస్తికత్వాన్ని విశ్వసించలేక, అటు నాస్తికత్వానికి కట్టుబడలేక ఆత్మ సంఘర్షణతో అనుక్షణం నలిగిపోతూంటారు. అలా కాకుండా తామొక సత్యాన్ని నమ్మి మనసా—వాచా—కర్మణా దానికి అంకితమైపోయిన గొప్పవ్యక్తులు నీవు చెప్పిన ముగ్గురూను. వాళ్లు ఒక సిద్ధాంతానికి అంకితమైపోయి, దానికి జీవం పోయటానికి ప్రయత్నించారేగాని సమాజానికి ఎలాంటి హాని చేయలేదు. సైద్ధాంతికంగా చూస్తే వారిలో నీతి నిజాయితీ, మంచి మానవత్వం ఉన్నాయి. అంటే వాళ్ల హృదయాలలోను భగవంతుడు చోటు చేసుకున్నట్లే. కేవలం ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. దీన్ని ఎవరు విశ్వసించకపోయినా సంతోషమే.'

'నా చివరి సందేహం... మనిషి చనిపోతున్నాడు. చనిపోయిన వ్యక్తిలోంచీ వేరయ్యేది ఒక్క ప్రాణవాయువేనా ?'

'ఇది చాలా జటిల ప్రశ్న తమ్ముడూ ! ఐనా నాకు తెలిసింది చెప్పటానికి ప్రయత్నిస్తాను. మనిషి చనిపోయినప్పుడు అతడి నుంచీ వేరయ్యేది ఒక్క ప్రాణవాయువే ఐతే కృత్రిమంగా ఈనాడు తయారౌతున్న ప్రాణవాయువును దగ్గిర పెట్టుకొని అనంతకాలం బ్రతికే ఉండవచ్చుకద అతడు ? మరి అలా జరగటంలేదేం ? శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. మానవుడు వెళ్లి చంద్రమండలం మీద కాలు పెట్టాడు. టెస్ట్‌ట్యూబ్ బేబీలను సృష్టించి — సృష్టికి ప్రతిసృష్టి అనిపిస్తున్నారు. కొన్ని కోట్లమందిని త్రుటిలో మట్టుబెట్టగల అణ్వాయుధాలను సైతం తయారుచేయగలిగిన మన శాస్త్రజ్ఞులకే 'చనిపోయినప్పుడు మనిషి నుంచీ వేరయ్యేది ఒక్క ప్రాణవాయువే' అన్న విషయంలో స్థిర అభిప్రాయమున్నట్లు లేదు. జీవాత్మ వెళ్లి పరమాత్మలో ఐక్యం చెందటమే మానవ నిర్వాణం అని చెబుతుంది మన వేదాంతం. ఒక్కటి ఆలోచించు బాబూ, తరచు మన పత్రికలలో వచ్చే పునర్జన్మ వార్తలు — అసలు మనిషికి పునర్జన్మ ఎలా సంభవం ఔతోంది ? గత జన్మ జ్ఞాపకాలు తిరిగి అతడిలో ఎలా చోటు చేసుకొంటున్నాయి ? దీన్నిబట్టి ఆలోచిస్తే మనకు బోధపడేది మనిషిలో ఆత్మ ఉందనీ, నిరాకారమైన ఆ ఆత్మే చనిపోయినప్పుడు అతడి నుంచీ



వెరౌతోందనీ—కోర్కెలు తీరని కొన్ని ఆత్మలు మరో దేహంలో ప్రవేశిస్తున్నాయనీ ఇంతేగా మనకు అర్థమయ్యేది ? నేను చెప్పటం కాదు. నువ్వూ ఆలోచించు తమ్ముడూ.'

జగన్ ! అమ్మను నేను అవహేళన చేయాలనుకున్నాను. ఆవిడ అసలు బండారం బయట పెట్టి ముఖ్యంగా మా 'మణి' కళ్ళు తెరిపించాలనుకున్నాను. ఆ ఉద్దేశ్యంతోనే నేను ఇంటి దగ్గర నుంచీ బయలుదేరటం జరిగింది ... ఇప్పుడు నేను ఆవిడను అడగాలనుకున్న తికమక ప్రశ్నలను ఆ యువకుడే అడిగేశాడు. అందుకు ఆమె చెప్పిన నిష్పక్షిక సమాధానాలూ నాకు నచ్చినయ్.

''గేదెగొడ్లు పోవటానికి మీ అజాగ్రత్తే కారణం. వెళ్ళి శ్రద్ధగా వెతికించు'' అని పల్లె పడుచుకు చెప్పినప్పుడు — ఆమె హేతువాది ! వృద్ధుడిపై జాలితో అతడికి తమ ఆశ్రమంలోనే స్థానం కల్పించినప్పుడు— ఆమె మానవతావాది ! వితంతు యువతి ముఖాన కుంకుమదిద్ది, పునర్వివాహానికి సలహా ఇచ్చినప్పుడు— ఆమె సాంఘిక సంస్కర్త ! యువకుడికి తనలో ఎలాంటి గొప్పదనం లేదంటూ మనసు విప్పి సమాధానాలు చెప్పినప్పుడు— ఆమె నిష్కపటి !— ఇలా అభిప్రాయాలు కలిగినయ్ నాకు అమ్మ పైన.

యువకుడు శలవు తీసుకున్న తర్వాత నేను వెళ్ళాను. మణి, ఉదయ్ నన్ను అనుసరించే ఉన్నారు... అమ్మ అడిగిన మీదట నా అనారోగ్యం గురించీ, వాడుతున్న మందులు గురించీ వివరంగా చెప్పాను.

'అలాగా ! వాడే మందులు ఉపశమనం కలిగించటం లేదంటే ఉండే వాతావరణంలో మార్పు తీసుకురావటం అవసరమండీ... ఇష్టపడితే మీ భార్యాభర్తలు, బాబు ఇక్కడే కొద్ది రోజులు ఉండండి... భగవదనుగ్రహం వల్ల మీకు మేలే జరుగుతుంది' అని సలహా ఇచ్చింది ఆవిడ.

'అలాగేనమ్మా'— నాకంటే ముందే అనేసింది మణి. నాకూ అనిపించింది — ఎలాగో ఆఫీసుకు శలవు పెట్టాను కనుక కొద్దిరోజులు ఇక్కడే ఉండిపోవచ్చునని. ముఖ్యంగా ఆశ్రమం చుట్టుప్రక్కల ప్రకృతి— వాతారణం నాకు బాగా నచ్చాయి.

తోటలో ఒక ప్రక్కగా నిర్మించబడిన సత్రంలో మాకొక గది ఇచ్చారు.

సత్రం పెద్దదే. దాదాపు పదిహేను గదుల దాకా ఉన్నయ్. మాలాగా అవసరపడ్డ వాళ్ళకు గది ఇస్తారు. సత్రంలో మకాం చేసేవాళ్ళకు ఉచిత భోజన సదుపాయం ఉంది. అందుకు తగిన సిబ్బంది, నిర్వాహకులు ఉన్నారు. అక్కడ ఎన్ని రోజులు ఉన్నా అద్దె వసూలు చేయరు. ప్రస్తుతం ఆ సత్రంలో మాతోపాటు మరి కొందరు ఉన్నారు. అమ్మ జాలిపడి ఆశ్రయం ఇచ్చిన వృద్ధుడు పరంధామయ్య మా పక్క గదిలోనే ఉంటున్నాడు. కనిపించిన వాళ్ళదరికీ తన దీనగాధ చెప్పకొని కళ్ళనీళ్ళు పెట్టుంటాడు పాపం !

అమ్మ నిగర్వి అనీ, ఎంతో ఉత్తమురాలనీ చెప్పకుంటారు ఇక్కడ అంతా ... కనిపించినప్పుడల్లా 'ఎలా ఉంది మీ ఆరోగ్యం ?' అని పరామర్శిస్తుంది నన్ను. ఆమె కుటీరంలో ఉంటుంది. అక్కడికి ధైర్యం చేసి ఎవరూ వెళ్ళరు అమ్మకు ముఖ్యులైన వాళ్ళు తప్ప.

ప్రాతఃకాలాన లేచి చన్నీటి స్నానం చేయటం మొదలు, రాత్రి పడుకోబోయే ముందు దైవ ప్రార్థన జరపటం వరకు అన్నీ నియమబద్ధంగా జరిగిపోతాయి ఇక్కడ ... ప్రొద్దస్తమానం పడుకుండిపోవటం, సాయంత్రం చల్లగాలికి మణిని, ఉదయ్‌ను తీసుకొని అలా తోటలోనే తిరిగి రావటం చేస్తున్నాను.

జగన్ ! నేనిక్కడికి వచ్చిన తీరు, దరిమిలా జరిగిన సంఘటనలు అన్నీ పూసగుచ్చినట్లు వివరించాను. నాలానే నీకూ ఓ కొత్త అనుభూతి కలుగటం కోసం ఓపిక లేకపోయినా శ్రమ తీసుకొని ఈ ఉత్తరం రాస్తున్నాను. ఒకసారి నువ్వు కూడా వస్తే బావుంటుంది. నీ రాక కోసమే ఎదురు చూస్తూ,

ప్రియమిత్రుడు,
మూర్తి

(ఇంకా వుంది)

"శ్లాబ్ సిస్టమ్ వల్ల ఎంతో మేలు!"- కృష్ణ



తన నట వృత్తిని గౌరవిస్తూ నటుడుగా తన గురుతర బాధ్యతను విజయవంతంగా నెరవేర్చుకుంటూ నిర్మాతలకు సహాయ సహకారాలను అందజేస్తూ అందరి మన్ననలకు పాత్రుడైన హీరో కృష్ణకు చలన చిత్ర నిర్మాణంలో ఎ నుంచి జడ్ వరకు సర్వం తెలుసన్న విషయం పరిశ్రమలో అందరికీ విదితమే



"కంచు కాగడా లో కృష్ణ


శ్లాబ్ సిస్టమ్ అమలులోకి వచ్చినప్పట్నుంచి తెలుగు సినిమా రంగంలో ఏన్నో పరిణామాలు సంభవించాయి చిత్ర నిర్మాణ సంఖ్య మరింత పెరిగింది హీరోలు మరింత బిజీ అయిపోయారు 1985 1986 సం లకు కాల్‌షీట్లు ఇచ్చిన వారున్నారు టాప్ హీరోలను బుక్ చేసిన నిర్మాతల పరిస్థితి మరింత అద్భుతంగా ఉంది ఈ నిర్మాతలకు జిల్లావారీ కొనుగోలుదార్లు వెంటాడుతున్నారు ఈ విషయమై కృష్ణను కదిపితే ఆయన ఎంతో చక్కగా ఇలా విశదీకరించారు

నిజమే భారీ చిత్రాలకే కాదు తక్కువ బడ్జెట్‌లో తీసిన చిత్రాలకు కూడా ఈ శ్లాబ్ సిస్టమ్ బాగుంది భారీ చిత్రం రెండు వారాలు చిన్న చిత్రం నాలుగు వారాలు ఆడితే చాలు-నిర్మాతలు సేఫ్ అవుతారు ఐతే, చిన్న బడ్జెట్ చిత్రంలో కద బాగా వెరైటీగా ఉండాలి మ్యూజిక్ బాగుండాలి చక్కగా ప్లాన్ చేసుకుని, అనుకున్న బడ్జెట్‌ను మించకుండా చూసుకోవాలి అప్పుడే పెద్ద చిత్రాలతో పాటు విడుదలైనా తట్టుకోగలవు"

ఈ పరిస్థితిలో క్వాంటిటీ పెరిగినప్పుడు క్వాలిటీ తగ్గిపోయే ప్రమాదముందదా?

ఉండదు ఏ చిత్రమైనా బాగుంటే ఆడుతుంది అలా కాక కలెక్షన్‌లు తగ్గితే థియేటర్‌లోంచి శ్లాబ్ సిస్టమ్ వల్ల తీసెయ్యక తప్పదు అంచేత నిర్మాతలు దర్శకులు అందరూ అన్ని విషయాలలోనూ మరింత శ్రద్ధ వహించవలసిన అవసరం ఏర్పడింది నా వరకు తీసుకోండి నేను ధరించే పాత్రలు ఒకదానికొకటి ఎక్కడా పొత్తు లేకుండా చూసుకుంటున్నాను పాత్రవ్ చిత్యంలోనే కాక కదా గమనంలో కూడా ఎంతో తేడా ఉండేలా జాగరూకత వహిస్తున్నాను నాలాగే దర్శక నిర్మాతలూ ఎంతో శ్రద్ధ వహిస్తున్నారు హీరో ఇమేజ్‌కి న్యాయం చేయడానికి తగు నైపుణ్యంతో పాత్రలను రూపొందించినా రొటీన్ పాత్రలకు భిన్నంగా ఏదో ప్రత్యేకత తీసుకు రావటానికి రచయితలు కూడా ఎంతో కృషి చేస్తున్నారు అందుకే ఇప్పుడు నేను ఏ చిత్రంలో నటించినా-నటుడిగా ఏదో కొత్త అనుభూతి సంతృప్తి కలుగుతూనే ఉన్నాయి మాస్ హీరోల పరిస్థితే కాక కాస్త పేరు తెచ్చుకున్న వర్ధమాన హీరోల పరిస్థితి కూడా నేడు బాగా మెరుగైంది ఇది వాళ్ళ

"ఉద్దండుడు"లో కృష్ణ, సుమలత



హీరో కృష్ణ నూతన చిత్రావళి

● 'ఉద్దండుడు ఆగస్ట్ విడుదల మహాసంగ్రామం కంచు కాగడా దొంగలు బాబోయ్ దొంగలు అగ్నిపర్వతం నిర్మాణంలో ఉన్నాయి

● ఎ కోదండరామిరెడ్డి దర్శకత్వంలో ఎం ఎస్ రెడ్డి నిర్మించే కౌముదీ పిక్చర్స్ పల్నాటి సింహం చిత్రానికి పరుచూరి సోదరులు చక్రవర్తి వి ఎస్ ఆర్ స్వామి బాస్కరరాజా సలీమ్ తెర వెనుక కృషి చేస్తారు

● ఎడిటర్ కృష్ణ స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో నిర్మాత ఎ శ్రీరామరెడ్డి అక్టోబర్ 11న చిత్రీకరణ మొదలెట్టే శ్రీ అజంతా సినీ ప్రొడక్షన్స్ అందరికంటి మొనగాడు లో జయసుద నాయిక

● దాసరి నారాయణరావు రచన దర్శకత్వంలో దాసరి పద్మ సమర్పించే తారక ప్రభు పిలిమ్స్ చిత్రం సాహసమే నా ఊపిరి

● శోబన్‌బాబు సమర్పిస్తూ కృష్ణతో నటించే కృష్ణ చిత్ర ద్వితీయ చిత్రాన్ని వై హరికృష్ణ నిర్వహణలో తాతినేని రామారావు దర్శకత్వంలో వై అనిల్‌బాబు నిర్మిస్తారు

● పత్రికాకర్త మోహన్‌కుమార్ నిర్వహణలో తయారయ్యే శ్రీకృష్ణ ప్రసన్న పిక్చర్స్ తొలి చిత్రాన్ని కె బాపయ్య దర్శకత్వంలో బి వి ఎస్ ప్రసాద్ నిర్మిస్తారు

● పి జగన్నాదరావు ఘట్టమనేని విజయలక్ష్మి నిర్మించే శ్రీ మూవీస్ తొలి చిత్రానికి ఎ కోదండ రామిరెడ్డి దర్శకుడు

● డి రామానాయుడు నిర్మించే సురేష్ ప్రొడక్షన్స్ చిత్రానికి కె రాఘవేంద్రరావు దర్శకుడు రచన పరుచూరి సోదరులు 'సంగీతం చక్రవర్తి'

● కృష్ణ సమర్పణలో ఉప్పలపాటి సూర్య నారాయణబాబు నిర్మించే పద్మావతీ పిలిమ్స్ లక్ష్మీపుత్రుడు చిత్రానికి ఎ కోదండ రామిరెడ్డి దర్శకుడు రాద సుమలతలు నాయికలు సంగీతం చక్రవర్తి చాయ వి ఎస్ ఆర్ స్వామి సహ దర్శకత్వం కంచర్ల పూర్ణానందం

● జయకృష్ణ నిర్వహణలో కోగంటి కేశవరావు నిర్మించే శ్రీ భ్రమరాంబికా పిలిమ్స్ చిత్రం దొంగగారు

● శ్రీ పద్మావతీ క్రియేషన్స్ తొలి చిత్రాన్ని విజయనిర్మల స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో కె జయ చంద్రారెడ్డి నిర్మిస్తారు సహ నిర్మాతలు ఎస్ శేషాచార్యులు ఎం వి సుబ్బారెడ్డి నిర్వహణ కె శివారెడ్డి సాంకేతిక వర్గం సత్యానంద్ చక్రవర్తి వి ఎస్ ఆర్ స్వామి కోటగిరి గోపాలరావు

● బాపయ్య దర్శకత్వంలో టి వి ఎస్ పిలిమ్స్ నిర్మించే చిత్రంలో కృష్ణతో పాటు శోబన్ బాబు నటిస్తారు

● విజయనిర్మల దర్శకత్వంలో ఎస్ మోషే సమర్పించే శ్రీ విజయరామ పిక్చర్స్ 4వ చిత్రానికి అట్లూరి తులసీదాస్ నిర్మాత మాటలు పరుచూరి సోదరులు సంగీతం చక్రవర్తి

● ఎ కోదండరామిరెడ్డి దర్శకత్వంలో అంగర విజయకమార్ సమర్పించే రాజలక్ష్మీ మూవీస్ తొలి చిత్రానికి అంగర సత్యం నిర్మాత

● లక్ష్మీ మూవీ క్రియేషన్స్ తొలి చిత్రాన్ని డాక్టర్ ఎం ప్రబాకరరెడ్డి కద స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో సిహెచ్ చంద్రశేఖరరెడ్డి పి జె ప్రసాద్ నిర్మిస్తారు నిర్వహణ పి వి శివరామయ్య సమర్పణ ఎ రామచంద్రరావు మాటలు మద్దిపట్ల సూరి సంగీతం సత్యం చాయ సత్తిబాబు పాటలు గోపి కూర్పు మార్తాండ్

● జయప్రద నాయికగా ప్రసూన ఆర్ట్ పిక్చర్స్ తొలి చిత్రాన్ని విజయనిర్మల దర్శకత్వంలో ఎం మల్లికార్జునరావు నిర్మిస్తారు నిర్వహణ ఎస్ బావనారాయణ

● శ్రీ బాలాజీ కంబైన్స్ ద్వితీయ చిత్రాన్ని ఎ కోదండరామిరెడ్డి స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో బి హెచ్ అజయ్ కుమార్ నిర్మిస్తారు కద మాటలు పరుచూరి సోదరులు సంగీతం చక్రవర్తి

● విజయనిర్మల దర్శకత్వంలో కోగంటి విశ్వేశ్వరరావు నిర్మించే చిత్రం

● పి చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో ఎన్ వి సుబ్బరాజు నిర్మించే శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్ ఉగ్రవాది

● శ్రీ సాయిబాబా మూవీస్ ద్వితీయ చిత్రాన్ని కె బాపయ్య దర్శకత్వంలో వెంకట్రావు నిర్మిస్తారు

● గుత్తికొండ వెంకటరత్నం సమర్పించే దేవీ కళామందిర్ కల్లోలం చిత్రాన్ని విజయనిర్మల దర్శకత్వంలో కె నాగేశ్వరరావు నిర్మిస్తారు నిర్వహణ సతీష్

● జయప్రద నాయికగా బారతిరాజా దర్శకత్వంలో చుక్కపల్లి వేణుబాబు నీల్‌కంఠ్ నిర్మించే పవన్ ప్రొడక్షన్స్ చిత్రానికి ఇళయరాజా సంగీత దర్శకుడు

● కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో పెమ్మసాని జనార్ధనం జి విజయలక్ష్మి నిర్మించే చిత్రం ఎస్ ఎస్ రవిచంద్ర దర్శకత్వంలో యలమాటి సత్యనారాయణ నిర్మించే శుబోదయా మూవీస్ తొలి చిత్రం రవిచిత్ర పిలిమ్స్ వై వి రావ్ నిర్మించే చిత్రం శ్రీదేవి నాయికగా కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో టి త్రివిక్రమ రావు నిర్మించే చిత్రం మురళీ మోహన్ సమర్పించే జయభేరీ ఆర్ట్స్ చిత్రం ఎస్ ఎ చంద్రశేఖర్ దర్శకత్వంలో గురుపాదం నిర్మించే చిత్రం వగైరా

బవిష్యత్తుకు పూల బాటే కదా?

మన తెలుగులో అప్పుడప్పుడూ డబుల్ హీరోల చిత్రాలు అవసరమా?

అప్పుడప్పుడూ అవసరమే అది కూడా ఓ వెరైటీ కదా? శోబన్‌బాబు, నేను 'గూడచారి' చిత్రం నుంచి ఆప్తమిత్రులం మేమిద్దరం కలసి నటించిన తొమ్మిది చిత్రాలు విజయవంతమయ్యాయి ఇద్దరం కలిసి నటిస్తున్నప్పుడు నటనాపరంగా మా శక్తినంతా వినియోగిస్తాం 1987లోపున ఏటా ఒక చిత్రంగా మూడు చిత్రాల్లో కలిసి నటిస్తాం

తెలుగు చలన చిత్ర పరిశ్రమ మూడు పువ్వులూ ఆరు కాయలుగా సదా కళ కళలాడుతూండాలనేదే కృష్ణ ఆశయం (జి. వి. జి.)

రాధ, సత్యనారాయణ, పద్మనాభం కాకినాడశ్యామల, కృష్ణ దొంగలు బాబోయ్ దొంగలు





"అభిమన్యుడు"లో శోభన్‌బాబు, స్మిత

సినిమా విశేషాలు

—జి వి జి

అబిమన్యుని విడిపించిన తార!

రౌడీతో గొడవ పడుతున్న అబిమన్యుని పోలీసులు పట్టుకుని స్టేషన్‌కి తీసుకుపోతుంటారు ఇంతలో తార అక్కడకు వచ్చి అబిని విడిపించి తన కారులో ఎక్కించుకుంటుంది కారు స్పీడుగా పోతుంటుంది

తార కారెలా వుంది ?

అబి బాగానే వుంది



అల్లు రామలింగయ, సుత్తివేలు, "రుస్తుం"

తార మరి నే బాగలేనా ?

అబి మీరూ బాగానే వున్నారు కారే కొంచెం ఇరుగ్గావుంది

తార ఇరుగ్గావుంటేనే నాకు చాలా యిష్టం

అబి అహ టాప్‌లెస్ అంటే మీకు యిష్టమా ?

తార ఏం మీకిష్టం కాదా!

అబి అహ నడి వేసవిలో టాప్‌లెస్‌లో టాప్‌లెస్‌గా పోతూ వుంటే

తార ఏముంది ఉష్ణం ఉష్ణం శీతలం అన్నారు

అబి అబ్బో మీకు శాస్త్రాలు కూడా తెలుసు

తార ఆ మా ఒట్టి గొడ్డు నాకు నేర్పింది అదొక్కటే

అబి యిబ్బందిగా పిలవుతూ నన్ను దింపండి వెళ్ళి పోతాను . అంటాడు-

తార : ఎక్కించుకుంది... దింపెయ్యడానికి కాదు- మా యింటికి వచ్చి తీరాలి- అంటూ కారు స్పీడుగా యింటి వైపు పోనిస్తుంది.

"ఎదురులేని మొనగాళ్ళు"లో సుదర్శన్, విజయచాముండేశ్వరి



ఏమీ చెయ్య లేని అబి అలా కూర్చుండి పోతాడు

ఈ పై సన్నివేశం అబిమన్యుడు చిత్రంలోనిది అబిమన్యుడుగా శోబన్‌బాబు తారగా స్మిత నటించారు

హిందీలో తెలుగు చిత్రాలు

కె రాఘవేంద్రరావు దర్శకత్వంలో రోజా ఎంటర్‌ప్రైసెస్ వారు హిందీలో నిర్మించే బావా మరదళ్ళు చిత్రం షూటింగ్ జులై 14న హైదరాబాద్‌లోని పద్మాలయా స్టూడియోస్‌లో ప్రారంభమైంది జితేంద్ర శ్రీదేవి నాయకా నాయికలు బప్పీలహరి సంగీతం కె ఎస్ ప్రకాష్ ఛాయతో

ఎం అర్జునరాజు సమర్పించే ఈ చిత్రానికి వి కనకరాజు నిర్మాత

కె బాపయ్య దర్శకత్వంలో కనకదుర్గా ఆర్ట్స్ ప్రొడక్షన్స్ అధినేత చింతపల్లి ప్రసాద్ హిందీలో నిర్మించే మని షకో చరిత్ర షూటింగ్ ఆగస్ట్ నుంచి హైదరాబాద్‌లో జరుగుతుంది

రామాయణంలో భాగవతం లో ప్రియ పూర్వ గాథ

రాంబాబు (చంద్రమోహన్) రామకృష్ణ (గొల్లపూడి) గదిలోకి ప్రవేశించగానే నమస్తే జీ! అంది ప్రియ (భానుప్రియ)

నమస్కారమమ్మా అన్నాడు రామకృష్ణ

అచ్చా! తెలుగుదేశం! ప్రియ నవ్వింది కూర్చోండి మీ ఇద్దరిలో నన్ను డబ్బిచ్చి కొనుక్కుంటున్నదెవరు? ఎగ్గా?

లేదమ్మా ఒక ఆడపిల్లతో దేవుడు ఇలా ఆడుకుంటున్నాడు కదా అని

ఇలాంటి చోటుకొచ్చి వేదాంతాలు మాట్లాడుతున్నారే?

రాంబాబు నిశితంగా చూస్తూ మీ పేరేంటి? అన్నాడు

ప్రియ నిట్టూర్చింది కళ మాల రాజీ బుజ్జీ పిజ్జీ సంధ్య బిందియా ఇలా ఒక్కో రోజు ఒక్కో పేరు

రామకృష్ణ గొంతు సవరించుకుని చూడమ్మా నీ వ్యాపారంలో నీకు చాలా పేర్లు ఉండొచ్చు కాని మీ అమ్మా నాన్నా నీకు పేరు పెట్టుంటారే అదేమిటి? అడిగాడు

మా అమ్మ పెట్టిన పేరు ప్రియ


మరి మీ నాన్న ? రాంబాబు ఆతృతతో అడిగాడు

ప్రియ కళ్ళు చెమ్మగిల్లాయి నేను మా అమ్మకి పెళ్ళి కాకుండానే పుట్టిన బిడ్డను కాబట్టి నాన్న వివరాలు నాకు తెలియవు మా అమ్మ పేరు మంగళా దేవి మంచి కుటుంబంలోనే పుట్టింది ఒక లాయరు మాయలో పడి సర్వస్వమూ కోల్పోయింది అతనితో మా అమ్మ తీసుకున్న ఫోటో పట్టుకుని ఊరూరా తిరిగాను

ఆ ఫోటో చూపిస్తావా? అని రామకృష్ణ అడిగాడు

ప్రియ ఫోటో తెచ్చి చూపించింది అందులోని వ్యక్తి జస్టిస్ శివసుబ్రహ్మణ్యంను చూసి రామకృష్ణ రాంబాబు నిర్ఘాంతపోయారు

తాతినేని ప్రసాద్ దర్శకత్వంలో రజని సరోజని నిర్మించే లక్ష్మీదుర్గా ఫిలిమ్స్ రామాయణంలో భాగవతం చిత్రానికి సి ఆర్ ఆర్ ప్రసాద్ ఎం రామకృష్ణ నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు



రామాయణంలో భాగవతం లో చంద్రమోహన్ భానుప్రియ

సినిమా

మురళీమోహన్ సమర్పణలో మూడు చిత్రాలు

ఆగస్టు 1న డిసెంబర్ 11న జనవరి 14న జయభేరీ ఆర్ట్ ప్రొడక్షన్స్ వారి మూడు చిత్రాలకు ప్రారంభోత్సవాలు జరుగుతాయి అన్నారు మురళీ మోహన్ ఆగస్టు సెప్టెంబర్‌లలో 1 15 తేదీల మధ్య జరిగే రెండు షెడ్యూల్స్‌తో పూర్తయ్యే కుటుంబ గౌరవం లో మురళీమోహన్ విజయ శాంతి సత్యనారాయణ రావుగోపాలరావు గిరి బాబు నూతన్‌ప్రసాద్ అన్నపూర్ణ దేవి వగైరా తారాగణం ఇది ఈ సంస్థ ఐదవ చిత్రం డిసెంబర్ 11న చిత్రీకరణ మొదలయ్యే ఆరవ చిత్రంలో మురళీ మోహన్ జయసుధ నాయకా నాయికలు జనవరి 14న ప్రారంభమయ్యే ఏడవ చిత్రంలో శోభన్ బాబు మురళీమోహన్ చంద్రమోహన్ నాయకులు సత్యనారాయణ ప్రభాకరరెడ్డి గిరిబాబు సుహాసినితో పాటు మరో కథానాయిక పాల్గొంటారు మార్చిలో విడుదలవుతుంది పై మూడు చిత్రాలనూ చక్రవర్తి సంగీతం కె ఎస్ హరి ఛాయ డి రాజగోపాల్ కూర్పు కిశోర్ నిర్వహణ రాజాచంద్ర దర్శకత్వంలో మాగంటి వెంకటేశ్వర రావు నిర్మిస్తారు



అమెరికాలో ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాలి - మీ సినిమా కొంత భాగం అక్కడ చిత్రీకరించండి - నిర్మాతగారూ !

లక్ష్మి చిత్ర హరికృష్ణ సమర్పించే రెండు చిత్రాలు

కృష్ణచిత్ర బానర్‌లో వై అనిల్‌బాబు నిర్మించే వందేమాతరం చిత్రం షూటింగ్ ఆగస్టులో మొదలవుతుంది బి నాగేశ్వర రావు కథ మాటలు సమకూర్చారు ఎ నారాయణరెడ్డి దీపక్ వేటూరి గీతాలకు చక్రవర్తి బాణీలు కూర్చారు

అక్టోబర్‌లో అంకురార్పణ జరిగే శ్రీనికేతన్ వారి దేవాలయం చిత్రాన్ని శోభన్‌బాబు విజయశాంతి జంటతో శ్రీమతి లక్ష్మి నిర్మిస్తారు మోదుకూరి జాన్సన్ స్క్రిప్టు తయారు చేస్తున్నారు

పై రెండు చిత్రాలకూ నేటి భారతం ఖ్యాతి కృష్ణ దర్శకుడు

"ఇద్దరు మోసగాళ్ళు

మురళీ రాధ స్మిత మనోరమతో పాటు ప్రముఖ తమిళ దర్శక రచయిత విశు ఒక తమాషా పాత్రను ధరించారు అన్నారు అర్చన క్రియేషన్స్ అధినేత జాస్తి జగన్మోహనరావు ఈయన నిర్మించే పై చిత్రానికి శ్రీ చందర్ మాటలు రాశారు అప్పలాచార్య డాక్టర్ నెల్లుట్ల వేటూరి పాటలు రాశారు విజయభాస్కర్ సంగీతం బాబు ఛాయతో ఎస్ పి ముత్తురామన్ దర్శకుడు

మంగమ్మగారి మనుమడు లో బాలకృష్ణ, సుహాసిని





"భారతంలో శంఖారావం" కృష్ణంరాజు, జయసుధ, రాజేష్

"స్వాతి"లో ధీమతి

ప్రసూన (సంయుక్త) చాలా తీక్షణంగా చింతిస్తోంది. సరస్వతి (శారద) ముఖం చేతుల్లో కప్పుకుని ఏడుస్తోంది. ఆ గదిలోకొచ్చిన స్వాతి (సుహాసిని) "ఏమిటి! ఏమైందమ్మా?" అంది.

సరస్వతి కంగారుగా కళ్ళు తుడుచుకుని, "ఏం లేదు. ఏం లేదే! నీకు అన్ని ఆరాలు కావాలి. మీ నాన్నొచ్చే టైమైంది. ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళండి. వెళ్ళండి ముందు!" అంది.

"ఓహో" అంటూ స్వాతి ఒక్కడుగు ముందుకు వేసి, "ఏం ప్రసూనా! దీపం లేని గర్భ గుడిలో రూపం లేని దేవుడు.... కళ్ళుండి చూడడు. నోరుండి పలకడు. ఎవడు వాడు?" అడిగింది.

"కడుపులో బిడ్డ," అంది ప్రసూన తగ్గు స్థాయిలో.

"ఇప్పుడదేగా నీ సమస్య?"

స్వాతికి తెలిసిపోయిందని ప్రసూన బావురుమనేసరికి "దాన్ని ఎందుకే ఎడ్పిస్తావ్? ఒక పక్క గుండెలెండిపోయి నేను చస్తూంటే నీకు ఆటలుగా ఉందా?" అంది సరస్వతి

"ఔనమ్మా. ఆటగా ప్రసూన ఆడుతున్నప్పుడంతా ముద్దు చేశావు అప్పుడు గుండెలెండి పోతే ఎవరి తప్పు? నాన్నొచ్చాక జరిగిందంతా చెప్పి, ఆయన సలహా తీసుకో," అంది స్వాతి

ప్రసూన దిగాలుగా చూసింది "అమ్మో! డాడీ ఏం చేస్తారో నాకు తెలుసు. నరికి పారేస్తారు. డాడీకి చెప్పొద్దు మమ్మీ! ప్లీస్, మమ్మీ! చెప్పొద్దు."

"మరి ఇప్పుడేం చేద్దామని?" స్వాతి అడిగింది

"నేను చచ్చిపోతాను." ప్రసూన తల వంచుకుంది

"అబ్బో! చాలా ధైర్యవంతురాలివే! చావడానికి చాలినంత ధైర్యముంటే, ఇంత పిరికి పని ఎందుకు చేశావు? ఎవడు వాడు?"

"కపిల్‌దేవ్"

"అంటే – పార్కులో పొడుపు కథలు, పందేలు . ఓహో! వాడి అడ్రసియ్యి"

"నీకెందుకు?"

"జుట్టు పట్టుకు లాక్కొచ్చి, నీకిచ్చి పెళ్ళి చెయ్యడానికి"

"డాడీకి చెప్పేస్తావా?"

"ఇప్పుడు చెప్పను కాస్త నింపాది మీద చెప్తాను. అదంతా నాకొదిలేయ్. ముందు అడ్రసియ్యి అక్క చెల్లెళ్ళిద్దరూ ఇరుగు పొరుగునే ఉండే – రెండు కళ్ళు. ఏడిస్తే రెండు కళ్ళలోనూ నీళ్ళు వస్తాయి, ప్రసూనా!"

"అక్కా!" కృతజ్ఞతతో స్వాతిని వాటేసుకుంది ప్రసూన సరస్వతి బరువుగా నిశ్వాస వదిలింది

క్రాంతి చిత్ర వారి "స్వాతి" చిత్రానికి క్రాంతి కుమార్ దర్శక నిర్మాత ★



వ్యక్తిగతం



శ్రీమతి జెరాల్డిన్ ఫెర్రారో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న మొట్ట మొదటి మహిళ. డెమోక్రాటిక్ పార్టీ టిక్కెట్ పై అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న శ్రీ మాండేల్ తమతో పాటు పని చేసే ఉపాధ్యక్ష పదవికి ఈమెని ఎంపిక చేశారు. వృత్తి రీత్యా న్యాయవాది అయిన ఈమె 1978లో మొట్టమొదటిసారిగా ప్రతినిధుల సభకి ఎన్నికై డెమోక్రాటిక్ పార్టీ 'రైజింగ్‌సన్'గా పేరు తెచ్చుకున్నారు. ఇటాలియన్ జాతి రోమన్ కాథలిక్ వంశానికి చెందిన ఈమె అణ్వాయుధ పోటీకి, జాతి విచక్షణకి వ్యతిరేకి. రాబోయే అమెరికా అధ్యక్షునిపై అణు యుద్ధ ప్రమాదాన్ని నివారించ వలసిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. అమెరికాలో స్త్రీల సమస్యల పరిష్కారానికి, సమాన హక్కుల సాధనకి ఈమె బాగా కృషి చేశారు. తమ తల్లిమీద ఉన్న గౌరవంతో ఆమె తమ పుట్టింటి పేరుని మార్చుకోలేదు. భర్త స్థిరాస్తుల వ్యాపారి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు........



ఢిల్లీలో రమేష్‌నగర్ లోని సుదర్శన్ మల్‌హోత్రా ఇంటికి ఇద్దరు వ్యక్తులు వెళ్లి ఆయన మొదటి భార్య, నలుగురు పిల్లల తల్లి అయిన అంజుమల్‌హోత్రా(35)ని తలుపు తెరవగానే గొంతు కోసి చంపేశారు. రెండో భార్య స్వీటీ (21)ని కొట్టి ఒక గదిలో బంధించి ఒక విడియో కాసెట్ రికార్డర్‌ని, ఓ కాసెట్ రికార్డర్‌ని, బట్టలు ఉన్న ఒక సూట్‌కేస్‌ని ఎత్తుకుపోవటానికి విఫల ప్రయత్నం చేసి పారి పోయారు. వాళ్ళు వదిలి వెళ్లిన ఒక చిన్న డైరీలాంటి పుస్తకంలో మల్‌హోత్రా ఇంటి టెలిఫోన్ నెంబరు గురుముఖి లిపిలో రాసి ఉందట. ఈ దుండగులు దొంగతనం చెయ్యడానికి వచ్చినట్లు కనిపించడంలేదని, అంజు మల్‌హోత్రా హత్యకి మరేదో కారణం ఉండి ఉంటుందని పోలీసులు అంటున్నారు. సుదర్శన్ మల్‌హోత్రా ఏడాది క్రితమే స్వీటీని పెళ్లి చేసుకున్నాడట సవతులిద్దరూ ఎలాంటి మనస్పర్థలూ లేకుండా ఒకే ఇంట్లో ఉంటు న్నారట.......

వారఫలం

31-8-1984 శుక్రవారం మొదలు 6-9-1984 గురువారం వరకు

★ **మేషం :** అన్ని గ్రహాలు కాకపోయినా ముఖ్య గ్రహాలు బలవత్తరమైనవి ఒకటి రెండు మీకు అనుకూలదాయకములు ఆరోగ్య భాగ్యాదులందు మంచి 'ఊపు'నివ్వగలరు గృహ సంబంధ చిక్కులు తొలగిపోనున్నవి స్త్రీలకు యత్న కార్య సిద్ధి, ద్రవ్యాదాయం కళారంగాన సదవకాశాలు లభ్యం కాగలవు

★ **వృషభం :** అన్ని విధాలా అనుకూల వారమే విద్యాభివృద్ధియందు చెప్పదగిన అనుకూలమున్నది దూర ప్రయాణానుకూలత చెప్పదగిన అంశం ముఖ్యమైన గృహ విషయం ఏదో పరిష్కరింపబడనున్నది ఉన్నత విద్యకు ప్రాకుడు వారికి సదవకాశములున్నవి స్త్రీలకు ఇష్టబంధువులు యింటికి రాగలరు, శుభ కార్య ప్రస్తావనలున్నవి, గ్రహించాలి

★ **మిధునం :** వ్యాపారమందు అభివృద్ధి చెప్పదగిన సమయం క్రమంగా వ్యవహార చిక్కులు తొలగిపోనున్నవి వస్తు వాహన సేకరణకు అనుకూలత, మిత్ర వర్గానుకూలత, ప్రయాణానుకూలత చెప్పదగిన అంశాలు స్త్రీలకు విలువగల వస్తు సేకరణకు అవకాశంగల వారం, గ్రహించి శ్రమించండి

★ **కర్కాటకం :** ఎట్టి పరిస్థితులందును మీకు అపకారం జరుగదు కాని అలాంటి పరిస్థితులున్నవి మీ తాలూకు వస్తువులు ఎక్కడనో పోయే అవకాశమున్నది వృత్తియందు పెంపు చెప్పదగిన ముఖ్యాంశం పత్రికా రంగం మీకు సంబంధించినదైతే మేలు జరుగనున్నది స్త్రీలకు వృత్తియందు పెంపు, అప్రయత్న ధనాదాయం

★ **సింహం :** వ్యవహార రీత్యా అనుకూలమనీ, రాజకీయంగా మేలు జరుగనున్నదని, బంధు మిత్రుల వలన ఆనందం, కుటుంబానందానికి అవకాశమున్నదనీ చెప్పనైన వారం స్త్రీలకు వ్యవహార విజయం, ఆశించిన ద్రవ్యం అందటం సంభవం

★ **కన్య :** గ్రహించండి, మీరు చేసే వృత్తియందు ఏదో మార్పు రానున్నది మీ ఆలోచనలు సుకరంగా సత్ఫలదాయకాలు కాగలవు కొందరు స్వగృహయత్నం చేస్తారు కొందరకు అనుకోకుండా దూర ప్రయాణమో, విదేశ ప్రయాణమో తటస్థించగలదని గ్రహించాలి స్త్రీలకు వస్తు వాహన సేకరణకు, శుభ కార్యం జరుగుటకు అవకాశం గల వారం

★ **తుల :** 'శని' భగవానుని ధాటికి తట్టుకోలేకపోతారు చాలమందికి ఔషధ సేవ అవశ్యకమవుతుంది కొందరి విషయంలో 'ఆపరేషన్' కూడా చెప్పదగిన అంశం గ్రంథ ప్రకటనకర్తలకు, పత్రికా రచన యందు నిమగ్నులయిన వారికి మేలు చేకూరుతుంది స్త్రీలకు అపనిందలు, నిష్ఠూరాలు, స్వల్పాదాయంతో వారం గడచిపోతుంది

★ **వృశ్చికం :** క్రమంగా మీ ఆశయాలు ఫలింపగల కాలం సమీకరించింది మీతో భాగస్వాములుగా వ్యాపారం చేసే వారిని జాగ్రత్తగా కనిపెట్టియుండటం చెప్పదగిన అంశం 'జాయింటు' వ్యాపారంలో మెలుకువ అవసరం, మీరు గావించే ఉద్యోగ యత్నాలు వారాంతంలో ఫలిస్తాయి స్త్రీలకు కొందరకు 'ప్రమోషన్' లభించగలదు కుటుంబ బాధ్యతలు కొందరను పట్టి చూస్తాయి

★ **ధనుస్సు :** విద్యా, వైజ్ఞానిక రంగాలలో అభివృద్ధి, ద్రవ్యాదాయం, గృహ సంబంధంగా చిక్కులు నివృత్తి కాగలవు అవకాశవాదులను దాపునకు రానీయకండి మీ కాలం వ్యయ పరచే వారు తగులుతారు, జాగ్రత్త! చాల కాలంగా రాని ద్రవ్యం యత్నిస్తే ఈ వారం అందుతుంది స్త్రీలకు కుటుంబానందం, ఆదాయం, వృత్తియందభివృద్ధి


★ **మకరం:** దూర బంధువులు ఇంటికి రానున్నారు నూతనాంశాలు గ్రహిస్తారు శుభ కార్య ప్రస్తావనలందు తర్జన భర్జనలుంటాయి వ్యవహార రీత్యా అననుకూలత సంభవం చేయి దాటిపోయిన ద్రవ్యం అందటం కష్టం స్త్రీలకు మనోవ్యాకులం, ధనాభావం, చికాకులు

★ **కుంభం :** గనులందు, కర్మాగారాలందు, నాటక రంగ, చలన చిత్ర రంగమందు నిరంతర కృషి చేసే వారికి బాగా అనుకూలించే వారం కుటుంబానందం, సుఖ జీవితానికి ఆక్షేపణ లేదు కృషి ఫలిస్తుంది స్త్రీలకు గృహ నిర్మాణ కార్యక్రమమందు నిమగ్నత, విలువగల వస్తు సేకరణకు అవకాశం, మిత్ర సహాయం

★ **మీనం :** ఆదాయమున్నది, అప్రయత్నంగా కార్యానుకూలత, అవసరాలు తీరుట, విలువగల వస్తు సేకరణకు అవకాశం లభించగలదు ఉద్యోగ రీత్యా కోరుకున్న 'ట్రాన్స్ఫర్లు' లభ్యం కావటం కొందరి విషయంలో చెప్ప వచ్చు స్త్రీలకు రాజకీయంగా మేలున్నది, విద్యా విషయంగా పెంపు సంభవం అప్రయత్నాదాయం కూడా లభ్యమే

—విద్వాన్ కోట సత్య రంగయ్య శాస్త్రి

పిల్లల దేవుడు మల్లేశ్వర స్వామి



మల్లేశ్వర స్వామి ఆలయం

గుంటూరు నుండి విజయవాడ మార్గంలో 5 కి.మీ. వెళితే పెదకాకాని గ్రామం వస్తుంది. అక్కడ పిల్లల దేవుడుగా పొంగళ్ళ స్వామిగా ప్రసిద్ధిచెందిన మల్లేశ్వరస్వామిని దర్శించుకొనవచ్చును.

చరిత్ర

శ్రీకృష్ణదేవరాయలు యాత్రా సమయంలో, 1415 సం.లో చిట్టురుసుమంత్రి 'శివలింగ' ప్రతిష్ఠ చేశాడు. దాదాపు ఐదు వందల సంవత్సరాల తర్వాత 1911 సం.లో కొల్లిపర వెంకటరత్నం అనే భక్తుడు లింగాన్ని పునఃప్రతిష్ఠించి దేవాలయం నిర్మించారు. ఇంకా పార్వతీదేవి, వీరభద్రుడు, భద్రకాళి విగ్రహాలను ప్రతిష్ఠించాడు. స్వామివారి నిత్య నైవేద్యం నిమిత్తం 18 ఎకరాల మాగాణి ఏర్పరచాడు. ప్రస్తుతం ఎండోమెంటుశాఖ ఆలయ కార్యక్రమాలు చూస్తోంది.

సహజంగ శివునికి సోమవారం ప్రీతికరమైనదంటారు. కాని అక్కడ ఆదివారం ప్రత్యేక పర్వదినం. ఏడిరోజులలో వేయిమంది, ఆదివారం నాడు 30 నుండి 40 వేలవరకు యాత్రీకులు ప్రభలతో సహా వచ్చి 'పొంగళ్ళు' పొంగించుకుంటారు.

ప్రత్యేకతలు

సంతానలేమిచే అనేకమంది వైద్యులనుసంప్రదించి, విదేశీ ఔషధములు కూడా తిని నిస్పృహ, నిరాశ చెందిన దంపతులు ప్రతిరోజు 108 చొ॥న ఒక మండలంపాటు గుడికి ప్రదక్షిణచేస్తే తప్పక సంతానం కలుగుతుందని ఆసి...గట్టి నమ్మకం.

గుడి ఆవరణలో ప్రవేశించగనే...డివైపు చిన్న 'గిలకబావి' దగ్గర యాత్రీకులు స్నానం చేసి ఆ తర్వాత స్వామిని దర్శించుకుంటారు. అది 'యజ్ఞాల బావి'గా ప్రసిద్ధి చెందింది. పొంగలి పొంగకపోతే ఆ బావిలో నీరు కొంచెం పోస్తేసరి, వెంటనే పొంగుతుంది! వివిధ వ్యాధిగ్రస్థులు ఆ బావి దగ్గర నిత్యం స్నానమాచరించి స్వామివారికి మండలము దినములు ప్రదక్షిణలు చేస్తే సర్వబాధ నివారణమౌతుంది. ప్రదక్షిణ తర్వాత భక్తులు ప్రాణాచార మండపంలో పరుంటారు. వారికే స్వయంగ ఫలితం తెలుస్తుంది. నివారణ కలగనప్పుడు తిరిగి మండలం రోజులు ప్రదక్షిణలు చేస్తారు.

నాగప్రతిష్ఠ

ఎందరో సంతాన హీనులు స్వామివారిని సేవించి రెండు సంవత్సరములలో ఇద్దరు పిల్లలను కన్న ఉదాహరణలు చాల ఉన్నాయి. అలాంటి వారు శిలాలంకృతమైన 'నాగు'ను గుడి ఆవరణలో ప్రతిష్ఠిస్తారు. గుడికి ఈశాన్యంగా నవగ్రహ మంటపం, దాని ప్రక్కనే స్వామివారి కళ్యాణ మంటపం ఉన్నాయి.

శివతత్త్వ వైశిష్ట్యము

వేద వాఙ్మయంలో రుద్రుని ఋతుపవనంతో పోల్చి; మేఘములను కేశములుగాను, మెరుపును వర్ణంగాను, ఉరుము గర్జనగాను, ప్రచండవాయువును ప్రళయస్వరూపంగాను ఊహించారు. అందుకే శివుని కపర్దినుడు, వ్యోమకేశుడు, నీలిశిఖండినుడు, వర్షీయుడు మున్నగు సాదృశ నామములతో కీర్తిస్తారు.

'వృష' అనగా వృషభరాశి. ఇది బ్రహ్మ వర్ఛస్సునకుకారణమైన శుక్రమునకు సంకేతము. ఈ వర్ఛస్సు వలన కామాది వికారములు భస్మమై 'శివత్వం' కలుగుతుంది. అందుకే

నాగ ప్రతిష్టలు




పిల్లల దేవుడు...

శివుని వృషభవాహనా రూఢునిగా తాత్వికులు ఊహించి, సమస్త జీవులకు రక్షకునిగా భావించి "పశూనాం పతయే నమః" అని నిత్యం కీర్తిస్తున్నారు

శుభకార్యాలు

లోకాచారం ప్రకారం శివమందిరాలో వివాహాది శుభకార్యాలు జరుగవు కాని 'కాకాని గుడి'లో ప్రతి సంవత్సరము 1500 పెళ్ళిళ్ళ దాకా జరిగి సత్యనారాయణ వ్రతం చేయటం ఒక ప్రత్యేకత.



స్వామివారి కల్యాణమంటపం

గుంటూరు పాతబస్సుస్టాండు నుండి ఉదయం 6 గం ల నుండి రాత్రి 10 గం.ల వరకు కాకాని గుడికి ప్రతి పదిహేను నిముషములకు ఒక బస్సు వెళుతుంది. దాదాపు 40 కాపురాలు వశించటానికి వీలుగ ఆలయ ఆధ్వర్యంలో గదులు ఉన్నాయి. దేశం నలుమూలల నుండి స్వామి సేవార్థం భక్తులు వస్తుంటారు.

వ్యాసం, ఫొటోలు ·

— పైన్ షేక్ మౌలాలీ ★



బంద్

ఆనంద్

షాపులు తెరవలేదు. బస్సులు నడవటంలేదు.

స్కూళ్ళు లేవు. కాలేజీల్లేవు. ఆఫీసులు చాలా మందకొడిగా పనిచేస్తున్నాయి.

బంద్.

పోలీసులు తిరుగుతున్నారు. మచ్చుకొక్క సిటీబస్సుకూడా కన్పించటంలేదు. ఆటోలూ లేవు. తప్పనిసరై జనం నడిచే వెళ్తున్నారు. సిగిరెట్లుకూడా దొరకటంలేదు.

నగరమంతా బంద్.

ఉద్యమ కార్యకర్తలు మహోత్సాహంతో తిరుగుతున్నారు. ఆవేశంతో ఊగుతున్నారు. షాపు తెరిచినట్టు కనబడితే చాలు — రాళ్ళు విసురుతున్నారు. ఆటో కన్పిస్తే చాలు — అటకాయించి తంతున్నారు. పోలీసులు అంతా హుషారుగానే కనిపెడుతున్నారు.

నగరం పూర్తిగా బంద్.

బంద్ ప్రశాంతంగా జరిగిందని ఆకాశవాణి మధ్యాహ్నం వార్తల్లో ప్రకటించింది. ఇక ఫరవా లేదని జనం ఊపిరి పీల్చుకున్నారు.

ఇంతకీ— ఎందుకీ బంద్ ?

భాష. భాష. భాష.

అంతా భాష ఘోషే.

రాష్ట్ర భాషకే పట్టం కట్టాలి. ఇంగ్లీషొద్దు. హిందీ అసలే వద్దు. ఇతర భాషలు కూడా వద్దు.

స్కూల్లో రాష్ట్ర భాష పాసైనవాళ్ళకే ఉద్యోగాలివ్వండి. ఇంతవరకూ ఇక్కడ ఉద్యోగాల్లో ఉన్నవాళ్ళు— ఇంకైనా రాష్ట్ర భాష నేర్చుకొని పరీక్ష పాసు కాకుంటే—

పంపెయ్యండి, ఉద్యోగాలూడబీకండి.

మన భాషే జిందాబాద్. మిగతావన్నీ ముర్దాబాద్.

ఇక ఫర్వాలేదని జనం ఊపిరి పీల్చుకొనే లోపలే— మెరుపులా నగరమంతటా తెలిసిపోయింది తాజావార్త.

పాత మిల్లుల ప్రాంతంలో కత్తిపోట్లు, రాష్ట్రేతర ముఠాలు రెండూ ఘర్షణ పడ్డాయి.

దొమ్మీ, దౌర్జన్యం.

ఇండ్లలోకి దూరి పొడిచారట.

పదేండ్ల పిల్లాడు అక్కడికక్కడే చచ్చిపోయాడు. మరో యువకుడు నట్టనడిబజార్లో నెత్తుటి మడుగులో నేలకొరిగాడు.

పోలీసులేమయ్యారు ?

పాత మిల్లుల ప్రాంత మంతా ఉద్రిక్తత, భయభ్రాంతి. అరవై మందిని ఆసుపత్రిలో చేర్చారు. ఐదారు మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.

పోలీసులేం చేస్తున్నారు ?

ముఖ్యమంత్రి ఏమంటున్నారు ?

జనతా బజారు దగ్గర ఆటో వాణ్ణి చితకదన్నారు. టూరిస్టు బస్సును అటకాయించారు. రాష్ట్రేతర పాసెంజర్లను దిగి నడవమన్నారు. బస్సును తగలబెట్టబోగా పోలీసులొచ్చారు. దొమ్మీ, లారీఛార్జీ. ఇరవై మంది పోలీసులకు గాయాలు.

సాయంత్ర మౌతున్నా— బయలుదేరబోతున్న ఆటోలు వెనక్కితగ్గి ఆగిపోయాయి

ఉద్యమకారులు మహోద్ధృతంగా తిరుగుతున్నారు. లాంఛనప్రాయమైన బంద్ కాదు రేప్పొద్దునదాకా షాపులు తెరవటానికే వీల్లేదు.

కార్లమీద, స్కూటర్లమీద తిరుగుతున్నారు కార్యకర్తలు.

పాత మిల్లుల ప్రక్కనే మెయిన్‌బజారులో అల్లరయింది సైన్‌బోర్డు గురించి రగడ మొదలైంది. ఇంగ్లీషులో రాశావు. 'మీ' భాషలో రాసుకున్నావు, మరి, రాష్ట్ర భాషలో ఎందుకు రాయలేదు? షాపు యజమాని రాష్ట్రేతరుడు— మంచి బలం ఉన్నవాడు కూడా. రగడపెరిగింది షాపు ధ్వంసమైంది. సైన్‌బోర్డు నేలబడింది సోడాబుడ్డీలు లేచాయి. పోలీసులొచ్చేసరికి అక్కడ ఇద్దరు — కత్తులు దిగబడిన గుండెల్తో — చచ్చిపడిపోయారు.

నగరంలో కర్ఫ్యూ విధించారు

* * *

అర్ధరాత్రి దాటేంతర్వాత తూలుతూ ఇంటికొచ్చాడు ఉద్యమ కార్యకర్త. బంద్ నిర్వహణలో కనబరచిన వీరత్వం ఇప్పటికి కాస్త సంతృప్తి పడింది.

పడుకుని ఉందతని భార్య. అతను క్షేమంగా తిరిగొచ్చినందుకు మగత నిద్రలోనే నిట్టూర్చింది. మౌనంగా వచ్చి పడుకున్నాడతను. దగ్గరకు తీసుకున్నాడు.

"ఊఁ — " అందామె, నిద్ర చెదిరినట్లు.

"ఊఁ ? — " అంటు కౌగిలించుకున్నాడు. దర్పంతో అతను, ఆర్తితో ఆమె ...

చిత్రం, ఏ భాషో అతను ఆలోచించనే లేదు.

* * *

రాష్ట్రేతర వర్గాల నాయకునికి నిద్ర పట్టలేదు. పళ్ళు నూరుతూ రేపటి పథకం గురించి ఆలోచిస్తున్నాడు. ప్రక్కనే భార్య గాఢనిద్రలో ఉంది. కొంతసేపటికి ఉయ్యాల్లో బిడ్డ-కేరుకేరుమని ఏడుపు మొదలెట్టాడు

అందర్నీ పొడిపించేస్తాను — అనుకున్నాడు నాయకుడు ఆవేశంగా.

భార్య ఉయ్యాల దగ్గరికి వెళ్తున్నా, బిడ్డ ఏ భాషలో ఆమెను పిలిచాడో నాయకుడు ఆలోచించడు.

* * *

వీధరుగు మీద నడివయను వ్యక్తి పొట్టలో మోకాళ్ళు కుక్కుకుని చలికి వణుకుతూ పడుకున్నాడు వాడు బికారి, పుట్టు చెవుడు, పుట్టు మూగ.

పేటంతటికీ వాణ్ణి తెలుసు. కాళ్ళు వాచేలా తిరిగినా ఇవాళ ఎవరూ వాడికి పట్టెడన్నం పెట్టలేదు. దీనికేం దిగుల్లేదు వాడికి. తనకు శబ్దాలే వినిపించవు అందరూ మామూలుగానే నోళ్ళు కదిలిస్తున్నారు కాని ఎందుకింత కలవర పడుతున్నారో, భయపడుతున్నారో అర్థం కావటం లేదతనికి. ★

కార్టూనిస్టులకు సూచనలు !

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి !

★ వ్యాఖ్య **చిన్నదిగా, క్లుప్తంగా** వుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి ! కార్టూన్ **మీదే** పేరూ, వూరూ అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామాగల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పి పంపడం జరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యత లేదు.


★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది. పరిశీలనకు ఐదారు వారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

సం॥



జి. ఎల్. - హైదరాబాద్

నా వయస్సు 27 సంవత్సరములు. నాకు చిన్నప్పటి నుండి ముక్కుకు వాసన తెలియదు.

★ ఇ ఎన్ టి. వైద్యులకి ముందస్తుగాచూపించుకొని ముక్కు భాగంలో ఏ లోపమూ లేదని నిర్ణయించుకోవాలి, తర్వాత న్యూరాలజిస్టులు మెదడులో ఏ లోపమూ లేదనే నిర్ణయానికి రావాలి

పుట్టుక నుంచీ వాసన తెలియక పోవటం వల్ల మందుల వల్ల పెద్దగా పరిస్థితిలో మార్పు ఉంటుందని నేననుకోను. దీనిని అనోస్మియా అని అంటారు

కె. ఎస్. – వెంకటగిరి.

నాకు 2 నెలల కొకసారి ఆయాసం వస్తూ ఉంటుంది వైద్యులకి చూపించినా లాభం లేదు

★ రక్త పరీక్ష, ఛాతీ ఎక్స్-రే మొదలయిన పరీక్షలు చేయించి ఫిజీషియన్లకి చూపించాలి ఆస్త్మా వంటి రోగం అయితే అలర్జీ క్లినిక్‌లలో చూపించి ప్రత్యేక చికిత్స పొందటం మంచిది. అంతవరకూ వైద్యుల సలహా మేరకు తాత్కాలిక ఉపశమనం కొరకు, డెరిఫిలిన్, ఎఫిడ్రిన్, కార్టిసోన్ మొదలయిన మందులు వాడాలి.

యు. కె. కె. – నాగార్జున సాగర్

నా వయస్సు పదిహేను సంవత్సరములు చిన్న తనములో కాలు ఎర్రబారి క్రమ క్రమంగా నరాలు పైకి లాగినవి ఇప్పుడు ఒక కాలు చిన్నది, ఒక కాలు పెద్దదిగా తయారయినది ఇంతవరకూ ఏ డాక్టరుకీ చూపించలేదు నడుస్తుంటే నరములు లాగి చాలా బాధ పడుచున్నాను ఎక్కడికి వెళ్లాలన్నా చాలా వీక్‌గా వున్నది

★ మీకు వున్నది పోలియో వచ్చిన తర్వాత కనబడే లక్షణం అయి ఉంటుంది

ఫిజియో తెరపీ మొదలయిన వాటి వల్ల పరిస్థితిలో కొంత మార్పు వస్తుంది కండరాలు ముకిళించుకొని పోవటం వల్ల ఏర్పడిన పొట్టితనాన్ని శస్త్ర చికిత్స ద్వారా కొంత వరకు సరి చేయవచ్చును ఆర్థోపెడిక్ వైద్య నిపుణులను కలవండి

ఎమ్. యు. ఆర్. – నడిపూడి

మా అమ్మగారికి 50 సంవత్సరములు రెండు సంవత్సరముల నుండి ఫిట్సు వస్తున్నవి ఫిట్సు వచ్చినప్పుడు ఏడుస్తుంది అరుదుగా నవ్వుతుంది మందులు వాడుతున్నాము

★ మీ అమ్మగారికి హిస్టరికల్ ఫిట్సు వస్తున్నాయి ఇవి సాధారణంగా ఇంట్లోని పరిస్థితుల ప్రాబల్యం వల్ల, తీరని కోరికల వల్ల ఏర్పడుతాయి

వారిని సైకియాట్రిస్టులకి, న్యూరో ఫిజీషియన్లకి చూపించి మందులు వాడండి ✤

పాలకుని జైలు

భర్తని చంపిన భార్య!

పుదుసత్రం అనే వూరుకు చెందిన కొండప్ప నాయకర్‌తో కాపురం చేయలేక మొదటి భార్య పళనియమ్మ విడాకులిచ్చిపోతే రెండో భార్య బొమ్మాయి కూడా అంత పనీ చేసి పోయిందట నిరాశ చెందని కొండప్ప నాయకర్ తన 45వ ఏట 20 ఏళ్ళ పళనియమ్మ అనే ఆమెను (మొదటి భార్య పేరే) పెళ్ళి చేసుకుని, అయిదేళ్ళు కాపురం చేసినా పిల్లలు పుట్టలేదని విసుగుచెంది ఆమెను తిట్టే వాడట అంతేగాక ఆమె శీలంమీద కూడా అనుమానం పెట్టుకుని, సూటి పోటు మాటలు అనేవాడట ఒకరోజు పెరిగిన తగాదాలో అతను ఆమెను పచ్చి వ్యభిచారిణిగా ఎంచి తిట్టి, అలసి మంచం మీద పడి నిద్రపోయేసరికి పళనియమ్మ ఆవేశంతో అతని తల కొడవలితో నరికి వేరు చేసి పారేసిందట

కారు డిక్కీలో దేవుని శిలలు!

కర్ణాటక, తమిళనాడు సరిహద్దులో వున్న తమిళనాడుకు చెందిన హోసూరులోని వో లాడ్జి ముందు వో ఎంబాసిడరు కారు వున్నదట ఆ కారు చూసిన పోలీసులు అనుమానించి, దాన్ని సోదాచేయగా డిక్కీలో పురాతన శిలలు వో ఎనిమిది వున్నాయట ఇవి అన్నీ దేవుని శిలలట వీటిని అయిదు లక్షల రూపాయలకు విదేశీయులకు అమ్మ ప్రయత్నాలు జరుగుతున్నాయట ఈ శిలలను జాఫర్ షరీఫ్ అనే అతను బెంగుళూరులోని విదేశ పార్టీకి అమ్మడానికి తీసుకు వెళ్తున్నాడట

సారాయి తాగితే జైలు శిక్ష!

రోడ్డు మీద వాహనం నడిపే వ్యక్తి రక్తంలో 0 05 శాతం సారాయంవున్నా, ఆ వ్యక్తికి మూడు వారాలు కనీస పక్షపు జైలు శిక్ష అని నార్వే ప్రభుత్వం ప్రకటించింది కారు, లారీ, బస్సు వంటి బళ్ళు నడిపే వ్యక్తులు ఎంత ధనికులైనా స్థానిక బలమున్న వారైనా, రాజకీయ బలమున్నవారైనా, రాజకీయులైనా యీ శిక్ష నిశ్చయము అని శాసనం చేసిందా దేశం! అహో



ప్రియుని చేతిలో హతమయిన ప్రేయసి!

మేట్టూరుకు చెందిన కళ అనే 20 ఏళ్ళ ఆడ పోలీసు శవం కాలువలో దొరికి, పోలీసులకు పని కల్పించిందట వారి విచారణలో అదే పోలీసు స్టేషనుకు చెందిన 32 ఏళ్ళ మాధవన్ అనే సబ్ ఇనస్పెక్టరును సందేహించి అరెస్టు చేశారట అవివాహితుడయిన మాధవన్ పోలీసు కాన్స్టేబుల్ కళతో ప్రేమాయణం సాగించి, ఆమె తనను పెళ్ళి చేసుకోమని వేధించేసరికి హత్య చేసారేశాట్ట

విఘ్నేశ్వరిగా వినాయకుడు!

తమిళనాడుకు చెందిన కన్యాకుమారికి సమీపంలో గల "సుచీంద్రం" అనే వూరిలో వినాయకుణ్ణి "విఘ్నేశ్వరి"గా కొలిచి, పూజిస్తారుట

శ్రీలంకలో సోవియట్ సినిమా నిషేధం!

రష్యా దేశం విడుదల చేసిన "మండే మెక్సికో" అనే సినిమా తమ దేశంలో విడుదల చేయ అనుమతించేది లేదని శ్రీలంక తెలియజేసింది ఆ సినిమాలో తిరుగుబాటు వీరులు మెక్సికో నగరాన్ని నాశనం చేసిన విధానం శ్రీలంకలోని "విడుదల పులి" అనే పటాలానికి పారం నేర్పగలదేమోనని, అందువల్ల యీ సినిమా తమ దేశంలో ప్రదర్శింప ముడియాదు అని శ్రీలంక అన్నది

అనాయాస మరణ శిక్ష!

అమెరికా శిక్షా స్మృతిలో మరణ దండన అమలు పరుచడంలో విషపూరితమైన ఇంజక్షను వాడచ్చా అనే విషయంమీద ఆ దేశపు కోర్టులన్నీ వాదించుకుని చివరి కక్కడి సుప్రీం కోర్టు నడిగితే సునాయాస మరణం అట్టి వారికి బహూకరించడంలో తప్పు లేదని, కనుక మరణ శిక్ష పడ్డ వ్యక్తికి విషం ఇంజక్షను ఇచ్చి ఆతని జీవితం అంతం చేయవచ్చుననీ ప్రకటించింది


ఆత్మహత్య చేసుకునే హక్కు!

ఆత్మహత్య మానవుని జన్మ హక్కనీ, జీవించలేని వ్యక్తి గాని, జీవితంలో భంగపడిన వ్యక్తిగాని, భగ్న వీణగాని, ఫిడేలుగానీ తమ జీవితం అంతం చేసుకోదల్చుకుంటే అలా చేసుకునే హక్కు ఆ వ్యక్తికి వుండాలని, అది చట్టం నేరంగా ఎంచ బడడం మానవ హక్కులకు సవాలనీ ఫ్రాన్సులో జరిగిన వో విషయసేకరణలో నూటికి యాభై య్యొక్కమంది అభిప్రాయపడ్డారు ఆత్మహత్యకు పాల్పడి, అందులో జయం పొందక, చావు తప్పిన వారిని ప్రభుత్వం శిక్షించటం వల్ల, ఈ భయంతో చాలమంది ఆత్మహత్యలంటే బయపడుతున్నారనీ, ప్రభుత్వం యీ విషయం కలుగజేసుకోకుండా వుంటే బోల్డు మంది ఎంచక్కా ఆత్మహత్యలు చేసుకుంటారని వారంతా అభిప్రాయ పడ్డారు



చిన్న నేరానికి జైల్లో మగ్గిన వ్యక్తి!

1948 నవంబరు 20 వ తేదీన 109 సి ఆర్ పి సి సెక్షన్ క్రింద అలహాబాదులో కాన్పూరుకు చెందిన 35 ఏళ్ళ దీప్‌చంద్ అనే ఆతన్ని అరెస్టు చేశారటలనాడు పోలీసులు ఆ సెక్షనుకు అర్థం శాంతి భద్రతలను పాడు చేసిన నేరమట 1949లో అతనికి మానసిక రుగ్మత, పిచ్చి అనే సందేహాలమీద వారణాశికి పంపితే అక్కడే ఆతను తన జీవిత కాలమంతా గడిపి, చివరికి అలహాబాదు "నాయిని" జైలుకు మార్చబడ్డాడట ఈతని కథ విన్న వో న్యాయవాది మిశ్రాఅనే ఈయన ఈ కేసు వాదిస్తే ఆ దీప్‌చంద్‌ను 1984 జూన్ 5వ తేదీన–35 సంవత్సరాల అనంతరం విడుదల చేసిందట కోర్టు అతి చిన్న నేరానికి అయిన వాళ్ళు లేని కారణాన్న 35 ఏళ్ళు ఏ శిక్షా విధించకుండా, కేసు విచారించకుండా జైల్లో పడేసినందుకు నష్ట పరిహారం చెల్లించాలని ఆ లాయరు మిశ్రా వాదిస్తున్నారట



అతని ప్రవర్తన తనను నొప్పిస్తున్నకొద్దీ అతని మీద అభిమానం మరింత పెరిగిపోతోంది.

అతని గురించి తెలుసుకోవాలనీ, అతనికి తోడుగా తను నిలిచి అతని వంటరితనం పోగొట్టాలని — గజిబిజిగా అల్లుకుపోతున్నయ్ ఆలోచనలు.

అంతలోనే భయం ! అంతలోనే తెగింపు. అంతలోనే అనురాగం — తన పరిస్థితేమిటో తనకే తెలీడంలేదు.

అసలు అతనికోసం తనెందుకు పిచ్చిదవుతోంది ? !

తనను ప్రేమించి, పూలలో పెట్టి పూజించాలనుకున్న వారినందరినీ కాదని తనంటే ఏమాత్రం ఆసక్తిలేని ఇతనివేపు ఎందుకు ఆకర్షితురాలవుతోంది ? అలా తనని నిర్లక్ష్యం చేయడమే తనకా ఆకర్షణ కలిగించిందేమో ! అందరూ కళ్ళప్పగించి చూచే తన అందాన్ని అతనసలు లెక్కచేయకపోవడం తననీ పరిస్థితికి తీసుకువచ్చిందేమో

సాయంత్రం జయలక్ష్మి వచ్చింది ఆఫీసుకి

(గత సంచిక తరువాయి)

''కృష్ణగారేరీ ?'' ఉష నడిగిందామె.

''ప్రెస్ కెళ్ళారు...''

''ఇప్పుడు వస్తారా ?''

''రావాలి మరి. .''

''ఓ. కే. అయితే వెయిట్ చేస్తాను '' అక్కడే కూర్చుందామె

ఆమె ఆ రోజు ప్రత్యేకంగా అలంకరించుకుని వచ్చినట్లు తెలిసిపోతోంది ఉషకు అదీగాక అసలు ఇంత తరచుగా ఎప్పుడూ ఆఫీసుకి రాలేదిన్ని రోజులూ !

ఇవన్నీ స్పష్టంగా చెబుతోన్నయ్, ఆమె కృష్ణమీద మనసు పడిందని ఉష మనసంతా ఆమెమీద అసూయతో నిండిపోయింది. కృష్ణ ఆమెకు లొంగుతాడా ? ఏమో ! తనకా నమ్మకం లేదు. కానీ ఏమో ! మగాడి మనస్తత్వం తెలుసుకోవడం ఎవరి తరం ? చెప్పేదొకటి, చేసేదొకటి! ఆలోచించే దొకటి ఆఖరి నిమషంలో మనసు మార్చుకుని చేసేదొకటి !

కొద్దిసేపు ఏవో మాగజైన్లు తిరగవేస్తూ కూర్చుంది జయలక్ష్మి. అప్పటికీ అతని జాడ లేకపోయేసరికి హబీబ్‌ని పిలిచిందామె

''ఇదిగో ! కృష్ణగారొచ్చాక ఓసారి అర్జంటుగా ఇంటికొచ్చి మాట్లాడి వెళ్ళమని చెప్పు ! నేను ఇంటి దగ్గరే ఎదురు చూస్తుంటాను ఆయన కోసం .. ''

అతనితో చెప్పి వెళ్ళిపోయింది

ఉషకు ఆశ్చర్యం కలిగింది

అతనితో ఆమెకు అంత అర్జంటుగా మాట్లాడాల్సిన విషయం ఏమిటో ? ఎంత వద్దనుకున్నా మనసు ఉండుండి ఆ విషయం మీదకే మళ్ళుతోంది

ఏదో తెలీని అశాంతి !

తనమీద తనకే చికాకుగానూ కోపంగానూ కూడా ఉంది.

కృష్ణ ఆఫీస్‌కొస్తూనే హబీబ్ జయలక్ష్మి చెప్పిన విషయం చెప్పేశాడు

కృష్ణకు్కూడా ఆశ్చర్యం కలిగింది

తనతో ఆమెకు అర్జంటుగా మాట్లాడాల్సిన విషయం ఏముంటుంది ? మళ్ళీ ఏమయినా ఇంటర్‌వ్యూలు, లేక ఇంకేదయినా పత్రిక్కి సంబంధించిన వ్యవహారం అయుండాలి

''సరే ! వెళ్ళివస్తాను ..'' ఆమె ఇంటికి బయల్దేరాడతను జయలక్ష్మి మేడమీద బాల్కనీలో నిలబడి అతని కోసమే ఎదురు చూస్తోంది. అతను రావడం గమనించగానే పరుగుతో మేడదిగి వెళ్ళి అతనిని తనతోపాటు మేడమీదకు తీసుకొచ్చింది

''కూర్చోండి'' అంది సోఫా చూపుతూ.

కూర్చున్నాడు కృష్ణ.

''అర్జంటుగా మాట్లాడాలన్నారని హబీబ్ చెప్పాడు'' అన్నాడు ఆమె వంక 'ప్రశ్నార్థకంగా చూస్తూ.

''అవును ! సాయంత్రం మీ ప్రోగ్రాం ఏమిటి ?'' అడిగిందామె

కొత్త చీర, కొత్త అలంకరణ — కొత్త రూపం —

ఆమె నుంచి చూపులు మరల్చుకున్నాడతను

''ఏముందండీ ! ఆఫీస్ పని చూచుకుని ఇంటికెళ్ళడమే —''

''ఆఫీస్ పని ఎప్పుడూ ఉండేదేగా ! ఇవాళొక్కరోజు కొంచెం నాకోసం స్పేర్ చేయండి !... '' నవ్వుతూ అందామె

కృష్ణకేమీ అర్థం కాలేదు

''ఏం చేయాలి ?'' అడిగాడతను

''సాయంత్రం ఆబిడ్స్ హోటల్లో మా ఫ్రెండ్సందరికీ డిన్నర్ ఇస్తున్నాను మీరు కొంచెం అసిస్ట్ చేస్తే చాలా హెల్పు చేసిన వారవుతారు ..''

''ఓకే— ఎన్ని గంటలకు వెళ్ళాలంటారు ?''

జరిగిన కథ—11 : కృష్ణ సావిత్రిని ప్రేమిస్తున్నానని చెపుతాడు అతని తత్వం తెలీని సావిత్రి తనూ అతనిని ప్రేమిస్తున్నట్లు చెపుతుంది. ప్రసాద్ ఉద్యోగంలో చేరను హైదరాబాదు వెళ్లిపోతాడు. కృష్ణ తన మాయమాటలతో సావిత్రిని లొంగతీసుకొని మొహం చాటువేస్తాడు సావిత్రి తనకు పెళ్లి కుదిరిందని చెప్పినా కృష్ణ ఆ విషయాని కంత ప్రాముఖ్యత నీయకపోవడం ఆమెకు కలవరపాటును కలిగిస్తుంది. సావిత్రిని ఏ విధంగా వదిలించుకుందామా ! అని ప్లాన్స్ వేస్తుంటాడు కృష్ణ. కృష్ణ ఆంతర్యం తెలుసుకొన్న సావిత్రి తల్లడిల్లిపోతుంది. చెల్లెలు రుక్మిణి మరణంతో కృష్ణకు కనువిప్పు కలుగుతుంది. సావిత్రిని పెళ్లి చేసుకోడానికి నిర్ణయించుకొని వచ్చేటప్పటికి సావిత్రి ఆత్మహత్య వార్త వింటాడు. ఆమె చనిపోకముందు తనకు రాసిన ఉత్తరం చదవసాగాడు సావిత్రి రాసిన ఉత్తరం చదివి చిత్రవధ ననుభవిస్తాడు కృష్ణ. సంగతి తెలిసికొన్న సీతారామయ్య కృష్ణను అనకాపల్లికి తీసుకొని వెళ్లిపోతాడు. కృష్ణ దిగులుతో కృశించిపోవడం చూసిన అనూరాధ అతనికి పెళ్లి చేస్తే మనుష్యులలో పడతాడేమో ! అని భర్తతో చెపుతుంది. కృష్ణ అన్న, వదినలకు భారంగా ఉండటం ఇష్టంలేక ఉద్యోగాన్వేషణకై హైద్రాబాదు వెళుతాడు. ప్రసాద్ సహాయంతో అక్కడ దీపిక పత్రికాఫీసులో ఉద్యోగంలో చేరుతాడు. 'దీపిక' పత్రికాధిపతి రాజయ్య కూతురు జయలక్ష్మి కృష్ణతో స్నేహం చేయాలని ఉవ్విళ్లూరుతుంది. కృష్ణ వేరే గది అద్దెకు తీసుకొని ప్రసాద్ ఇంటినుండి షిఫ్ట్ అయి వెళ్లిపోతాడు. కృష్ణ సహోద్యోగిని ఉష అతనికి చేరువ కావాలని ఆరాటపడుతుంది. కృష్ణ ఆమెతో తన చరిత్ర మంచిది కాదనిచెప్పి, తనకు దూరంగా ఉండమని హెచ్చరిస్తాడు.

"ఇంకో గంటాగి బయల్దేరదాం! ఎరేంజ్ మెంట్స్ చూసుకోవాలి కదా !"

"సరే !"

"మీకు కాఫీ కావాలా, కూల్ డ్రింకా ?" అడిగిందామె.

"ఏమీ వద్దండీ – ఇంతకుముందే ..."

"ఏదొకటి తీసుకోవాల్సిందే –" అతని మాటకడ్డుపడుతూ అందామె.

"అయితే మీ ఇష్టం..." చిరాకు అణచుకుంటూ అన్నాడతను.

జయలక్ష్మి కిందకెళ్ళి రెండు కప్పుల్లో కాఫీ తీసుకొచ్చి ఒకటి అతని ముందుంచింది. ఆమెకు లోలోపల చాలా నిరుత్సాహం కలిగింది.

తను ఫ్రెండ్స్‌కి డిన్నర్ ఇస్తోందని చెప్పినప్పుడు అతను సందర్భం అడుగుతాడనీ, అప్పుడు తన పుట్టినరోజు విషయం చెప్పవచ్చనీ అనుకుందామె.

కానీ అతనికా విషయమే పట్టలేదు.

"సాయంత్రం నేను ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నాను. కొంచెం పాయిజన్ తీసుకు రమ్మంటే... "సరే" అనేసేట్లున్నాడతను.

ఇదే ఇంకొకరయితే తనను ప్రశ్నలతో ముంచెత్తేసేవాళ్ళు.

తన పుట్టినరోజన్న విషయం తెల్సుకుని అభినందనలు కురిపించేసేవాళ్ళు.

అతను కాఫీ తాగి లేచి నిలబడ్డాడు.

"సరే ! గంటయ్యాక వస్తాను" అనేసి ఆమె వంక చూడకుండా వెళ్ళిపోయాడక్కడి నుంచి.

జయలక్ష్మికి అతని మీద కోపం ముంచుకొచ్చింది. మరీ ఇంత మేనర్‌లెస్ ఫెలో అనుకోలేదు తను.

సరిగ్గా గంటయ్యాక వచ్చేశాడతను.

"పదండి వెళ్దాం" అతనికి బయటే ఎదురయి అందామె.

ఇద్దరూ రోడ్డుమీద నడవసాగారు.

"ఆటోరిక్షా దొరుకుతుందేమో చూడండి." మెయిన్ రోడ్ మీదకొచ్చాక అందామె.

అతను దూరంగా పార్క్ చేసి ఉన్న ఆటోరిక్షా వేపు నడిచాడు.

ఆమె అక్కడే నిలబడింది.

ఆటో మాట్లాడి ఆమె వేపు చూసి సంజ్ఞ చేశాడతను.

ఆమె వచ్చి కూర్చున్నాక తనూ ఓ పక్కకు జరిగి ఆమెకు ఎడంగా కూర్చున్నాడు.

"మీరు పత్రికలెలాగూ చదవరనుకోండి ! పోనీ సినిమాలయినా చూస్తారా ?" అడిగిందామె అతనివంక నవ్వుతూ చూసి.

"ఒకప్పుడు చూసేవాడినండీ ! ఇప్పుడా ఆసక్తి లేదు."

"ఎందుకని ?"

అతనికేం చెప్పాలో తెలీలేదు.

"ఏమో ఇష్టంపోయింది." అన్నాడు అబద్ధమాడేస్తూ.

ఆడపిల్లలూ, సినిమాలూ, షికార్లూ, విందులూ ఇవన్నీ తనకు భయం కలిగిస్తున్నాయనీ, సావిత్రితో గడిపిన రోజులను గుర్తుకు తెచ్చి చిత్రహింస పెడతాయనీ ఎలా చెప్పగలడు ?

"మీరు మీ ఏజ్‌కి తగ్గట్లుగా లేరు కదూ ?" మరి కొద్ది క్షణాలాగి అందామె.

"అంటే ?"

"అన్నీ త్యజించిన యోగీశ్వరుడిలా ఉన్నారు..."

"మీకలా కనిపిస్తున్నాను. అంతే.."

ఆటో వేగంగా మలుపు తిరగడంతో ఆమె అతని మీదకు వరిగింది. వెంటనే పక్కకు జరగకుండా, నెమ్మదిగా సర్దుకుని జరిగిందామె. అతను అదేమీ గమనించనట్లు అద్దంలో నుంచి రోడ్డుమీదకు చూడసాగాడు.

"మీరు కాలేజీలో గాళ్స్‌తో స్నేహంగా ఉండేవారు కాదా?" అడిగిందామె కవ్విస్తున్నట్లు.

"కొంతమంది తెలుసు–" అంటీ అంటనట్లు చెప్పాడతను

"తెలుసంటే హలో హలో స్నేహమా లేక డీప్ ఫ్రెండ్‌షిప్ ఉండేదా ?"

"ఎందుకివన్నీ అడుగుతున్నారు ?" తన చిరాకుని అణచుకుంటూ అన్నాడతను.

"ఆడపిల్లలంటే భయపడిపోతూంటే అనుమానం వచ్చింది నాకు..."

"భయం కాదండీ ! నా గొడవల్లో నేనున్నాను– అసలు అవన్నీ ఆలోచించేంత తీరికే లేదు..."

ఆటో హోటల్ ముందాగింది.

మీటర్ చూసి ఛార్జ్ ఇచ్చేసిందామె.

ఇద్దరూ ఆటో దిగి హోటల్లోకినడిచారు.

సూపర్‌వైజర్ వారిని లిఫ్ట్‌లో టెర్రేస్‌కి తీసుకెళ్ళాడు.


చాలా విశాలమైన టెర్రేస్–

చుట్టూ క్రోటన్స్–

పైన పందిరిలా అల్లుకుపోయిన క్రీపర్స్–

అప్పుడే టేబుల్స్ ఎరేంజ్ చేస్తున్నారు హోటల్ కుర్రాళ్ళు

"మీరు ఆరు టేబుల్స్ చెప్పారు ఇంకో రెండు కూడా ఎక్స్‌ట్రా ఎరేంజ్ చేస్తున్నాము" చెప్పాడతను.



మరికా సేపట్లో ఆ ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయ్.

ఆమె స్నేహితురాండ్రు ఒక్కొక్కరే రావడం ప్రారంభమయింది. అందరికీ ముందు కూల్‌డ్రింక్స్ ఇవ్వడం, ఆ తరువాత 'డిన్నర్ సర్వే చెయ్యడం— అన్నీ హోటల్ బాయ్స్ చూచుకుంటున్నారు.

కృష్ణ ఖాళీగాఉన్న టేబిల్ దగ్గర కూర్చోవడం తప్పితే ఇంక వేరేపనేమీ చేసే అవకాశం కనిపించలేదు.

అసలామె తనను తీసుకురావడం వృధా అనిపిస్తోంది.

ఆమె తన ఫ్రెండ్స్ కొందరిని తీసుకొచ్చి కృష్ణకు పరిచయం చేసింది

"ఆయనెవరో చెప్పవేం ?" ఓ అమ్మాయి అడిగింది జయలక్ష్మిని.

"మా ఫ్రెండ్" ఠక్కున చెప్పేసింది జయలక్ష్మి.

"ఇంత మంచి బాయ్ ఫ్రెండ్ ఉన్నట్లు మాకు చెప్పలేదేం ?"

జయలక్ష్మి నవ్వి ఊరుకుంది.

కృష్ణ మౌనంగా ఉండిపోయాడు.

పార్టీ ముగిసేంతవరకూ అందరూ తన చొరవలేని తనాన్ని గురించి జోక్స్ వేసుకుని నవ్వుకోవడం అతనికి వినబడుతూనే ఉంది

ఎనిమిదిన్నరకు అందరూ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

జయలక్ష్మి, కృష్ణ కూడా హోటల్ నుంచి బయటికొచ్చారు.

ఆటో తీసుకొచ్చాడు కృష్ణ.

"మనం ఏదయినా పిక్చర్ కెళ్దామా ?" హఠాత్తుగా అడిగింది జయలక్ష్మి.

కృష్ణ తెల్లబోయాడు.

జయలక్ష్మి ఇంత ఫాస్ట్ అని తననుకోలేదు.

ఆమె మనసులోని ఆలోచనలు అర్థమయిపోయాయతనికి. తనతో చనువు పెంచుకోడానికే సినిమా ప్రపోజల్ పెట్టిందామె.

సినిమాహాల్లో ఆమె ఇంకెలా ప్రవర్తించినా తను ఆశ్చర్యపోనక్కరలేదు.

"సారీ జయలక్ష్మిగారూ ! ఇప్పుడు సినిమా చూసే శక్తిలేదు నాకు ..."

"మీ ఇష్టం ! పోనీ రేపు వెళ్దామా ?"

ఏం చెప్పాలో తెలీలేదతనికి.

"సరే" అన్నాడంటే మర్నాడు మళ్ళీ వెంటబడుతుందేమో. శాశ్వతంగా ఆ పరిస్థితి నుంచి బయటపడాలి

"నాకు సినిమాలంటే ఏమాత్రం ఇంటరెస్ట్ లేదని మీకు చెప్పాను కదా ?" నవ్వుతూ అన్నాడతను.

ఆమె మొఖం చిన్నబుచ్చుకుంది.

"సరే — పదండి ! ఇంటికి పోదాం — " అంది విసురుగా.

జీవితం - సెంటిమెంట్

ఆటోలో ఇంటికి చేరుకున్నారిద్దరూ.

త్రోవలో ఆమె ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

ఇంటి దగ్గర అతనితో "చాలా థాంక్స్ ! ఇంక మీరు వెళ్ళండి" అనేసి లోపలకు వెళ్ళిపోయింది.

కృష్ణ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

ప్రస్తుతానికి ఆమె చూపుతోన్న అంతులేని అభిమానం నుంచి తప్పించుకున్నట్లే !

బస్‌లో ఇంటికి చేరుకున్నాడతను.

అప్పటికే ఆ వీధంతా నిర్మానుష్యం అయిపోయింది. బెడ్డింగ్ బయట అరుగుమీద పర్చుకుని పడుకున్నాడతను. అంతకు ముందు రోజు రాత్రి సరిగ్గా నిద్ర లేకపోవడం వల్ల వెంటనే నిద్ర పట్టేసింది.

ఆ రోజు అతను ఆఫీసుకెళ్ళేసరికే రాజయ్య ఆఫీస్‌లో ఉన్నాడు. ఉష అతని టేబుల్ దగ్గరే కూర్చుని ఉంది.

"రా ! నీకోసమే చూస్తున్నాను..." అన్నాడతడు కృష్ణతో.

"ఏమిటండీ ?"

"చాలా ముఖ్యమయిన విషయం !" అన్నాడతను ఏదో ఆలోచిస్తూ.

కృష్ణకు సందేహం కలిగింది.

ఒకవేళ అతనికి జయలక్ష్మి తన మీద ఏమయినా కల్పించి చెప్పలేదు కదా !

కొద్ది క్షణాలాగి అతనే మాట్లాడాడు.

"సంగతేమిటంటే— మన పత్రిక సర్క్యులేషన్ తగ్గిపోతోందీమధ్య. ఆచారి ఉండగా మేమంతా కూర్చుని డిస్కస్ చేశాం ఈ విషయం చాలా మంది రాసే ఉత్తరాలనుబట్టి సీరియల్స్, కథలూ ఏమాత్రం బావుండటం లేదని తెలిసిపోయింది. మరి పేరున్న రచయితలూ, రచయిత్రులూ మనకి కథలు పంపడం లేదు.

ధర్మం - మర్మం

పులి నుండి
పులి పుడుతుంది
మేక నుండి
మేక పుడుతుంది
ఇది శారీరక ధర్మం !
మరి...
కష్టానికి తల్లి
శ్రుతి మించిన సౌఖ్యం
సౌఖ్యానికి తల్లి
తొల్లి పడిన కష్టం !
ఇది సామాజిక మర్మం

- నల్లాన్‌చక్రవర్తుల శేషాచార్య

ఎందుకంటే వాళ్ళకి మనం డబ్బు ఎగ్గొడుతున్నాం గనక... అర్థమయిందా ?"

తలూపాడు కృష్ణ.

"కనుక ఇప్పుడు మనం ఓ ట్రిక్ ప్లే చేయాలి. వెంటనే నవలలు, కథల పోటీలు ప్రకటిద్దాం ! బహుమతి మొత్తం కొంచెం ఎక్కువ పెడదాం ! దాంతో చాలా మంది పేరున్న వాళ్ళు కూడా టెంప్ట్ అయి రచనలు పంపిస్తారు. ఎలా వుంది అయిడియా ?"

"బాగానే ఉందండీ! కానీ ఆ బహుమతుల డబ్బు ఇప్పుడే మనం బాకీ ఉన్నవారందరికీ పంపుతే మళ్ళీ వాళ్ళ దగ్గర నుంచి రచనలు వస్తాయి కదా ! ఈ విధంగా అయితే వాళ్ళను ప్లీజ్ చేసినట్లవుతుంది. మన బాకీ కూడా తీరిపోతుంది. అటు రచనలూ మళ్ళీ పంపడం ప్రారంభిస్తారు ..."

రాజయ్య నవ్వాడు.

"ఇదిగో కృష్ణా ! నా ఎక్స్‌పీరియన్స్ అంత వయసు లేదు నీకు ! అవునా !"

"నేను వ్యాపారం మనిషిని ! నేను అనేక వ్యాపారాలు చేశాను. దెబ్బతిన్నాను. చివరకు ప్రెస్ పెట్టాక నిలదొక్కుకున్నాను. ఎందుకనో తెలుసా ? మిగతా వ్యాపారాల్లో బాకీలు తీర్చి దెబ్బతిన్నాను. ప్రెస్ పెట్టాక బాకీలు ఎగ్గొట్టి నిలబడ్డాను. కనుక ఇప్పుడు మా గజైన్ విషయంలో కూడా బాకీలు తీర్చడం అనేది నా ప్రాణం పోయినా జరగదు. ఇదిగో—నీకోవిషయం తెలుసా ? ఈ పత్రిక ప్రారంభించడానికి లక్ష రూపాయలు ఖర్చు చేశాను. దానికి పదిరెట్లు మళ్లీ నాకు రావాలి ! అప్పుడు బాకీల సంగతి ఆలోచిద్దాం ! సరేనా ?"

కృష్ణ నివ్వెరపోయి వింటూండిపోయాడతని మాటలు.

"కానీ— ఇప్పుడీ నవలలు కథలపోటీ పెడితే మాత్రం— బహుమతులకు డబ్బుఖర్చుచేయాలి కదండీ !"

"అప్పుడేం చేస్తానో చూద్దూగానిగా ?" నవ్వుతూ అన్నాడతను.

"ఇంతకూ ఇప్పుడు నన్నేం చేయమంటారు ?" అడిగాడు కృష్ణ.

"ఉషతోపాటు కూర్చుని, ఇద్దరూ కలిసి ఆ పోటీల ప్రకటన తయారుచేసి ఈ సంచికలో ప్రచురించండి. నవలలకేమో మొదటి బహుమతి అయిదువేలు, రెండో బహుమతి మూడున్నర వేలు, మూడో బహుమతి రెండువేలు— కథలకు రెండువేలు, వెయ్యి, ఏడుఎందలఏభై పెట్టండి"

"సరేనండి !"

"పోటీ నిబంధనలన్నీ పాత ప్రకటనలోవి చూసి రాసేయండి. ఒక్కటి మాత్రం స్పష్టంగా రాయాలి. అదేమిటంటే పోటీకివచ్చిన కథలూ, నవలల్లో నచ్చిన వాటిని సాధారణ ప్రచురణకు స్వీకరించే హక్కు మాకుంది అన్న నిబంధన."

''ఓ. కే...''

''ఏమ్మా ! అర్థమయిందా ?'' ఉషను కూడా అడిగాడతను.

''అయిందండీ !''

హబీబ్ ఓ యువతితోపాటు లోపలికొచ్చాడు.

''సార్ ! ఈమె మీతో అర్జంటుగా మాట్లాడాలంటున్నారు !'' చెప్పి వెళ్ళిపోయాడతను.

''ఏం కావాలండీ ?'' అడిగాడు రాజయ్య.

''నా పేరు స్వప్నస్వరూప అండీ ! నావి నాలుగు కథలు పబ్లిష్ అయాయ్ 'దీపిక' పత్రికలో ! సంవత్సరం దాటిపోయింది — ఇంతవరకూ మీరు డబ్బు పంపలేదు. కనీసం నా ఉత్తరాలకు జవాబు కూడా రాయలేదు —''

''కూర్చోండి .'' తాపీగా అన్నాడు రాజయ్య.

ఆమె కుర్చీలో ఉష పక్కనే కూర్చుంది.

''ఏ నెలల్లో పబ్లిష్ అయాయ్ మీవి ?'' అడిగాడు రాజయ్య.

''కిందటి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి, మే, జూన్ సంచికల్లో వచ్చాయండీ !''

''ఓహో అదా సంగతి!'' నవ్వుతూ అన్నాడు రాజయ్య. ''అయితే ఫర్లేదులెండి ! నేనింకా అంతకుముందువేమో అని భయపడ్డాను: ఎందుకంటే అంతకుముందువన్నీ, అంటే జనవరి నెల వరకూ అందరికీ నిన్నే మనిఆర్డర్ చేశాము. గొడవెక్కడొచ్చిందంటే ఆమధ్య స్టాఫ్ ప్రాబ్లెమ్ వచ్చిందండీ ! ప్రతివాళ్ళూ నెలా, రెండు నెలలు పనిచేసి — మరో ఉద్యోగం రావడంతో ఇది వదలి వెళ్ళిపోవడం — చేసేవాళ్ళు. దాంతో ఈ ఆఫీస్ పనులన్నీ దెబ్బతినేశాయ్. మళ్ళీ వారం క్రితమే మొదలుపెట్టి ముందు బాకీలన్నీ తీర్చడం ప్రారంభించాము. కనుక ఇంకేం సమస్య లేదు. ఈ వారంలోగా మీ కథలన్నిటికీ వరుసగా ఎమ్. వోలు వచ్చేస్తాయ్'' చెప్పాడతను.

ఆమె శాంతించింది.

''అదాకారణం ! పోనీ ఆ విషయం మాకు లెటర్ రాస్తే మాకీ ఆందోళన ఉండేది కాదు కదండీ ! మేము వేరే పని మీద హైదరాబాద్ వచ్చాము. ఎలాగూ వచ్చాంకదా ఈ విషయం కనుక్కుందామని ఇలావచ్చాను.'' అందామె.

''చూడండి ! మీకు ఉత్తరం రాసేందుకు మనిషి ఉంటే— అసలు మనిఆర్డర్స్ ఎందు ఆపుతామండీ ?''

ఆమె నవ్వేసింది.

''అఫ్‌కోర్స్ ! నిజమేలెండి.''

''ఒరే హబీబ్ ! కూల్‌డ్రింక్స్ తీసుకురా నాలుగు.''

''అబ్బే ఎందుకండీ ! వద్దు.''

''భలేవారే ! రచయిత్రి పత్రికా ప్రెస్‌కొస్తే ఆ మాత్రం మర్యాద కూడా చేయవద్దంటారా ఏమిటి ? అన్నట్లు మీరు అసలు కథలు పంపడం మానేశారేమిటి ? కనీసం ఒక్క కథయినా అర్జంటుగా పంపమని ఉత్తరం రాశాను కదా.''

ఆమె ఆశ్చర్యపోయింది.

''ఉత్తరం రాశారా ? ఎప్పుడు ?''

'' ఎప్పుడు రాశామోయ్ కృష్ణ ? '' కృష్ణనడిగాడతను.

కృష్ణ తెల్లబోయాడు. తనకు తెలిసినంత వరకూ రాజయ్య ఇంతవరకూ ఏనాడూ ఎవరికీ ఉత్తరాలు రాయలేదు—

కృష్ణ మౌనంగా ఉండడం గమనించి ఆయనే వెంటనే కల్పించుకున్నాడు. ''ఓహో మీకు తెలీదు కాబోలు— హబీబ్ పోస్ట్ చేశాడా రోజు. పదిరోజులయి ఉంటుందండీ — డబ్బు పంపలేదని మాత్రం కథలు పంపడం మానకండి! మీ డబ్బు నాల్రోజులు ముందో వెనుకో తప్పక మీకు చేరుతుంది. అయినా ఇప్పుడిక ప్రాబ్లెమ్ కూడా ఉండదులెండి ! వీళ్లద్దరూ మాకు పర్మనెంట్ ఎంప్లాయిసే కనుక ఎలాంటి ఆలస్యం జరగదు.''

హబీబ్ కూల్‌డ్రింక్స్ తెచ్చి ఇచ్చాడు. తాగాక వెళ్ళిపోయింది.

''హమ్మయ్య గొడవ వదిలిపోయింది. అందుకే అసలు ఆఫీసులో కూర్చోను నేను. వస్తానోయ్—'' అనేసి అక్కడి నుంచి తనూ వెళ్లిపోయాడు రాజయ్య.

''జనవరి వరకూ అందరికీ మనియార్డర్లు పంపించారట ! ఎంత పెద్ద అబద్ధమో చూశారా ?'' కృష్ణతో నవ్వుతూ అంది ఉష.

కృష్ణ మాట్లాడలేదు.

అతనికి మొదటిసారిగా ఆ ఉద్యోగం మీద అయిష్టం కలిగింది. రాజయ్య ఎంతో మందినలా మోసం చేయడం వచ్చలేదు.

పైగా అన్నీ అబద్ధాలే !

రాజయ్య సమయానికి ఆఫీసులో ఉండబట్టి సరిపోయింది లేకపోతే ఆ అబద్ధాలన్నీ తామే చెప్పాల్సివచ్చేదేమో !

''మీకెలా ఉందోగాని నాకు మాత్రం ఇక్కడ ఏమాత్రం పని చేయాలనిపించడం లేదు...'' కొద్ది క్షణాలతర్వాత తిరిగి అందామె.

''నిజమే వాతావరణం ఏమీ బావుండ లేదు...'' అంగీకరిస్తూ అన్నాడు కృష్ణ.

''గత్యంతరం లేక చేయడమే ! ఎన్నో గవర్నమెంట్ జాబ్స్ కోసం అప్లయ్‌చేస్తున్నాను. ఎప్పటికి దొరుకుతుందో తెలీదుగానీ అంతవరకూ ఈ నరకం తప్పదు...'' అందామె.

ఇద్దరూ లేచి తమ తమ సీట్లలో కూర్చున్నారు.

టైప్‌చేసే శబ్దం తప్పితే చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది. సాయంత్రానికల్లా ఇద్దరూ కలిసి కథలు,నవలలపోటీకి సంబంధించిన ప్రకటన తయారుచేసి ప్రెస్‌కి పంపించేరు.

సాయంత్రం అయిదవుతోండగా బయట నుంచి పెద్ద కేకలు వినిపించాయ్.

''ఏమిటది ? ఏం జరిగింది ?'' రోడ్డు వేపుకి చూస్తూ కృష్ణ నడిగింది ఉష.

కృష్ణ బయటకెళ్ళి చూశాడు.

ఎక్కడివాళ్ళక్కడ పరిగెడుతూనే ఉన్నారు. హోటళ్ళూ, షాపులూ అన్నీ మూసివేశారు హడావుడిగా.

మరుక్షణంలో రోడ్డంతా నిర్మానుష్యమయిపోయింది.

''ఏదో గొడవ జరిగింది. అందుకే అందరూ పారిపోతున్నారు ... '' అన్నాడు కృష్ణ.

ఎవరినయినా అడుగుదామన్నా ఎవరూ అతని మాట వినిపించుకోవడంలేదు.


ఇద్దరూ మళ్ళీ లోపలికొచ్చి కూర్చున్నారు.

కాసేపటి తర్వాత ఫోన్ మోగింది.

కృష్ణ వెళ్ళి ఫోన్ తీసుకున్నాడు.

''హలో ... ''

''హలో — ఎవరు ?''



''కృష్ణ — ''

''చూడు కృష్ణా! నేను రాజయ్యాని, మన రోడ్డుమీద ఏవో గొడవలవుతున్నాయ్. కత్తిపోట్లు, కొట్లాటలు—చాలా అల్లరిగా ఉంది మన ఆఫీస్ వెంటనే మూసేసి తలుపులు గొళ్ళేలు పెట్టేయండి మీరూ బయటకుపోవద్దు — నేను మళ్ళీ ఫోన్ చేసేవరకూ ''

''సరే ''

ఫోన్ పెట్టేశాడతను

''ఎవరు మాట్లాడింది ?'' అడిగింది ఉష

''రాజయ్యగారు ''

''ఏమిటంటున్నారు !''

''ఇదే — బయట కత్తిపోట్లతో దొమ్మీ లవుతున్నాయట మనని ఆఫీసులు తలుపులు మూసి గడవేసేయమంటున్నారు తను మళ్ళీ ఫోన్ చేసేవరకూ మనని కూడా బయటకు వెళ్ళ వద్దంటున్నారు ''

ఉష భయంగా అతనివేపు చూసింది

''ఇంకా ఆలస్యం అయితే ఇంటికెళ్ళడం మరీ కష్టమయిపోతుందేమో '' అంది ఆందోళనగా

కృష్ణ ఆమెవేపు చూశాడు ఆమె కళ్ళల్లోని భయం అతనికి జాలి కలిగించింది

'ఫరవాలేదు లెండి! ఎంత రాత్రయినా నేను మిమ్మల్ని మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను ''

ఆమెకు కొంత మనస్థిమితం చిక్కింది

అతను తలుపులు మూసివేసి కిటికీలో నుంచి బయటకు చూడసాగాడు

రోడ్డుమీద అంతా నిశ్శబ్దంగా ఉంది

ఉండుండి ఓ పోలీస్ సైరన్ వినబడుతోంది

మరి కాసేపట్లో చీకటి పడిపోయింది

అతను లైట్ వెలిగించాడు

రాత్రి తొమ్మిదయాక పరిస్థితి మళ్ళీ మామూలయింది

రిక్షాలు, కార్లు, ఆటోల — శబ్దాలు వినిపించసాగినయ్

''ఇప్పుడింక వెళ్ళవచ్చనుకుంటాను కదూ ?'' అడిగిందామె

''ఏమో! ఒకసారి చూసివస్తాను ''

తలుపు తెరచుకు నడిచాడతను

బయట అంత రద్దీగా లేకపోయినా జనం రాకపోకలు జరుగుతూనే ఉన్నాయ్ మెయిన్ రోడ్డంతా పోలీసులు గస్తీ తిరుగుతున్నారు

కృష్ణ దగ్గరే నిలబడ్డ ఓ కానిస్టేబుల్‌తో మాట్లాడి అన్నీ తెలుసుకుని తిరిగి వచ్చాడు

''పదండి! ఇంకేం భయం లేదు'' అన్నాడు ఉషతో

ఆమె అతని వెంబడే బయటికొచ్చింది

జీవితం—సెంటిమెంట్

ఆఫీస్‌కి తాళం వేసి ఆమెతోపాటు మెయిన్‌రోడ్ మీదకొచ్చాడతను

ఎంతసేపు నిలబడ్డా ఆటోరిక్షాలు దొరకడమే లేదు

రిక్షాలు దొరకడం కూడా కష్టంగానే ఉంది

''పోనీ రిక్షాలో వెళ్ళిపోదాం !'' అంది ఉష టైము పదయిపోవడం గమనించి

అతనికీ అంతకంటె గత్యంతరం కనిపించలేదు ఒకే రిక్షాలో ఆమెతో కూర్చోవడం ఎబ్బెట్టుగా అనిపించినా చేసేదిలేక ఖాళీగా పోతోన్న రిక్షాను పిలిచాడతను

''ఎక్కడికెళ్ళాలి ?'' అడిగాడు రిక్షా అతను

ఆమె చెప్పింది వివరంగా.

''అయిదు రూపాయలు —'' నిర్లక్ష్యంగా చెప్పాడతను

''అయిదు రూపాయలా ?''

''అవునమ్మా! ఈ గొడవల్లో రిక్షా తొక్కడమే తప్పసలు —'' జాలి తలచినట్లు చెప్పాడు

''పోనీండి! ఈ సమయంలో బేరమాడటం అనవసరం —'' అన్నాడు కృష్ణ

ఆమె రిక్షాలో కూర్చుంది అతనికి చోటు వదలి

ఆమె పక్కనే కూర్చున్నాడతను

''ఇక్కడి కెంత దూరం ఉంటుంది మీ ఇల్లు ?'' అడిగాడు కృష్ణ

''మూడు కిలోమీటర్లుండవచ్చు '' అందామె

రిక్షా కుదుపులకు అతని శరీరం తగులుతూంటే సిగ్గుగా ఉందామెకి

ఆమె స్పర్శ అతనిలో కలవరం కలిగిస్తోంది తను ఎంత వద్దనుకుంటున్నా పరిస్థితులన్నీ తనకు వ్యతిరేకంగానే ఉన్నాయ్

''మీరు మరి కిందకు జారి కూర్చున్నారు ఇబ్బందిగా లేదూ ?'' నొచ్చుకుంటూ అడిగిందామె

''ఫరవాలేదు ''

''సారీ! నామూలాన మీకు శ్రమ ''

''మీరేం చేయగలరు దీనికి ''

రిక్షా ఆమె ఇంటిముందాగింది

అతను దిగి రిక్షా అతనికి డబ్బివ్వబోయాడు

''ప్లీజ్ మీరివ్వకండి! నేనే ఇస్తాను'' అతని చేతిని తన చేత్తో పట్టుకుని ఆపిందామె

వెనక్కు తగ్గాడు కృష్ణ

బాగ్‌లోనుంచి పదినోటు తీసి రిక్షా అతనికిచ్చింది ఉష

''మీరు ఇదే రిక్షాలో మీ ఇంటికి వెళ్ళకూడదూ ?'' అడిగిందామె

''వద్దులెండి! బస్‌లో వెళ్తాను ''

''బస్‌లు నడుస్తున్నాయో లేదో ?''

''లేపోయినా ఫరవాలేదు రాత్రుళ్ళు నడిచి వెళ్ళడం నాకలవాటే !''

ఆమె ఆశ్చర్యపోయింది

''అంత దూరం నడిచి వెళ్తారా ?''

''నథింగ్ ఈజ్ టూ ఫార్ '' నవ్వుతూ అని వెనక్కు తిరిగాడతను

''ఆగండి! ఈ రాత్రిలో మీకింకా భోజనం ఎక్కడ దొరుకుతుంది ? మా ఇంట్లో భోజనం చేసి వెళ్ళరు గాని ''

''ఇంతవరకూ నన్ను శ్రమ పెట్టానన్నారు—ఇప్పుడు మీకెందుకు శ్రమ —'' నవ్వుతూ అని వెళ్ళిపోయాడతను

ఉషకు కోపం ముంచుకొచ్చింది

అసలు అతనిని అడగడమే తన తప్పు

అతనకి మాట్లాడడం కూడా తెలీదు మేనర్స్ తెలీదు మర్యాద తెలీదు అలాంటి వ్యక్తిని గౌరవంగా పలుకరించడం, ఆహ్వానించడం, అనవసరం తెలివితక్కువ తనమూనూ !

తలుపు తట్టిందామె

తల్లి తలుపు తెరిచింది

''నీకోసమే ఇప్పటి వరకూ చూసి ఇప్పుడే పడుకున్నాను ఎందుకింత ఆలస్యం అయింది?'' అడిగిందామె

''మా ఆఫీస్ దగ్గర ఏవో గొడవలయి నాయమ్మా! రోడ్డుమీదకు రావడానికే వీల్లేకపోయింది ఇప్పటికి గాని తగ్గలేదవి ఇప్పుడే మా ఆఫీసతను కూడా వచ్చి ఇక్కడ వదలి వెళ్ళాడు—''

''ఏద భోజనం చేద్దువుగాని పొద్దున్ననగా తిన్న అన్నం '' అంటూ లోపలకు నడిచిందామె ఉష కూడా ఆమెననుసరించింది

భోజనం చేస్తూ ''ఏమయినా ఉత్తరాలొచ్చాయా ?'' అనడిగింది ఉష

''ఏదో ఒక కవరు వచ్చింది '' అందామె

''ఎక్కడినుంచి ?''

''ఏమో! నేను మాశ్ళేదు — అలాగే బల్లమీద పడేసి ఉంచాను ''

ఉష భోజనం ముగించి గదిలోకొచ్చి ఆ కవర్ తీసి ఆత్రుతగా చూసింది

బాంక్ నుంచి వచ్చిందది

యంత్రాంగం

గురి
పెద్దపులి
మీదికే
గుండు
మాత్రం
మేకపిల్ల
గుండెల్లోకి !!!

- సింహం

ఒకవేళ తను పరీక్షలో పాసయిందా ?

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో కవరు చింపి లోపలి కాగితం బయటకులాగి చూసింది

మరుక్షణం ఆమె హృదయం ఆనందంతో నిండిపోయింది

అవును తను పాసయింది

ఇప్పుడు ఇంటర్వ్యూకెళ్ళాలి

తనకెందుకో పూర్తి నమ్మకముందిప్పుడు ఈసారి తను ఇంటర్వ్యూలో తప్పక సెలక్టవు తుంది

ఆ ఉద్యోగం దొరికిందంటే తనకున్న ముఖ్యమయిన సమస్య పరిష్కారమయిపోతుంది అదేమిటంటే తనూ తన తల్లీ ఎవరి సహాయం లేకుండా బ్రతకటం —

ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదామెకి

రేపేవార్త ఆఫీస్‌లో చెప్పిందంటే ముందు రాజయ్య ఖంగారు పడతాడు ఎందుకంటే అతను మళ్ళీ ఓ టైపిస్ట్‌ని వెతుక్కోవాలి పైగా ఆ అమ్మాయికి మళ్ళా మిగతా మాగజైన్‌కి సంబంధించిన పనులన్నీ నేర్పాలి

కృష్ణ ఒక్కడూ ఎన్ని పనులని చేసుకో గలడు ?

తను లేకపోతే ఇంక అతను ఇంటికి వెళ్ళేందుకు కూడా తీరికలేనంతటి పని మీదపడుతుంది

ఆమె మనసంతా బాధతో నిండిపోయింది

తనకుద్యోగంవస్తే అది అతనికి పనిష్మెంట్ !

అంతేకాదు ఆ ఉద్యోగంతోపాటు అతనికి కూడా తాను గుడ్‌బై చెప్పాల్సిందే !

నిజమే ! ఇంతవరకూ తానీ విషయమే ఆలోచించలేదు అతనికి తనంటే ప్రేమ లేకపోయినా, తన మీద అభిమానం లేకపోయినా, తనను నిర్లక్ష్యం చేసినా అతని మీద తనకేర్పడ్డ ప్రేమ అలానే ఉండిపోయింది అతనికి దగ్గరవా లనీ, అతని జీవితం పలికిన అపశృతిని మరపింప జేయాలనీ— గుండెల్లో నిండిన కోరికలు చెక్కు చెదరలేదు

మర్నాడు ఆమె ఆఫీస్‌కొస్తూనే కృష్ణ దగ్గరకెళ్ళి తనకు బాంక్‌లో ఇంటర్వ్యూ వచ్చిన విషయం తెలియజేసింది

తనూహించినట్లు అతనిలో ఏమాత్రం చలనం కనిపించకపోయేసరికి అతనిమీద కోపం వచ్చిందామెకి

''ఎప్పుడు ఇంటర్వ్యూ ?'' ఆమె వంక చూడకుండానే అడిగాడతను

''వచ్చే సోమవారం !''

''విష్‌యూ గుడ్‌లక్ !''

''ఓహో మీకలా విష్ చేయడం కూడా వచ్చన్నమాట !'' కావాలనే అందామె

అతను మాట్లాడలేదు

''ఓసారి ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ ఫైల్ ఇస్తారా ?'' అనడిగాడు—

కొద్దిక్షణాలాగి

ఆమె ఫైల్ అతని చేతికివ్వకుండా విసురుగా అతని టేబుల్ మీదకు విసిరేసింది

ఆమె ఇంటర్వ్యూ వార్త తెలుస్తూనే రాజయ్య వైఖరి మారిపోయింది ఆమెమీద ఎక్కడలేని చిరాకూ ప్రదర్శించసాగాడు

''ఇలా ఆర్నెల్ల కొకసారి మారిపోతూంటే ఇంక ఆఫీసేమవాలి ? కొత్తవాళ్ళకి మళ్ళీ ఎబిసిడి దగ్గర్నుంచీ ఎవరు నేర్పుతారు ? ఇక నుంచీ కనీసం అయిదేళ్ళయినా పని చేయాలని బాండ్ రాయిస్తాను అప్పుడు గాని ఈ తలనొప్పి పోదు '' అంటూ రుసరుసలాడాడు

ఉష అది తనకేం పట్టనట్లు ఊరుకుంది

తనకు బాంక్ ఉద్యోగం రావడం ముఖ్యం అతనేమనుకుంటే తనకేం ? ఇంటర్వ్యూ జరిగి నెల రోజులయినా ఏ విషయమూ తెలియక పోయేసరికి ఆమెకి ఆత్రుత పెరిగిపోసాగింది ఆత్రుతతోపాటు నిరాశ, నిరుత్సాహం—

ఒకవేళ ఈసారికూడా ఫెయిలయిందేమో—

రాజయ్య కృష్ణనీ, ఉషనూ ఆ సాయంత్రం ఆఫీసయ్యాక ఆఫీస్‌లోనే ఉండమని చెప్పాడు పొద్దున్నే ! అతనికోసం ఎదురుచూస్తూ కూర్చోవాల్సివచ్చిందిద్దరికీ ! చీకటి పడ్డాక ఏడు గంటలకు తిరిగి వచ్చాడతను

''మరేం లేదు మనకు పోటీకి నవలలు, కథలు చేర్చాల్సిన గడువు కిందటి నెలతోనే అయిపోయింది కదా ! ఈ సంచికలో ఫలితాలు ప్రకటించాలి ఆ విషయం నిర్ణయించడానికే పిలిచాను '' అన్నాడతను

''అవి ఇంతవరకూ ఎవరూ చదవలేదుగా ! ఏం చేద్దామంటారు ?'' అడిగాడు కృష్ణ

''ఏం చదవక్కరలేదు. ఇదిగో ఈ ఫోటో ఆ కథలూ నవలలూ చదివిన జడ్జిగారిది అంటే అవన్నీ చదివి ందులో బహుమతికి తగ్గవి ఎన్నుకోడానికి మనం ఈయనను జడ్జిగా నియమించామన్న మాట ! అర్థమయిందా ?''

''అయింది సార్ ! కానీ మరి ఆయన ఆ కథలూ నవలలూ ''

''చదివినట్టే లెక్కయ్యా ! ఆమాత్రం అర్థం చేసుకోలేవూ - ఆయన అవన్నీ చదివి, ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇలా ఉంటుంది విను !''

''పోటీకి వచ్చిన నవలలూ, కథలూ ఏవీకూడా బహుమతికి తగ్గ స్థాయిలో కనిపించ లేదు కనీసం ఆ స్థాయికి దగ్గరగా ఉన్నా బహుమతి ఇవ్వవచ్చని అనుకున్నాను కానీ నా ఆశ నిరాశే అయింది కనుక ఏ నవలకూ, కథకూ కూడా బహుమతి ఇవ్వటంలేదు వచ్చిన నవలలలోనూ కథలలోనూ నాకు నచ్చినవి సాధారణ ప్రచురణకు స్వీకరించాను '' ఇది జడ్జి స్టేట్‌మెంట్

ఈ సంచికలోనే మన ఎడిటోరియల్ కూడా రాసెయ్

ఇలా బహుమతుల స్థాయికి సరిపడే రచనలు మాకు రానందుకు ఎంతో విచారం కలిగింది మన తెలుగు రచయితలు రచయిత్రులు — మిగతా ఏ భాషా రచయితలకూ తీసిపోరని అదివరకు అనేక సందర్భాలలో ఋజువయింది అయినా ఇలాంటి 'వాసి' రావడం నిజంగా మా దురదృష్టం పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన రచనలు ఈ సంచికనుంచే ప్రచురించడం ప్రారంభించాము వాటికి పారితోషికం అదివరకటిలాగానే పంపబడ తుంది ఎడిటర్ —''

ఇలా ఉండాలి ఎడిటోరియల్ ఈ మేటరంతా తయారుచేసి ప్రెస్ కిచ్చి ఇంటికి వెళ్ళిపోండి ఇంకేమయినా సందేహాలున్నాయా ?'' కృష్ణ తన చేతిలోని ఫోటో వంక చూశాడు

''ఈ పోటీ జడ్జిగారి గురించి ఏమి రాయమంటారు ?'' అడిగాడు కృష్ణ

''ఆయననుగురించి ఏముంది రాసేందుకు ?''

''నా ఉద్దేశ్యం ఆయన ప్రముఖ రచయిత అనో, విమర్శకుడు అనో, లేక ఇంకా వేరే అర్హతలేమున్నాయో రాయాలికదా ''

''ఇదిగో కృష్ణా ! నీకు సాహిత్యం గురించి ఓనమాలు రావు రానివాడివి రానట్లు ఉండాలి రచనలు ఎన్నికచేసే జడ్జికి ఫలానా క్వాలిఫికేష నుండాలని ఎక్కడయినా రూలుందా ? రచయితలే జడ్జీలవాలని ఎవరేనా నిబంధన పెట్టారా ? అది మనిష్టం ! మొదటిసారి పోటీలు నిర్వహించి నప్పుడు మా బామ్మర్దిని జడ్జిగా పెట్టాను వాడేం రచయితా ? కాదే ! మా ప్రెస్ లో మిషన్‌మన్ ! అయితేనేం ? చక్కని రచనలు సెలక్ట్ చేశాడు ఆ తరువాత పోటీల్లో మా ఫ్రెండ్ శేఖర్రావుగారిని జడ్జిగా పెట్టాను ఆయన చిన్నప్పుడు రెండు కథలు రాశాడు అంత మాత్రాన రచనలను జడ్జి చేయలేకపోయా డనుకున్నావా ? ఫస్ట్‌క్లాస్‌గా చేశాడు కోడిగుడ్లు అమ్ముకోవటంలోనేకాదు ఇందులోనూ ఘనుడినే అని ప్రూవ్‌చేశాడు ఆ తర్వాత పోటీకి మల్లేశ్వర్రావ్ జడ్జిగా ఉన్నాడు ఆయన రేడియోలో వారంవారం జోకులు చెప్పేవాడు కిందటేడు మన హబీబే జడ్జిగా ఉన్నాడు గేయాల పోటీకి

కనుక అలాంటి భ్రమలేమీ పెట్టుకోకు ! మన పత్రికే కాదు మిగతా తెలుగు పత్రికలన్నీ కూడా ఇలాంటి పద్ధతే అనుసరిస్తున్నాయ్ సాహిత్యం కూడా రాజకీయాల్లాంటిదే అక్కడ మంత్రులకు ఏం అర్హత ఉందని మంత్రులవు తున్నారో—ఇక్కడ ఎడిటర్లూ అదే అర్హతతో ఎడిటర్లవుతున్నారు అక్కడ మంత్రులు తమ మిత్ర బంధువర్గాల్ని ఎలా కమిటీ మెంబర్లు గానూ చైర్మన్లుగానూ నియమిస్తారో ఇక్కడా ఎడిటర్లు తమ బంధుమిత్రులను పోటీల జడ్జీల గానూ, కమిటీ మెంబర్లగానూ నియమిస్తారు అర్థమయిందా ?''

''అయిందండీ'' అంది ఉష
''అయితే నేవెళ్తున్నాను మరి ''
''ఓకేసార్ ''
రాజయ్య వెళ్లిపోయాడు
తల గట్టిగా పట్టుకూర్చుంది ఉష
''నాకు తలనొప్పి పట్టుకుంది మీరు దయచేసి కొంచెం ఆ హోటల్లో కాఫీ ఆర్డర్ చేస్తారా ?'' కృష్ణ నడిగిందామె
అతను వెళ్ళి కాఫీ ఆర్డర్ చేసి వచ్చాడు

జీవితం — సెంటిమెంట్

ఇద్దరూ పక్కపక్కనే కూర్చుని రాజయ్య చెప్పిన విషయాలు ప్రకటనలుగా తయారు చేశారు
''ఇంక మీరు ఇంటికెళ్ళండి! నేను ప్రెస్‌లో ఇచ్చేస్తాను '' అన్నాడు కృష్ణ
''ఇలా పాఠకులనూ, రచయితలనూ మోస గించటం అన్యాయం కదూ ?'' అడిగింది ఉష
కృష్ణ నవ్వాడు
''ఈ ఒక్క పత్రికే కాదుగా! చాలా పత్రికలూ ఇంతేనని రాజయ్య గారంటున్నారు ఇంక ఎవరు మాత్రమేం చేయగలరు ?''
ఆమె వెళ్ళిపోయింది
మేటర్ ప్రెస్‌లో ఇచ్చి తను హోటల్లో బ్రెడ్ తిని ఇంటికి చేరుకున్నాడతను
అప్పటికే టైమ్ పదకొండయిపోయింది

(ఇంకా వుంది)



నిజాంకు హైదరాబాద్ కమ్యూనిస్టుల వంతపాట

సంస్థానాల ఏకీకరణోద్యమంలో నూతన ఘట్టం

హైదరాబాద్ సంస్థానంలోని కమ్యూనిస్టు పార్టీపై ఆంక్ష తొలగించుచు సంస్థాన ప్రభుత్వ మీ మధ్యనే ఒక ప్రకటన చేసినది సంస్థాన పరిపాలనలో అన్ని వర్గముల సహకారమును తాను కాంక్షించుచున్నట్లు నిజాం ప్రకటించిన తరువాత జరిగిన గమనీయమగు చర్య ఇది ఒక్కటియే సంస్థాన కాంగ్రెస్ ప్రారంభించిన సత్యాగ్రహోద్యమములో అరెస్టయినవారిని కొంతమందిని కూడ విడుదల చేసిరి సంస్థాన కాంగ్రెస్ అగ్రనాయకులు, కాంగ్రెస్ ఆదేశానుసారముగ ఉద్యమములో పాల్గొన్నవారిలో అత్యధిక సంఖ్యాకులు ఇంకను జైళ్లలో మగ్గుచునే యున్నారు బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన విషయము ఇదివరకటియట్లే అనిశ్చితముగానే యున్నది నిజాం ఫర్మానావలన ఏకైక కార్యము కమ్యూనిస్టుపార్టీపై ఆంక్ష తొలగించటమేనని చెప్పక తప్పదు సంస్థాన కాంగ్రెస్ నాయకులను జైళ్ళలోనే వుంచి, కమ్యూనిస్టులపై ఆంక్ష తొలగించుట, అన్ని వర్గముల సహకారము ఆపేక్షించి కాదని ఇట్టి పరిస్థితులలో అనుమానించవలసి వస్తున్నది ఆంక్ష తొలగించగానే తన పంథాను మారిస్తూ కమ్యూనిస్టుపార్టీ చేసిన ప్రకటన ఈ అనుమానమునే బలపరచుచున్నది

హైదరాబాద్ సంస్థానము భారత యూనియన్‌లో చేరకూడదు, సంస్థానములో వెంటనే బాధ్యతాయుత ప్రభుత్వము స్థాపించ కూడదనుటయే కమ్యూనిస్టుపార్టీ విధానములోని ముఖ్య సూత్రములు సంస్థాన సర్వస్వతంత్రతను కాపాడుచూ, నిజాంను నాశన మొనర్చి తర్వాత ప్రజలకు స్వయం నిర్ణయ హక్కు యిత్తురట!

హైదరాబాద్ కమ్యూనిస్టు ప్రజలకు చేసిన విజ్ఞప్తిలో ధాదాపు సగభాగము నెహ్రూ ప్రభుత్వమును తూలనాడుటయే ఆగస్టు 15వ తేదీన భారతదేశమునకు స్వాతంత్ర్యము లభించి, నెహ్రూ ప్రభుత్వము అధికారము స్వీకరించిన తర్వాత ఆ ప్రభుత్వము బ్రిటిష్ సామ్రాజ్యవాదులతోను, భారతీయ పెట్టుబడిదార్లతోను చేతులు కలిపి పనిచేస్తున్నది భారత ప్రజలు ఈ ప్రభుత్వ హయాములో అనేక బాధలనుభవిస్తున్నారు హైదరాబాద్ కూడ భారత యూనియన్‌లో చేరిపోయినచో ఆ బాధలే హైదరాబాద్ ప్రజలకుకూడ వాటిల్లును పైగా భారతీయ పెట్టుబడిదారులు హైదరాబాద్‌లో కూడ స్థావరము లేర్పరచుకొని ఇచ్చటి పెట్టుబడదార్లకు తోడయ్యెదరు, కాబట్టి సంస్థానం భారత యూనియన్‌లో జేరరాదు అని కమ్యూనిస్టు విజ్ఞప్తి తెలియజేస్తున్నది సంస్థానములో ఇప్పుడు బాధ్యతాయుత ప్రభుత్వము స్థాపింపబడినచో ఆ ప్రభుత్వములో సంస్థానకాంగ్రెస్‌కు ప్రాబల్యము వుండి, సంస్థానము భారత యూనియన్‌లో జేరవలసివచ్చును అందువలన ఇప్పుడు బాధ్యతాయుత ప్రభుత్వము పనికిరాదనుటయే కమ్యూనిస్టు మతము

కమ్యూనిస్టుపార్టీ అనుసరింపదలచుచున్న ఈ విధానము హైదరాబాద్ ప్రజలకు, భారత ప్రజలకు అనర్థదాయకమై నదగుటయేగాక భారత కమ్యూనిస్టుపార్టీ విధానమునకుకూడ విరుద్ధముగా నున్నది తమపై ఆంక్ష తొలగించినందుకు నిజామునకు కృతజ్ఞతగా కమ్యూనిస్టులీ విధానమును అనుసరింపదలచి యుండవచ్చును, లేదా వీ రిట్టి విధానము ననుసరింతురని దృఢవిశ్వాసము కల్గిన పిమ్మటనే వీరిపై నిషేధము తొలగింపబడి యుండవచ్చును

ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ ఇన్నాళ్ళనుండి 'విశాలాంధ్ర' సాధించుటకొరకు, తెలంగాణాను సర్కారు, రాయలసీమ ఆంధ్రులతో కలుపుటకు కృషి చేస్తున్నట్లు నటిస్తున్నది నిజాంపై తెలంగాణా సోదరులు జరుపుచున్న పోరాటములో పాల్గొనవలసినదని వీరి పత్రికలు పదే పదే ఘోషించుచుండెడివి మహారాష్ట్ర, కర్నాటక కమ్యూనిస్టు పార్టీలు కూడా ఇట్లే ప్రచారము చేయుచుండెడివి ఇప్పుడు హైదరాబాద్ స్వతంత్రముగా నుండిపోవలెనని, భారత యూనియన్‌లో జేరరాదని వీరే చెప్పచున్నారు సంస్థానము భారత యూనియన్‌లో జేరిన అచ్చటి ధనికవాదులుకూడ పీడింతురని వీరు ప్రజలకు చెప్పచున్నారు వీరి మతము ప్రకారము కమ్యూనిస్టులు కానివారందరు ప్రజలను పీడించెడువారే ఒకవేళ భారతదేశములోని పెట్టుబడిదారులు ప్రజలను పీడించుచున్నచో భారత ప్రజలతోపాటు సంస్థాన ప్రజలనుకూడ కలిపి, సంఘటితపరచి, వారి నెదుర్కొనరాదా? ఏ ప్రాంతపు ప్రజలు ఆ ప్రాంతపు పెట్టుబడిదారుల తోనే పోరాడినచో ప్రజా ఉద్యమము బలహీనమైపోదా? భారతదేశము ఇన్ని విభాగములై బలహీనమైపోవుట ప్రజల శ్రేయోభివృద్ధికి అవుసరమనియే వీరి భావనయా? లేక రష్యాకు ఒక్కొక్క ముక్కను క్రమేపీ కట్టిపెట్టుట కిది యొక పన్నాగమా? నిజాం నవాబు తమ పార్టీపై నిషేధమును తొలగించిన స్వల్ప బహుమతికే వీరు తమ 'విశాలాంధ్ర' 'ఐక్య కర్ణాటక' ఆశయములకు తిలోదకము లిచ్చుటకు సంసిద్ధపడిరన్నచో, వీరెట్టి ప్రజాశ్రేయస్కాములో స్పష్టపడుచున్నది సంస్థానము బాధ్యతాయుత ప్రభుత్వము స్థాపింపనూవలదు, సంస్థానము భారతదేశములో చేరనూవలదని ప్రచారము ప్రారంభించుటతో వీరు ఇత్తేహాద్ ముసల్మీన్‌ను, నిజాం నవాబును బలపరచుటకు పూనుకొనిరని స్పష్టపడినది ముస్లిమేతరులలో సంస్థాన కాంగ్రెస్ పలుకుబడిని రూపుమాపుటకు వీరిక బ్రహ్మాండమైన ప్రయత్నములు ప్రారంభించవచ్చును

నిజాంతో ప్రత్యక్ష పోరాటము జరిపి ప్రజాప్రభుత్వమును సాధింతుమని వీరిప్పుడు పైకి చెప్పచున్నను జరుగునది శూన్యమే పోగా, పగలు ఇత్తేహాద్ రజాకార్లు దోచుకొన్న గ్రామస్థులపై పడి రాత్రుల వీరుకూడా దోచుకొని, హింసలపాలు జేయుట ఇప్పటికన్న ఎక్కువ కావచ్చును సంస్థానములో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వమును స్థాపించకుండుటకు ఈ. అశాంతి నిజాంకు మరొక కారణమగును హైదరాబాద్ కమ్యూనిస్టుల ఇప్పటి ధోరణి 1942 వ సం ఆగస్టు విప్లవమునాటి భారత కమ్యూనిస్టుల ప్రతీప విధానమును మరపించుచున్నది

సంస్థాన ఏకీకరణలో నూతన ఘట్టం

భారతదేశము స్వతంత్రమైన తరువాత సంస్థానములలో విప్లవకరమగు మార్పులు, ఊహించలేనంత త్వరగా జరిగినవి చిన్న చిన్న సంస్థానములను సంశ్లిష్ట రాష్ట్రములతో కలిపివేయుట, వీలైనచోట్ల కొన్ని సంస్థానములను ఒక యూనియన్‌గా ఏకీకరణ మొనర్చుట ఇప్పటికి దాదాపు పూర్తియైనది తూర్పు పంజాబ్ సంస్థానము లన్నీ కలసి ఫుల్కియన్ సమాఖ్యగా పాటియాలా మహారాజా ఆధ్వర్యమున ఏర్పడినవి ఇండోర్, గ్వాలియర్, మాళ్వా సంస్థానములు "మధ్యభారత" సమాఖ్యగా కలసిపోవుటకు నిర్ణయించుకున్నవి ఈ సమాఖ్య మే 14వ తేదీన అమలులోనికి వచ్చును అప్పటితో చిన్న సంస్థానముల ఏకీకరణ ఉద్యమంలో ప్రథమ ఘట్టము పూర్తియగును బ్రిటిష్ పరిపాలన కాలమున దాదాపు ఆరువందల సంస్థానములుండెడివి, ఇప్పుడు వాని సంఖ్య 20కి మించి వుండదు వీటన్నిటిలోను బాధ్యతాయుత ప్రజాప్రభుత్వము ఏర్పరచ బడినది

సంస్థానములు భారత యూనియన్‌లో జేరునప్పుడు రక్షణ, రాకపోకలు, విదేశ వ్యవహారములను మూడు శాఖల పైననే అధికార దత్తత

చేయబడినది అమాత్యత్రయ పథకము ప్రకారము కేంద్ర ప్రభుత్వమునకు ఈ మూడు అధికారములే యుండును గాబట్టి సంస్థానములు, రాష్ట్రములు ఒకేవిధమైన అధికారము గలిగి యుండునని అప్పుడు భావించబడెను దేశము విభజితమైపోయిన తర్వాత భారత యూనియన్ కేంద్రప్రభుత్వము బలవత్తరముగా నుండవలెనని రాష్ట్రప్రభుత్వములు, కేంద్రప్రభుత్వముకూడ వాంఛించినవి రక్షణ, రాకపోకలు, విదేశ వ్యవహారములపైననే అధికారముగల కేంద్రప్రభుత్వం దుర్బలమైయుండును అందువలన కేంద్ర ప్రభుత్వమున కింకా ఎక్కువ అధికారములను వుంచవలెనని రాజ్యాంగ పరిషత్తు నిర్ణయించినది క్రొత్త రాజ్యాంగ చట్టము ప్రకారము ఏర్పడగల కేంద్రప్రభుత్వమునకు ఇప్పటి కేంద్ర ప్రభుత్వమునకున్నన్ని అధికారములు వుండును కాబట్టి సంస్థానములు పై మూడు శాఖల అధికారములే దఖలు పరచినచో, కేంద్ర ప్రభుత్వమునకు కొన్ని ప్రాంతములపై ఎక్కువ అధికారమును, మరికొన్ని ప్రాంతములపై పరిమితమైన అధికారమును కలిగియుండును కేంద్రప్రభుత్వ చట్టములు కొన్నిప్రాంతములకు మాత్రమే వర్తించి, ఇతర ప్రాంతములకు వర్తింపకుండు పరిస్థితి గందరగోళమునకు దారి తీయును అట్టి పరిస్థితి ఏర్పడకుండవలెనన్న, సంస్థానములు పై మూడు శాఖల అధికారములనే గాక, రాష్ట్రప్రభుత్వములెన్ని అధికారములను కేంద్రప్రభుత్వమునకిచ్చుచున్నచో సంస్థానములు కూడ అన్ని అధికారములు దఖలు పరచవలసి యుండును సంస్థాన ఏకీకరణ ఉద్యమంలో ప్రథమఘట్టం ముగిసిన తరువాత ఈ నూత్న ఘట్టమునకు ప్రాముఖ్యత వచ్చినది సంస్థాన శాఖ ఇప్పుడీ విషయమును కూడ జయప్రదముగ సాధింపగల్గినది 1935వ సం భారత రాజ్యాంగ చట్టములో కేంద్రప్రభుత్వమునకు ప్రత్యేకించబడిన అధికారములు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు రెండును వ్యవహరించవచ్చునని నిర్దేశించిన శాఖలు, రాష్ట్రప్రభుత్వములవలెనే, సంస్థానములుకూడ భారత యూనియన్ కేంద్ర ప్రభుత్వమునకు దఖలు పరచుటకు ఇప్పుడు అంగీకరించినవి అయితే, పన్నులు విధించు అధికార మొక్కటి మాత్రము మినహాయింపబడినది ఈ మినహాయింపు జరుగకున్నచో రాష్ట్రప్రభుత్వములకు, సంస్థానముల ప్రభుత్వములకు ఎట్టి భేదమును వుండదు ఈ మార్పులను అంగీకరించుచు తయారు చేయబడినమూత్న ఒడంబడిక పత్రమును ఆమోదించుటకు కథియవాడ్, రాజాస్థాన్, వింధ్యప్రదేశ్, మత్స్య సమాఖ్యల రాజప్రముఖ్‌లు నిర్ణయించిరి క్రొత్తగా ఏర్పడుచున్న పుర్కియన్, మధ్య భారత సమాఖ్యల అధికారదత్తత ఒడంబడికలోనే ఇట్టి మార్పులు

నిజాంకు....వంతపాట

చేయబడును పెద్దసంస్థానములగు మైసూర్, తిరువాన్కూర్, భోపాల్‌లు కూడ ఈ సమాఖ్యల మార్గమునే అనుసరించి అదనపు అధికారములను కేంద్రప్రభుత్వమునకు దఖలుపరచవలసి యున్నది. ఇందుకు సంస్థానశాఖ త్వరలోనే పూనుకొనునని విశ్వసించవచ్చును

మహారాష్ట్ర రాజకీయాలు

మహారాష్ట్ర రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడు జేధే, రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గసభ్యుడు మోరే గారలు తమ అనుచరులతోసహా కాంగ్రెస్‌నుండి విడిపోయి 'బహుజనసమాజ్' అను క్రొత్త రాజకీయపక్షమును ఏర్పాటు చేయుచున్నారని ఈమధ్య వార్తలు వచ్చినవి ఒక రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడే కాంగ్రెస్ నుండి విడిపోయిన ఆ ప్రాంతములో కాంగ్రెస్ పలుకుబడి చాలవరకు దెబ్బతినునని సామాన్యముగా భావించవచ్చును కాని జేధే మోరే వర్గము విడిపోవుట వలన కాంగ్రెస్ పలుకుబడి ఏమంత దెబ్బతినకపోవచ్చునని యే అభిజ్ఞులు అభిప్రాయపడుచున్నారు


మహారాష్ట్రులకు, ఆంధ్రులకువలెనే, వ్యక్తిగత స్వలాభాపేక్ష మెండు నిరక్షరాస్యులగు ప్రజలలో బ్రాహ్మణ, అబ్రాహ్మణ విభేదములను ప్రచారము చేసి, వ్యక్తిగత ప్రయోజనములను సాధించుకొనుటకే ప్రస్తుతము చర్యలు ఉద్దేశింపబడినట్లు తెలుస్తున్నది బ్రాహ్మణ, అబ్రాహ్మణ భావము లింతవరకు మహారాష్ట్రములో బాగా వ్యాపించలేదు ఇప్పుడది జరుగవలెనని కొందరు భావించిరి కాని వారి అనుచర వర్గములోనే విభేదములు పుట్టి కొంతమంది బ్రాహ్మణేతరులు కాంగ్రెస్ నుండి పోవుట జరిగినది కాంగ్రెస్‌లో నున్న బ్రాహ్మణేతరుల సంఖ్యతో పోల్చిచూచినచో వీరి సంఖ్య అతి స్వల్పమని తెలియును కాని మత విభేదములే పనికిరావని మనము భావించుచున్న ఈ సమయమున, మత సంస్థలన్నియు రద్దు చేయబడిన తరువాత, మతశాఖల విభేదములు తిరిగి తలయెత్తుట, కాంగ్రెస్ ఐక్యతను విచ్ఛిన్న మొనర్చుట మిక్కిలి శోచనీయము

జేధే—మోరె వర్గము 'బహుజన సమాజ' మను పేరుతో కాంగ్రెస్‌లో ఒక శాఖగా చాల రోజులనుండి వ్యవహరించుచున్నది రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనాయకులతోను, బొంబాయి మంత్రివర్గ సభ్యులతోను జేధెకు సరిపడలేదు అందువలన 'బహుజన సమాజ్' నాయకుడుగా తనకుగల పలుకుబడిని వుపయోగించి ఇతరులకు శాస్తి చేయవలెనని జేధే ఆలోచించెను మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, కాంగ్రెస్ కార్యదర్శియగు శంకరరావ్‌దేవ్, కేంద్రమంత్రి గాడ్గిల్‌గారలు ఈయనను మందలించిరి రాష్ట్ర కాంగ్రెస్ సంఘములోని బ్రాహ్మణేతర సభ్యులను సమావేశపరచి, కుల విభేదములనిప్పుడు త్రవ్వుకొనుటవలన రాగల నష్టములను వివరించి చెప్పిరి అంతటితో 'బహుజన సమాజ్' బలము తగ్గినది తన పక్షమును బలహీన మొనర్చినందుకు జేధేకు ఆగ్రహము కలిగి, కాంగ్రెస్‌నుండియే వైదొలగ నిశ్చయించినాడు ఈ కుల విభేదము లిప్పుడిట్లు రేకెత్తుటకు తప్పు శంకరరావ్‌దేవ్‌దైనా, జేధేదైనా అది తప్పక ఖండింపవలసినదే

రాజకీయముగా నూతన పక్షముగా 'బహుజన సమాజ్' మహారాష్ట్రలో పని చేయును ఈ పక్షము రైతుల శ్రేయోభివృద్ధికే పనిచేయునట జేధే—మోరేలు గాక బొంబాయి శాసనసభలోని 5 గురు సభ్యులు కూడ ఈ పక్షమున జేరినారు వీరు కాంగ్రెస్ సభ్యత్వముతో పాటు శాసనసభా సభ్యత్వమునకుకూడ రాజీనామా నిచ్చెదరో లేదో తెలియదు ఈ పక్షమును బలపరచుచున్న వారు కొందరు భారతదేశము బ్రిటన్, అమెరికాల పట్ల స్నేహభావముతో నుండకూడదనియు, రష్యా వర్గములో కలసిపోవలెననియు వాదింతురు ఈ పక్షమునకు పట్టణములలోని కార్మికులతో ఎక్కువ సంబంధ ముండదట గ్రామములలోనే తమ పలుకుబడిని వ్యాపింపజేసి కొనవచ్చునని జేధే తలంచుచున్నాడు కుల విభేదముల ప్రచారముతో పలుకుబడిని సంపాదించుటకు వీరు పూనుకొన వచ్చును తమతో ఏకీభవించు వారందరు కాంగ్రెస్ సభ్యత్వమునకు రాజీనామా నియ్యవలసినదని జేధే—మోరెలు విజ్ఞప్తి చేసినారు ఈ విజ్ఞప్తి ననుసరించి 10 వేల మంది వరకు కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వములకు రాజీనామా నివ్వవచ్చునని జేధే—ఆశించు చున్నాడు కాని ఇట్టివారి సంఖ్య 2 వేలకు కూడ మించి వుండదని మోరె అభిప్రాయ పడుచున్నాడు

కాంగ్రెస్ నుండి చీలిపోయినను, వేరొక రాజకీయ పక్షమును స్థాపించక, తమ పక్షములో జేరవలసినదని సోషలిస్టులు జేధే—మోరేలను ఆహ్వానించిరి వీరందుకు అంగీకరించలేదు జేధే—మోరేలు వైదొలగుట వలన కాంగ్రెస్ పలుకుబడి తగ్గిపోకుండ కాపాడుటకు కాంగ్రెస్ నాయకులు, ముఖ్యముగా బ్రాహ్మణేతరులు, గ్రామములందు తిరిగి ప్రచారము చేయుచున్నారు కాంగ్రెస్, సోషలిస్టు, బహుజన సమాజ్‌లలో ఏది మహారాష్ట్ర ప్రజల నెక్కువగా ఆకర్షించుకొనగల్గునో కాలమే నిర్ణయించును ★

ఆంధ్రపత్రిక
1948 మే 12
సంచిక నుంచి



ఈ సమాజం బాగుపడదు

"మిర్రర్"

''హైదరాబాద్‌లో ఇన్ని బ్రహ్మాండమైన బార్‌లు వుండగా ఈ రూమ్‌లో ఎరేంజి చేసావేమిటి'' అన్నాను

''బార్‌లో అయితే బిల్లు పెరిగిపోతోందన్న భయంతో కిక్కురాదు సరంజామా అంతా ముందే కొనేయటంవల్ల ఇక్కడ ఆ బాధ వుండదు దేర్‌ఫోర్ '' మిగిలిన మాటలు మింగేస్తూ అయిస్ క్యూబ్స్ గ్లాసుల్లో సర్ద సాగాడు రమణమూర్తి

సెక్రటేరియట్‌లో పనివుండి హైదరాబాదు వచ్చి రెండు రోజులు అయింది పని పూర్తి కాలేదు

ఇంకా రెండు రోజులువున్నా పని అయ్యేలా లేదు వుంటే మరింత ఖర్చు ఇప్పటికి ఇంటికి వెళ్ళి మరోసారి హైదరాబాదు వచ్చినా ఇంకా కొంత ఖర్చు అవుతుంది. ఏం చేయాలో తెలియక సెక్రటేరియట్ గార్డెన్‌లో ఓ చెట్టు కింద నిలబడి ఆలోచిస్తూండగా వెనకాలనుంచి వచ్చి వీపు తట్టాడు రమణమూర్తి

దాదాపు అయిదు సంవత్సరాల తరువాత కలిసాడు రమణమూర్తి అప్పట్లో ఇద్దరం ఒకే ఆఫీసులో పని చేసేవారం బెస్ట్ ఫ్రెండ్స్ కాకపోయినా, డియర్ ఫ్రెండ్స్‌గానే వుండేవారం తరువాత ఇద్దరికీ ట్రాన్స్‌ఫర్లు, ఆ పైన ఎవరికివారే అయిపోయాం

టాప్ లెవల్లో తెలిసిన వాడెవడో వుంటె, ఇన్‌ఫ్లూయెన్సు చేసి, క్షణంలో నా పని పూర్తి చేయించాడు రమణమూర్తి

తిరుగు ప్రయాణం అవుదామనుకుంటె –

''నా ఆతిథ్యం తీసుకోకుండానే వెళ్ళిపోతావా సాయంత్రం ఏడింటికి ఇంటికిరా'' అంటూ అడ్రసు ఇచ్చి, తనకి వేరే పనివుందంటూ బిజీగా వెళ్ళిపోయాడు

అడ్రసు వెతుక్కుంటూ వచ్చి ఇక్కడ తేలాను ఇది ఇల్లు అనేకంటె రూము అంటె బాగుంటుంది

నాలుగు కుర్చీలు, మధ్యలో టీపాయి అలమరాలో గ్లాసులు, కప్పులు, ఓ ఫ్లాస్కు కార్నర్‌లో మంచి నీళ్ళ కూజా చుట్టూ గోడలకి రెండు మూడు కాలెండర్లు

రమణమూర్తికి పెళ్ళి అయిందని విన్నాను

మరి పెళ్ళాం పిల్లలు ఏరి ?

అడగటం ఎందుకు ? తనే చెబుతాడులే అనుకుంటూ నా మనసులోఆరాటాన్ని కంట్రోలు చేసుకున్నాను

రమణమూర్తి గ్లాసులో మందు సర్దటం ముగించి నా ముందు ఒక గ్లాసు వుంచుతూ, ''నవ్ లెటజ్ స్టార్ట్'' అన్నాడు

''ఆ రోజుల్లో నీ అంత మంచి బాలుడు లేడన్నట్టుగా వుండేవాడివి ఈ మందు ఎప్పుడు అలవాటు అయింది'' అన్నాను గ్లాసు చేతిలోకి తీసుకుంటూ

నా ప్రశ్న వినిపించుకోకుండా –

''ఫర్ ది బెస్ట్ హెల్త్ ఆఫ్ సుమిత్ర'' అంటూ ఓ పెద్ద గుటకతో ప్రారంభించాడు

''సుమిత్ర ఎవరు ?'' అన్నాను నేను

''యు విల్ కం టు నో'' అంటూ దీక్షగా గ్లాసు కాళీ చేయసాగాడు రమణమూర్తి

రమణమూర్తి ఇంత హెవీగా పుచ్చుకుంటాడని అంచనా వెయ్యలేకపోయాను కాజువల్‌గా, ఎంజాయిమెంట్ కోసం అన్నట్టు కాక, ఏదో బాధను మరిచిపోవటం కోసం తాగుతున్నట్టుగా వుంది

''రమణమూర్తి ! ఐ హోప్ యు నో యువర్ కెపాసిటీ'' అన్నాను అతను మళ్ళీ తన గ్లాసు ద్రవంతో నింపుతుంటే

''డోన్ట్ వర్రీ'' అంటూ చిప్సు నమల సాగాడు.

ఈ సమాజం బాగుపడదు

రమణమూర్తి మైకంలో పడిపోతే, అతని భార్య పిల్లలు గురించి తెలుసుకునే అవకాశం వుండదు అతను తెలివిలో వుండగానే అడగాలి అనుకుంటూ —

''మీ ఇల్లు ఎక్కడ ?'' అన్నాను

''మలక్‌పేటలో టి వి టవర్ ఎదురుగా వున్న సందులో ఓ చిన్న ఇల్లు కట్టించాను ఆ మధ్య ''

''మరి ఈ రూము ?''

''ఇక్కడ సుమిత్ర వుంటూ వుండేది ''

''సుమిత్ర అంటే — లా ఎఫైరా !''

''కాదు ''

''మరి ''

''అదో కథ వినే ఓపిక వుందా ?''

''ష్యూర్ కేరీ ఆన్'' అన్నాను, మందు గొంతు దిగుతూంటే హుషారు పైకి తన్ను తూంది

''సుమిత్ర తండ్రికి ముగ్గురు ఆడపిల్లలు ఈమె ఆఖరుది వాళ్ల స్వంత వూరులోనే చదివి ఇంటరు పాస్ అయింది ''

''ఏ వూరు ?''

''రామాపురం తెనాలి దగ్గర '

''ఆ వూరు నువ్వెందుకు వెళ్ళావు ?''

''రామాపురం మా అత్తవారి వూరు ఒకసారి — అంటే మూడేళ్ళ కిందట కమలను పుట్టింటిలో దిగవిడవటం కోసం రామాపురం వెళ్ళాను అప్పుడు ఆమెకు ఎనిమిదవ నెల ప్రెగ్నెన్సీ ''

' వూ — ''

''వెంటనే తిరుగు ప్రయాణం లవుదా మనుకుంటే పండగదాకా వుండమని బలవంతం చేసారు అప్పటికి పండగ ఇంకా మూడురోజులు వుంది ''

''అయితే ''

''పండగ ముందు నేనున్న ఆ మూడు రోజులలో సుమిత్రతో పరిచయం అయింది '

''ఎలా''

''ఆ రోజు చిక్కుడు పందిరి కింద విశ్రాంతిగా పడుకుని ఏదో మాగజైన్ తిరగే స్తున్నాను ఇంతలో ఓ కాయితం వుండ వచ్చి నామీద పడింది ''

''ఊ''

''ప్రహరీగోడ అవతలివైపు నించి ఓ అందమైన ఆడపిల్ల నావైపు చూస్తోంది ఆ కాగితం విసిరింది ఆమేనని తెలుస్తోంది పెళ్ళి అయిన నాకు ప్రేమలేఖ వ్రాసి ప్రయోజనం ఏమిటి ?'' అనుకుంటూ ఆ కాగితం వుండని విప్పి చూసాను

''ఏముంది అందులో ?''

''దయచేసి నన్ను రక్షించండి— అన్న ఒక్క ముక్క వ్రాసి వుంది ''

త్రి సత్యాలు

కూలిన గోడల మీద
జిల్లేళ్ళు మొలుస్తాయి,
జారిన బతుకుల మీద
అపవాదులు నిలుస్తాయి !

*

బతికి చెడ్డవాడికి మిగిలింది
పూర్వ ఘనత నెమరువేత,
మత్తు దిగిన మధుపాయికి
వర్తమానం గుండెకోత !!

*

ప్రభుత్వాలు మారేక లభించేవి
సౌకర్యాలుకాదు, సంస్కరణలు !
అవి అమలు జరిగే లోగా
మారుతుంది మళ్లీ—ప్రభుత్వం!!

— లతిక

''   ''

''పల్లెటూళ్ళల్లో కొత్త అల్లుళ్ళను వరస అయిన వారు తమాషా కోసం ఆటపట్టిస్తారు ఈ అమ్మాయి నన్ను ఫూల్ చేస్తోందేమోనను కున్నాను కానీ ఆమె కళ్లల్లో ఏదో దైన్యం, నిస్సహాయతతో కూడిన బాధ లాంటిది అగు పించింది ''

''ఊ''

'ఏమిటి— అన్నట్టు చూసాను కానీ ఆమె ఏమీ చెప్పకుండానే గోడకి అటువైపున అదృశ్యం అయిపోయింది ''

''తరువాత''

''తరువాత ఎవరూ లేనప్పుడు నేను చూసేట్టుగా గోడమీద ఓ కాగితం పెట్టి వుంచి ఓ రాయి బరువు పెట్టింది ''

''ఆ కాగితంలో ఈసారి ఏం వ్రాసింది?''

''తన కష్టాలు అన్నీ ఏకరువు పెట్టింది ''

''అంత అందమైన అమ్మాయికి కష్టాలు ఏముంటాయి ''

''ఆమె తండ్రికి ముగ్గురు ఆడపిల్లలు అన్నాను కదా ఈమె ఆఖరుది ఈమె తరువాత ఇద్దరు మగ పిల్లలు ''

''   ''

''అప్పటికి ఈమె వయసు ఇరవై ఏళ్ళు అంటె నా భార్య, సుమిత్ర ఇద్దరూ ఒకే ఈడువాళ్ళు ''

నేను వింటున్నట్టుగా తలవూపాను

''సుమిత్ర అక్కయ్యలలో ఎవరికీ పెళ్ళిళ్ళు కాలేదు కాలేదు అనేకంటె, ఆమె తండ్రి ఆర్థిక ఇబ్బందులవల్ల పెళ్ళిళ్ళు చేయలేక పోయాడు సాధారణమైన కుటుంబం తక్కువ

ఆదాయం కట్నాలు ఇచ్చి పెళ్ళి చేయగల స్తోమతు లేదు చూస్తూ వుండగానే పెద్ద అమ్మాయికి ఇరవై ఆరు ఏళ్ళు వచ్చేసాయి వయసు ముదురుతున్నకొలదీ సంబంధాలు ఎక్కిరావటంలేదు దాంతో తండ్రికి దిగులు ఇంతలో ఆమె తల్లి మరణించింది ''

'' ''

''ఊళ్ళో అందరూ మీ పిల్లల పెళ్ళి ఎప్పుడు చేస్తావని అడుగుతుంటె, ఆ తండ్రికి పదిమందిలో అవమానంగా వుండేది అయినా చేయగలిగింది ఏమీలేదు ఒకప్పుడు డబ్బుంటే పెళ్ళిళ్ళు కుదిరిపోయేవే కానీ — ఇప్పుడు ఆ ఆడపిల్లలు ఇంత ఎదిగిపోయేసరికి అసలు సంబంధాలే రావటంలేదు ఇట్టి స్థితిలో దిక్కుతోచక ఆయన మెదలకుండా వుండిపోయాడు

తల్లి పోయిన కారణంగా సుమిత్ర పెద్ద అక్కయ్య వంట ఇంటికే అంకితం అయిపోయింది మిగిలిన ఇద్దరు ఆడపిల్లలు మిగతా ఇంటి పనులు పంచుకున్నారు

రోజులు గడుస్తుంటె వాళ్ళ తండ్రికి పిల్లల పెళ్ళి కాలేదనే దిగులు, బయట పదిమందిలో మరింత తేలిక మాటలు అధికం అయ్యాయి ఆ బాధలో —

ఆడపిల్లలను బయటకు ఎక్కడికీ వెళ్ళవద్దని కట్టడి చేసాడు ఆఖరుకు ఊళ్ళో శ్రీరామ నవమి ఉత్సవం జరిగినా, తెలిసినవారింటిలో శుభకార్యం జరిగినా కూడా ఇల్లు కదలనిచ్చేవాడు కాదు

ఇంటి పని చేయటం, తినటం, నిద్ర పోవటం ఎంతసేపూ ఇదే జీవితం ఆ ఇల్లు ప్రాక్టికల్‌గా జైలులాగా తయారు అయింది ఆ ఆడపిల్లలకు

జైలులో అయినా ఏదైనా ఎంటర్‌టెయిన్‌మెంట్ వుంటుంది కానీ, ఇక్కడ అదీలేదు కనీసం ఓ సినిమా, ఓ వారపత్రిక, ఓ బంధువుల ఇంటికి వెళ్ళటం, అలాంటివి ఏమీ లేక ఆ నాలుగు గోడలమధ్య తాము యావజ్జీవన కారాగారవాసం అనుభవిస్తున్నట్టు, ఎవరో తమ గొంతు బలవంతాన పిసుకుతున్నట్టు, ఊబిలోకి తోసి పైకి రాకుండా కాలుతో నొక్కుతున్నట్టు ఫీల్ కాసాగారు మిగిలిన ఇద్దరి మాట ఎలా వున్నా సుమిత్ర మాత్రం ఆ ఇంటి పరిస్థితులలో ఎడ్జస్టు కాలేకపోయింది ''

రమణమూర్తి కొంచెంసేపు మవునంగా వుండిపోయాడు

కథ మరీ విషాదంగా తయారు అవుతుంటె నాకు నోటిమాట రాకుండా వుండిపోయింది

''తన కంటె తక్కువ చదువుకుని, తన కంటె అందంగా కూడా లేని అనేక మందికి తను చూస్తూ వుండగానే పెళ్ళిళ్ళు జరిగి అత్తవారింటికి వెళ్ళిపోతుంటె, తన జీవితంలో ఇలాంటి శుభ దినం అసలు వస్తుందా అన్న అనుమానం కలగేది సుమిత్రకి తమ అక్కయ్యలు ఇద్దరికీ పెళ్ళి అయింతరువాతనే కదా తన పెళ్ళి ప్రసక్తి వాళ్ళకి అయి తన వంతు రావాలంటె ఇంకెంత కాలం ఎదురు చూడాలి ? ఈ పరిస్థితులలో తనకి పెళ్ళి అవుతుందని నమ్మకంలేదు అలాంటప్పుడు ఇక జీవితాంతం ఈ నాలుగు గోడలమధ్య వుండి పోవలసిందేనా అన్న ప్రశ్న వుదయించింది

తను చదువుకుంది తెలివితేటలున్నాయి ఆరోగ్యంగా, అందంగా వుంది కేవలం పెళ్ళి కాలేదు పెళ్ళికానంత మాత్రాన, జీవితంలో మరో అనుభూతి, ఆప్యాయత, ఆనందం, మార్పు లేకుండా ఎందుకు పోవాలి ? అసలు తనని బయటకు కదలకుండా చేసి నిత్యం మరణానికి గురిచేస్తున్న ఈ సమాజం, సమాజం యొక్క కట్టుబాట్లు పై అసహ్యం కలిగింది సుమిత్రకి

ఇలా ఇక్కడ ఈ మారుమూల గ్రామంలో నాలుగు గోడల మధ్య మగ్గిపోయేకంటే, బయటి ప్రపంచంలోకి వెళ్ళి స్వయంగా ఏదైనా పని చేసుకుని బ్రతకాలన్న కోరిక బలీయం కాసాగింది

బయటకు పోయే మార్గం లేదు మార్గం వున్నా ఎక్కడికి వెళ్ళాలి? ఎవరు సహాయం చేస్తారు ? ఎవరి సహాయం లేకుండా ఆడపిల్లగా తను ఏం చేయగలనన్న అధైర్యం

ఇంతటి ఆరాటం, ఆత్రుత, మానసిక సంఘర్షణలో కొట్టుకుంటూండగా, జీవితంలో ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదన్న నిర్ణయానికి వచ్చింది సుమిత్ర

సరిగ్గా అలాంటి సమయంలో కమలను తీసుకుని నేను ఆ వూరు వెళ్ళాను

కమల, సుమిత్ర ఇరుగు పొరుగు కావటంలో ఇద్దరూ బాల్య స్నేహితులు

మాటల సందర్భంలో నా వుద్యోగం, నా చదువు, అర్హత, నా పలుకుబడి, నా మంచిదనం గురించి వున్నవీ లేనివీ గొప్పకోసం సుమిత్ర ముందు చెప్పింది కమల

అవన్నీవిని తనని ఈ ఊబినుంచి బయటకు తీసుకు రాగలిగే వ్యక్తి నేను తప్ప తనకు మరొకరు లేరు అన్న నిర్ణయానికి వచ్చింది సుమిత్ర


తన బాధ అంతా విన్న తరువాత నేను తనకి సహాయం చేయకుండా వుండలేనని నమ్మింది ఒకవేళ నేను కాదంటె అప్పుడే ఆత్మహత్య చేసుకోవచ్చు అనుకుందిట ''

''నీ నుంచి ఎలాంటి సహాయం కోరింది'' అన్నాను చాలా సేపటి తరువాత నోరు విప్పి

''పండగ మరునాడు నేను తిరిగి హైదరాబాదుకు వెళుతున్నట్లు కమల ద్వారా సుమిత్రకి తెలిసింది

తనని ఎలాగైనా నాతోపాటు హైదరాబాద్ తీసుకువెళ్ళి అక్కడ ఏ అనాథశరణాలయంలోనో, స్త్రీ సంక్షేమ గృహంలోనో చేర్పిస్తే, తను చదువుకుంది కాబట్టి ఏదో వుద్యోగం సంపాదించుకుని తన తండ్రికి ఆర్థికంగా సహాయపడటమే కాక, తన జీవితానికి ఓ సార్థకత ఏర్పరచుకోవాలని వుందని వ్రాసింది తాను పుట్టిం తరువాత తాలూకా పొలిమేరలు కూడా దాటి ఎక్కడికీ వెళ్ళలేదు చేతిలో డబ్బు లేకుండా తానెరగని బయటి ప్రపంచంలో ఒంటరి ప్రయాణం తనకసాధ్యం అంది ఇంత విని కూడా నాకు తనపై జాలికలగకపోతే, మరుక్షణం పెరటిలోగల బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని — అంది ''

''నువ్వు ఏం చేసావు ?'' అన్నాను నేను



ఈ సమాజం బాగుపడదు

''ఎవరు ఎలాపోతే నాకెందుకులే అని వూరుకోలేకపోయాను ఆమెను హైదరాబాదు తీసుకువెళ్ళి ఏ హాస్టలులోనైనా చేర్పించటం అసాధ్యం కాదనిపించింది ''

''తరువాత''

''తరువాత ఇద్దరం విడిగా విజయవాడ చేరుకున్నాము విజయవాడ నుంచి రాత్రి బస్సులో బయలుదేరి హైదరాబాదు చేరుకున్నాము కమల పుట్టింటిలో వుంది కాబట్టి మా ఇల్లు కాళీగా వుంది అందువల్ల తిన్నగా బస్ డిపో నుంచి సుమిత్రను తీసుకుని మా ఇంటి వచ్చాను అయితే హాస్టలులో చేర్పించటం నేను వూహించినంత సులభం కాదని గ్రహించాను ఈలోగా ఓ వారం రోజులు గడిచాయి ''

''తరువాత ఏం జరిగింది ''

''ఈ వారం రోజులలో జరగకూడని భయంకరమైన, విషాద సంఘటనలు జరిగాయి ''

''అంటే !''

''ఆ రోజు రాత్రి సుమిత్ర కనపడక పోవడం, అదే రోజు నేను హైదరాబాదు బయలుదేరటం వల్ల, ఫలనా వారి అల్లుడు సుమిత్రను లేవదీసుకుపోయాడని పుకారు పుట్టింది '

''ఎలా కలిగిందో అనుమానం ''

''అంతకు ముందు సుమిత్ర గోడమీద నుంచి నాకు కాగితాలు అందించటం ఇరుగు పొరుగువారు చూసివుంటారు అది కేవలం పుకారేనా లేక నిజమో తెలుసుకోవటానికి మా బావమరిది ఓ రోజున హైదరాబాదు వచ్చాడు అప్పుడు సుమిత్ర, నేను మా ఇంటిలో ముందు రూములో కూర్చునివున్నాము మమ్మల్ని చూసిన అతను, నాతో మాట్లాడకుండానే, నేను చెప్పేది వినకుండానే వెనుతిరిగి వెళ్ళిపోయాడు వెళ్ళి రామాపురంలో అది పుకారు కాదని, నిజమని నిర్ధారించాడు

దాంతో కూతురు లేచిపోయిందనే అవమానంతో సుమిత్ర తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు ''

''అయ్యో !'' అంటూ కొయ్యబారిపోయాను నేను

''ఇలాంటి ఘోరం జరుగుతుందని అప్పుడు వూహించలేకపోయాను ప్రవాహంలో మునిగిపోతున్నవాడికి చేయూతనిస్తూ, తోటి మానవుడిగా ఆ మాత్రం సహాయపడటం నా కర్తవ్యం అని భావించాను కానీ ఇంత దూరం ఆలోచించలేకపోయాను'' అన్నాడు రమణమూర్తి

''తరువాత ''

''అయిందేదో అయిందనీ సుమిత్రకి ధైర్యం చెప్పాను ఎలాగో తంటాలుపడి ఓ ప్రైవేటు ఫరంలో ఉద్యోగం వేయించాను తరువాత సుమిత్రను మా ఇంటినుంచి తీసుకువచ్చి ఆమె బస ఈ రూములో ఏర్పాటు చేసాను ''

''ఇప్పుడెక్కడ వుంటూంది ?''

''కొన్నాళ్ళకి సుమిత్రకి సెక్రటేరియెట్‌లో జాబ్ వచ్చింది ఆ తరువాత ఆమె ఈ రూము ఖాళీచేసి వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌లోకి మారింది ఆమె ఖాళీచేసినా ఈ రూము నా కింద వుంచుకున్నాను అప్పుడప్పుడు ఇలా వుపయోగపడుతూంది ''

''మరి సుమిత్ర అక్కయ్యలకెవరికైనా పెళ్ళి అయిందా ?''

''తెలియదు ఆ తరువాత నేనుగానీ, సుమిత్రగానీ ఆ వూరు వెళ్ళే ధైర్యం చెయ్యలేకపోయాం సుమిత్రవాళ్ళ అక్కయ్య పేరున డబ్బు పంపితే తీసుకోకుండా తిప్పి పంపిందట ''

''మరి నీకు ఈ మందు ఎప్పుడు అలవాటు అయింది ''

''కమల మరణించిన తరువాత ''

''వ్వాట్ ! నీ భార్య చనిపోయిందా ! ఎలా ?''

''నేను సుమిత్రను లేవతీసుకుపోయానని అందరితోపాటు కమల కూడా నమ్మింది దానికి వాళ్ళ అన్నయ్య మమ్మల్ని చూసి నిర్ధారించటం తోడూ అయింది పెళ్ళి అయిన ఏడాది తిరక్కుండానే తన జీవితం నాశనం అయిపోయిందన్న దిగులుతో నెలలు నిండకముందే డెలివరీ వచ్చి చనిపోయింది మా మామగారు తప్పదు కాబట్టి నాకు తెలియపరిచాడు ఓ కార్డుముక్క ద్వారా ''

''నీ జీవితంలో ఇంతటి కష్టానికి కారణం అయిన సుమిత్రమీద నీకు కోపం లేదా ''

''లేదు పైగా, ఆమెను ఏదో వుద్ధరించాలని ఆమె జీవితంలోకి నేను ప్రవేశించి, ఆమె తండ్రి మరణానికి కారణం అయి, తరువాత సమాజంలో ఆమెకు చెడ్డపేరు కూడా తెచ్చిపెట్టినందుకు నాపై నాకు అసహ్యం కలుగుతూంది ఇంకా చెప్పాలంటె, నిజానిజాలు తెలుసుకోకుండా ఘోరమైన పరిణామాలకు దారితీసే పుకారు లేవదీసిన వారిపై కసిగా వుంది పెళ్ళి కానంత మాత్రాన ఇల్లు కదలకుండా ఆడపిల్ల పడివుండాలనే సాంఘిక నియమాలపై అసహ్యంగా వుంది ఒక స్త్రీ ఒక పురుషుడు కలిసివున్నంత మాత్రాన వాళ్ళిద్దరిమధ్య 'అది' తప్ప మరో సంబంధం లేదనే సమాజాన్ని బాగుచెయ్యాలని వుంది'' అన్నాడు రమణమూర్తి ఆవేశంగా

''కానీ ఈ సమాజం బాగుపడదు'' అన్నాను నేను ఆఖరు పెగ్గు గొంతులో పోసుకుంటూ ★

హైదరాబాదు నోట్‌బుక్


ఆర్. టీ. సి. కి సలహా.....

మన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు ఏటా బస్సు ఛార్జీలు పెంచడంలో చూపే శ్రద్ధలో ప్రయాణీకుల పట్ల నూరో వంతు చూపినా ఎంతో మేలనిపిస్తుంది. ఈమధ్య బస్సులు చూస్తుంటే ఆర్.టీ.సి.కి ఇంత దారిద్ర్యం వచ్చిందా?– అనిపిస్తుంది. డబుల్ డెక్ బస్సులలో సీట్లుండవు. మేకులు పొడుచుకు వచ్చిన బల్లలూ, చట్రాలు మాత్రమే ఉంటాయి. కొన్నిట్లో అనుకొనే భాగానికి కుషన్లుండవు. అంతా బోలు. మామూలు బస్సుల్లో చాలా వాటికి కిటికీ తలుపులు తెరలు ఉండవు. వర్షానికి, చలికి ప్రయాణీకులు బాధపడవలసిందే. ద్వంద్వాలకు అతీతులుగా వుండాలనే ఉపదేశం ఇస్తున్నారోయ్ ఆర్.టీ.సీ వాళ్ళు మనకు–అన్నాడొక మిత్రుడు. కొన్నిటిలో ఇరు వైపుల ఒక్క వరుస సీట్లు, నిలబడడానికి కప్పుకు నాలుగైదు కాల దండాలు. ఇక స్టాపులో ఆపడ మనేది డ్రైవరుకు నామోషీ. ప్రయాణీకులను మర్యాదగా పిలవడమనేది కండక్టరుకు నామోషీ. ఫైసలీ, పద, యాడ చూస్తున్నావ్, సిల్లర మా ఇంట్లకెళ్ళి తెమ్మంటావా?, ఓహ్! నీ సొంటోళ్ళను మస్తు చూసినం, దిగు, దిగు, ముందకు పొమ్మంటుంటేఇవీ ప్రయాణీకులను కండక్టర్లు సత్కరించే మాటలు. ప్రతి సంస్థా మర్యాద వారం జరుపుతుంది గదా. ఆర్.టి.సి కూడా జరిపితే. ఆ వారమన్నా ప్రయాణీకులు సంతోషిస్తారు. ఇక వాటి టైమింగ్స్ గురించి సమయ పాలకులయిన సూర్యునికిగానీ, కాలునికి గానీ తెలీదు. అందువల్లే మిత్రులు శ్రీ ఎన్. సి. శేషాచార్యులు అవసరానికి రానిది ఆర్టీసీ అని నిర్వచించారు. ఆపదలు కలిసి వస్తాయట–అలాగే ఆర్.టి.సీ బస్సులూనూ–అన్నాడు మరొక మిత్రుడు. టైమింగ్స్ విషయంలో కాదుగాని, సీట్ల విషయంలో నాదొక సలహా. నా సలహా వల్ల రవాణా సంస్థకు కోట్ల వ్యయం తగ్గుతుంది. ద్వితీయ ప్రపంచ యుద్ధ సమయంలో పరిశ్రమలన్నిటిని యుద్ధోన్ముఖం చేయడంవల్ల, లారీలవంటి స్టేషన్ వాగన్లను ప్రవేశపెట్టారు. వాటిలో సీట్లు వుండవు. ఇప్పుడు బస్సుల్లో ఉన్న పట్టుకొనే కమ్మీలలాంటివే ఏడెనిమిది వరస లుండేవి. వరసకు కనీసం 15 మంది సందు లేకుండా నిలబడేవారు. అలా నూరు, నూట ఇరవై మంది పయనించేవారు. ఎలాగూ కొందరు స్టాండింగు ప్యాసెంజర్లు ఉన్నారుకదా! తక్కిన వారు మాత్రం ఎందుకు కూర్చోవాలి? నిలబడనీ. ఆదాకు ఇది చాల మంచి మార్గం. ఈమధ్య కొన్ని ప్రైవేటు బస్సులు, కంపెనీల బస్సులు పోలీసుల కనుగప్పి, ఆర్.టి.సీ. బస్సులకు పోటీగా జంట నగరాలలో నడుస్తున్నాయి. అవసరాన్ని బట్టి ప్రయాణీకులు

ఎక్కి, మామూలు చార్జి కంటే ఎక్కువ చెల్లించి వెళ్ళుతున్నారు. ఇది చట్ట విరుద్ధం. ఈ దొంగ పయనాలను నిరోధించడానికి ఆర్. టి. సీ. ప్రయత్నించాలి.

రాష్ట్రపతి సమక్షంలో రాధిక ఆంధ్ర నాట్యం

ప్రాచీన కాలంలో దేవాలయాలలోను, రాజాస్థానాలలోను, పండిత పరిషత్తులలోను కళాకోవిదులు భరత నాట్యం ప్రదర్శించేవారు. ఆ సంప్రదాయం నేడు అంతరించిపోతున్నది. దానిని పునరుద్ధరించి ప్రచారంలోకి తేవడానికి సుప్రసిద్ధ నాట్యాచార్యులు శ్రీ నటరాజ రామకృష్ణ ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడెమీ సహకారంతో కళావేత్తలను సమావేశ పరచి నాట్య శిక్షణ క్రమాన్ని సిద్ధపరచి ఆంధ్ర నాట్యం అనే పేరు పెట్టింది. దానిలో శ్రీ పతివాడ సూర్య నారాయణ పుత్రిక కుమారి రాధిక తొలిసారిగా శిక్షణ పొందింది. శ్రీ నటరాజ. రామకృష్ణ ఆమెను గొప్ప నర్తకిగా తీర్చి దిద్దారు. కుమారి రాధిక జులై 26వ తేదీన రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ సమక్షంలో గంట సేపు ఆంధ్ర నాట్యం ప్రదర్శించింది. తొలుత పుష్పాంజలి. విఘ్న రాజాకు అంకితంగా చేసే పూజా నర్తనమైన వినాయక కవుతం, పిదప సంధ్యా కాలంలో శ్రీశైల మల్లికార్జునునికి అంకితమైన శి: కైవారం, శ్రీ నారాయణ తీర్థుల తరంగం, తూర్పు కలాపమాని విఖ్యాతి గాంచిన నవ జనార్దన పారి జాతం శాస్త్రీయంగా గురువుకు తగిన అం వాసినిగా శ్రీ నటరాజ రామకృష్ణ మాటలలో లలి లలితంగా ప్రదర్శించింది కుమారి రాధిక. నట్టు వాంగం శ్రీ నటరాజ రామకృష్ణ నిర్వహించారు రాష్ట్రపతి ముగ్ధులై ఆమెకు ఒక మెమెంటో బహూక రించారు. కుమారి రాధిక ఆంధ్ర నాట్యాన్ని దిగ్దిగం తాలకు వ్యాపింపజేసి, తెలుగు పతాకన ఎగురవేయు గాక!



రాష్ట్రపతి నిలయంలో ఆంధ్ర నాట్యం ప్రదర్శించిన కుమారి పతివాడ రాధిక

ఉపశ్రుతి:—

మీ బస్సు కండక్టర్లు ఎందుకుసార్ అలా మాట్లాడుతున్నారు? అని అడిగారు పరదేశం నుంచి వచ్చిన ఒక పెద్ద మనిషి. వారు అంతేనండీ. ఫ్యాక్టరీ యజమాని ఎలా మాట్లాడతాడు కార్మికులతో? ఇంటి యజమాని అద్దె వాళ్ళతో ఎలా మాట్లాడతాడు? అలాగే బస్సు అధినేత అయిన కండక్టరూను – అన్నారు పక్కన ఉన్న వారు.

—తిరుమల రామచంద్ర

ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

ముఖ చిత్రం

ఒక్కసారి ముఖ చిత్రం సూపర్ స్టార్ నటశేఖర్ కృష్ణ శ్రీదేవిని జంటగా చూడాలని వుంది తప్పకుండా మా కోరిక తీర్చుమని మనవి

టి నాదమునిరెడ్డి అత్తూరు

వ్యక్తిగతం

నేను ప్రతి వారము వెలువడే మీ పత్రికయందు ప్రత్యేకంగా చదివేది వ్యక్తిగతం ఎందరో మహా వ్యక్తుల గూర్చి చదివాను ఇలాగే స్వర్గస్తులు అయిన జులుఫీకర్ అలీ భుట్టోగారి గూర్చి చదవాలని కోరిక గలదు

యం డి ఎజాస్ ఇల్లెందు

అన్నిటినీ మించింది!

ముఖ చిత్రం రేవతి ఎంత బాగున్నా దుబాషీగారి మారని లండన్ కంటే తపో భూమి గుత్తికొండ బిలమును మించిన ఎవరెస్టు విజేత బచేంద్రిపాల్ కంటె గూడా దోసకాయ పప్పు అమోఘం గుం సు దీక్షితులుగారి కొతిమేరతో గూడిన దోసకాయ పప్పు రుచి చాలా బాగుంది దోసమటం చెరింగిన తిరపతి కవుల మీసం సగ బాగమే ఐనా సవ్యంగా ఉన్నది ఇంటిల్లిపాదినీ అలరించి నవ్వించిన దోస ఆవగూడ అబ్బ ఎంత బాగుందండీ? యీ వారం స్పెషల్ దోసకాయ పప్పు అన్నిటినీ మించిన అనురాగం సంపాదించింది దీక్షితులుగార్కి దన్యవాదాలు!

శృంగవరపు వెంకటేశ్వరరావు విజయవాడ 520008

హైదరాబాద్ నోట్‌బుక్

శ్రీ కె ఎస్ కోదండరామయ్యగారిని గురించి హైదరాబాద్ నోట్‌బుక్‌లో వ్రాసిన దానిలో కొన్ని తప్పులు దొర్లాయి ఆయన వయస్సు 75 సంవత్సరాలు ఆయన పుట్టిన తేదీ 6-8 1909 ఆయన చిత్తూరులో మద్రాసు సైదాపేటలోని టీచర్స్ ట్రయినింగ్ కాలేజీలో ఎల్ టి చదివారు ఆయనకు ముగ్గురు కమార్తెలు ముగ్గురు కుమారులు ఆయన భార్య శ్రీమతి సీతమ్మగారి వయస్సు 67 సంవత్సరాలు

ఎ వి శివరామయ్య హొసూరు

శ్రీ శివరామయ్యగారికి చాల కృతజ్ఞుణ్ని శ్రీ కోదండరామయ్యగారు తిరుపతిలో పండితుల వద్ద చదువుకొన్నానని నాతో చెప్పారు అందువల్ల అలా వ్రాశాను తక్కిన వివరాలు తెలుసుకొన్నందుకు కృతజ్ఞుణ్ని

తిరుమల రామచంద్ర

విజయశాంతి

మా అబిమాన నటి శ్రీదేవి తెలుగు తెరకి దూరం అయిన తరువాత అంతటి గ్లామర్ క్వీన్ విజయశాంతి ముఖచిత్రం మా (మీ) ఆంధ్రసచిత్ర వార పత్రికకు ఎంతో ఆకర్షణీయంగా ఉంది ఆ ముఖ చిత్రం నా మనసులో ఒక సంచలనం సృష్టించి ఈ కవితకు శ్రీకారం చుట్టింది

ఆహుతి

నా రాణిగా వలచినందుకే
చేశావు ఎదలో గాయం
నీ మదిలో రాజు ఎవరైనా
ఈ జన్మకు కలిసే ఆశ లేకున్నా
అడ్డదారులు తొక్కని నేను
నీ రూపం మరువ లేక
కోపంతో రగిలే నీ అగ్ని జ్వాలలో
అయిపోతున్నా ఆహుతి

గోపీనాద్ కాకినాడ

కదలు

27 7 84 విజయశాంతి ముఖ చిత్రంతో వెలువరించిన ఆంధ్ర పత్రిక సంచికలో కాకాని కమలగారి అమ్మ కద మా హృదయాలని కదిలించి వేసింది చిన్న ఎల్లల మనసులు లేతగా వుంటాయి వాటిని తెల్సుకుని మనము పెద్ద వాళ్ళము సున్నితంగా మసలుకోవాలి

జి వి రమణమూరి ఇతరులు హైదరాబాదు

అద్భుత వ్యాక్యులు

(22 వ పేజీ తరువాయి)

కాబట్టి తనకు మోసం చెయ్యవలసిన అవసరం లేదనీ ప్రకటించింది

కొన్ని కొన్ని శక్తుల గురించి ఉదంతాల గురించి వింటూంటే ఇవి నిజమా? కట్టు కదలా? అని అనిఎస్తుంది సత్‌సంకల్పంతో వాటిని పరిశోదిస్తే అందులోని సత్యం గోచరిస్తుంది కానీ కొంతమంది విమర్శకులు ముందుగానే ఒక అబిప్రాయాన్ని ఏర్పరుచుకుని తాము పట్టుకున్న కుందేటికి మూడే కాళ్ళనే వితండవాదంలోకి దిగుతారు అటువంటి కువిమర్శకులను నిర్లక్ష్యం చేయడమే ఉత్తమమైన పద్ధతి మనిషి తన మెదడులోని శక్తినంతా వినియోగించుకున్ననాడు ఇంతకన్నా అద్భుతాలు ఇంకా ఎన్నో చేయగలుగుతాడు


(వైవారం

భూగర్భ నిది నిక్షేపాలను డౌసింగ్ ద్వారా కనుగొన్న లేత్‌బ్రిడ్జి)

Printed and Published by S Nageswara Rao at the Andhra Patrika Press Mallikarjuna Rao Street Gandhinagar Vijayawada 3
Editor S Radhakrishna

క్రొత్త

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం



అధిక
రుచికరం
అధిక
సంపూర్ణం



ప్రేమతో మీరు పెట్టే ప్రతి చెంచాడు పాపాయి పెరుగుదలకు మంచిది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

కలపడం సులభం. పాపాయికి తినిపించడం సులభం.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

పాపాయి పెరుగుదలకు అత్యావశ్యకమైన ప్రోటీన్‌తో సమృద్ధం. ఆరోగ్యవంతమైన రక్తంకోసం అదనంగా ఐరన్ కలిగినది. గట్టి పళ్లు, ఎముకలకోసం సరియైన నిష్పత్తిలో కాల్షియం మరియు ఫాస్ఫరస్ కలిగినది. పాపాయి సున్నిత జీర్ణశక్తికి అనువుగా ముందుగానే పచనం చేయబడినది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

పతి చెంచాలో అధిక సంపూర్ణ ఘన ఆహారం.

CLARIC

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA

పిప్పరమెంట్, లవంగ నూనెల
అపూర్వ సమ్మేళనం

జెమిని

పళ్ళ పొడి



జెమిని కెమికల్ ప్రొడక్ట్స్

పి.బి.నెం.7, మచిలీపట్నం-521 001.